శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారిప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము ౨౭ } బహుధాన్యనామసంవత్సరము. మార్గశిర—ఫాల్గునములు. { సంచిక. ౫-౬.

మిత్రస్మృతి.

మోచర్ల హనుమంతరావుగారు.

చ. కనికర మించుకంతయును గల్గను మృత్యువు తోడునీడవై
వెనుకొని యుండు మానవుని వెఱ్ఱియెకాని జగాన సుస్థిరం
బనుకొనరాదు దేనిని నహర్నిశముంబలె ప్రాణికోటికిన్
జననము మృత్యువుంగలుగు సాజముగా మహిఁ గాలనిర్మితిన్. 1

ఉ. ఆసలుపోవు జీవితమునందలి మోహము పోనిపోదు సం
త్రాసము మృత్యువన్న నది తప్పనిదైనను జీవధారికే
గాసియులేక యింటికి సుఖంబుగ నేగి భుజించుచో సనా
యాసపు మిత్తిఁగాంచితిగదయ్య మహాత్ముఁడవీవు మిత్రమా ! 2

తే.గీ. అస్తమించెను సూర్యరా వస్తమించె
గ్రొత్తపల్లి కులాంభోధి కువలయాప్తుఁ
డాప్తబాంధవదారాసుతాళి వీడి
యాంధ్రలోకము బహుళ దుఃఖాబ్ధిముంచి. 3

చ. విమలయశోనిధాన యెటువీడఁగఁజాలితి ముప్పదేండ్లనుం
డి మనకుఁ గల్గు స్నేహలత నేఁడు నికృత్తమొనర్చి, యయ్యుమా
రమణ పదారవింద మకరందమునందలి మేఁటియాస న
శ్రమ మరణంబుఁ గాంచితివె శాశ్వత దివ్యసుఖాభిలాషివై 4

మ. తన దారిం జనుగాని తానితరసందర్భంబులం బోని స
జ్జన మాన్యుండగు పుణ్యమూర్తి బహుభాషాజ్ఞానసంపన్నుఁ డె
వ్వనికిం గీడుఁ దలంపనట్టిఘనుఁ డాపద్బంధుఁ డీరీతివాఁ
డనుచున్ మిత్త్రముఁగూర్చి స్తోత్రమును జేయం జాల, నే నిచ్చటన్.

క. హనుమత్సూర్యకవీశ్వరు
లను పేరునఁ బుస్తకంబు లలరింతమటం
చును నీవు కొన్ని వ్రాసితి
వనఘా నీవలర వ్రాయనైతి నొకటియున్. 6

మ. నవలల్ నాటకరాజముల్ మఱిప్రబంధంబుల్ మహావ్యాసముల్
వివిధంబుల్ బలుపోకడల్గల వరబ్బీమున్నుగాఁ గల్గు నూ
త్న విదేశీయ కళానువాదములు గ్రంథంబుల్ వినిర్మించినాఁ
డవు గన్నాఁడవు కీర్తి నల్దిశలు నిండన్ సూర్యరాయాగ్రణీ ! 7

మ. కొడుకుం గోడలు లేరు దగ్గఱని నీకుం జింతలేకుండ న
ల్లుఁడునుం గూతురొకర్త భక్తిఁగను నాలున్ జెంతనేయుండ నొ
క్కడుగుంగూడ మెదల్ప కొక్కనుడియేం నాడంగలేకుండ గ్రు
క్కెడు ప్రాణంబు హఠాత్తుగా విడిచి ముక్తింగంటివే మిత్త్రమా ! 8

చ. అఱువదివర్షము ల్కలియుగాయువటందురు నీకు నర్వదై
దరిగెఁ బ్రయోజకుండు సుతుఁ డన్నిట ధన్యుఁడవీవు కాలమె
వ్వరికిని నొక్కరీతి నిలువంబడ దుత్తమలోకముం దయా
పరుఁడగు నీశ్వరుండు సులభంబుగ నీకొసఁగున్ సుహృద్వరా. 9

తే.గీ. ఆంధ్రసాహిత్యపరిషత్తు నందుఁజాల
కాలమునుండి నిర్వాహకత్వమూని
చేసితివి సేవ, మృత్యువు చెంతకొక్క
గంటకే తెంచువఱకు, నొక్కగతినీవు. 10

తే.గీ. నిన్ను విడువంగలేక మే మిన్నిగతులఁ
జింత వాపోవుచుంటి మేచింతలేక
పరమపదమార్గమును బట్టి యరుగు నీకు
శాంతి సుఖమిచ్చుఁగాత మీశ్వరుఁడు సఖుఁడ. 11

కవిత్వకళ.

— శిష్టా రామకృష్ణశాస్త్రిగారు, బందరు. —

పాశ్చాత్యులు చిత్రలేఖనము, విగ్రహరచన, కవిత్వము మొదలైన లలితకళ లనుకరణకళ లని పేరిడిరి. దీనికిఁ గారణము వానియం దనుకరణము ప్రాముఖ్యమగుటయే. సంస్కృతాలంకారికులు లలితకళలలో నొకటైన నాటకముఁగూర్చి చెప్పునపుడు "అవస్థానుకరణం నాట్య" మ్మని నిర్దేశించిరిగాని తక్కిన యే లలితకళకు ననుకరణ మాపాదించినట్లు లేదు. పాశ్చాత్యులలోఁ గొందఱు గానమునకుఁగూడ ననుకరణ మాపాదించిరి. కొందఱకిది నచ్చలేదు. కాని మిగిలిన లలితకళ లన్నిటికి ననుకరణత్వ మంగీకరించిరి.

అనుకరణము మానవస్వభావము. అది ప్రతిమానవునిహృదయమునందుఁ బాదుకొనియున్నది. ప్రకృతిని జిత్రకారుఁడు రమణీయమైన వర్ణములమూలమునను, విగ్రహరచకుఁడు మృత్తికమూలమునను, గాయకుఁడు మధురనాదముమూలమునను, కవి శబ్దసౌందర్యమూలమునను ననుకరించి దాని మహత్త్వమును గ్రహింతురు. విగ్రహరచకుఁ డొకస్థితియందున్న యొకవ్యక్తినిమాత్ర మనుకరింపఁగలఁడు. చిత్రలేఖకుఁ డొకదృశ్యమునుమాత్రమే పటమునందనుకరింప సమర్థుఁడు. కాని కవి భిన్నములైన వివిధపాత్రలను దృశ్యముల నొక్కమాఱు ప్రదర్శింపఁగలఁడు. చిత్రకర్మవిగ్రహరచనలలో క్రియారూపమగు చలనము చూపుటమాత్రము సాశ్యముగాదు ఇది కవిత్వమున సాధ్యమగును. ఈకారణముచేతనే యాకళ వస్తువును సాక్షాత్కరింపఁ జేయును. అనుకరణము కవిత్వమునందు సాగినంతగ నితరకళలందు సాగదు. ఇట్టి విస్తృతియు, చైతన్యమును గలుగుటచేతనే కవిత్వము మిగిలినకళలకంటె శ్రేష్ఠమయ్యెను.

'రసాత్మకం వాక్యం కావ్య' మ్మని చెప్పునపుడు రసాత్మకత్వము శబ్దమునకంటె నర్థమున కెక్కువప్రాముఖ్యమని పండితులంద ఱంగీకరింతు

రు. కాన రసాత్మకమైన యర్థము లేక భావము కవిత్వమనఁబడును. ఆ భావమును వ్యక్తీకరించునది భాష. కానఁ గవిత్వమునకుఁ బ్రాతిపదిక భావము. తత్కాలమున వర్ణింపఁబడిన మానవమానసికవ్యాపారములు ప్రతికాలమువారు దమస్వానుభవములకు సరిగానుండుటను గ్రహించి యానందించుటచేతను, నితరదేశీయుల కావ్యములందలి భావముల మనము చదివి మన యనుభవములకుఁగూడ సమన్వయించుకొని యానందింపఁ గలిగి, యాభావములను భాగములను మనము మన భాషలోనికిఁ బరివర్తనము చేసికొనుచుండుటచేతను, మానవమానసికప్రవృత్తులు సర్వకాలములందు నొక్కవిధముగనే యుండుననుట నిశ్చయము. భాషభిన్నమైనను, భావములు విశ్వజనీనములగుటచేతను, గవిత్వ మాభావముల వ్యక్తీకరణమే యగుటచేతను, గవిత్వము విశ్వజనీన మని యొప్పుకొనవలసి వచ్చుచున్నది.

అరిస్టాటిలు తనవిమర్శనశాస్త్రమందు మూఁడుప్రధానలక్షణములఁ దెలిపెను. ఒకటి, యితరలలితకళలతోఁబాటు కవిత్వముయొక్క కర్తవ్య మనుకరణముగాని యుపదేశముగాదు. రెండు, కవిత్వమనుకరింపఁదగిన విషయము విశ్వజనీనమై యుండవలెఁగాని ప్రత్యేకవ్యక్తిగతము కాఁగూడదు. మూఁడు, కవిత్వోత్కృష్టతను బరీక్షించు ప్రయోజన మే మన సది శాశ్వతమైన యానందము సంఘమునకుఁ గూర్పవలెఁగాని కవికిమాత్రము గలుగఁజేసినఁ జాలదు.

కళలయం దనుకరణము మూలమునెంత సమీపించిన దానియోగ్యతయంత పెరుఁగును. కాని సంపూర్ణముగ నేవస్తువునైన ననుకరించుట యేకళకైనను సాధ్యముకాదు. మఱియుఁ గళాకార్యమునకు సంపూర్ణానుకరణ మనావశ్యకము. ఎందుకనఁగా కళపని వస్తువును గుర్తించుటకుఁ గావలసిన ముఖ్యధర్మముల మనస్సునందుఁ బ్రతిబింబింపఁజేయుటయే గాని, దాని సూక్ష్మములైన వివిధాంగోపాంగముల జ్ఞానము మనమెదడున తికకించుటకాదు. కవి తన యింద్రియములకు గోచరించునట్లు ప్రపంచము

ననుకరించునుగాని, మూలమునకు నకలుసేయఁ జూడఁడు. మఱియుఁ గవిత్వము ప్రతిప్రాకృతిక వ్యాపారము ననుకరింపదు. ప్రపంచమునఁ గుత్సితవస్తువుల నేకములున్నవి. కవిత్వము వాని జోలికిపోదు. కనుకనే యేమహాకవియు నాహారాది శారీరకక్రియలను వర్ణింపఁడు. సంస్కృతాలంకార శాస్త్రములందుఁ గూడ వానిఁ జూపింపగూడ దను నిషేధముగలదు. లలితకళలు నైతికలక్షణములను, హృదయపూర్వకముగఁ జేయఁబడినకార్యములను మాత్రమే యనుకరించును, మానవజీవితమును,—శీలము, ఆవేశము, చేష్టలు—నింద్రియగోచరమగురీతిని కళయనుకరించును. అందుచే భూసీమ, మృగవృక్షపక్ష్యాదులు ముఖ్యానుకరణవిషయములు గావు. చర్యలకు రంగస్థలముగ నుండుటకై యివి బాహ్యప్రపంచమునఁ బ్రవేశపెట్టఁబడును. అనుకరణము రెండువిధములు. మొదటిది బహిరంగానుకరణము. ఇందు వస్తువుల బాహ్యరూప మనుకరింపఁబడును. రెండవది యంతరంగానుకరణము, ఇందుఁబాత్రల భావము లనుకరింపఁబడును. బహిరంగానుకరణముకంటె నంతరంగానుకరణముసేయు కళయే జనుల నెక్కువ యాకర్షించును. వస్తువుయొక్క యంతరంగమును జక్కఁగభావనచేసి యనుకరింపఁగల్గిన శిల్పిగల్గెనేని మనము సామాన్యముగ నావశ్యకములని తలఁచు బైటియంగములుగూడఁ గొన్ని నిరర్థకము లనిపించును. అట్టియంతరంగానుకరణము కష్టసాధ్యము.

ఇట్టి యనుకరణము విశ్వజనీనమైయుండవలయును గాని ప్రత్యేకవ్యక్తిగతమైయుండరాదు. ప్రపంచమందలి సకలమానవులమానసికవ్యాపారములు సర్వదేశకాలములం దేకముగనుండునని వెనుకఁ దెలిసికొంటిమి. కాన నొకవిషయముఁగూర్చి ప్రపంచమునందు సకలమానవులకు నైక్యముగ నెట్టిభావముగలుగునో యది విశ్వజనీనము. నిర్దిష్టశీలముగల యొక పాత్ర యొకానొక పరిస్థితియందుఁ దదవసరముఁ బట్టి సందర్భోచితముగ నెట్లు మాట్లాడి ప్రవర్తించునో యది విశ్వజనీనమనఁబడును. నామధారులైన పాత్రలుగల కవిత్వ మిట్టి విశ్వజనీనత్వమే లక్ష్యముగాఁ

గలది. కవి యొకానొక ప్రత్యేకవ్యక్తిగతవిషయమును గ్రహించి దానికి విశ్వజనీనతాముద్ర నొసంగును, కవిమూలమునందున్నది కొంత, యుండ వచ్చునది కొంత, యుండవలసినది కొంత చూచి యూహించి విశ్వజనీన ముగ నుండున ట్లనుకరించును. ఇదియే కళాధర్మము. సర్వజనులు విశ్వజ నీనముగ ననుభవించి భావించునొకదృశ్యము నెవఁడు చిత్రించునో వాఁడే నిపుణుఁడైన మహాశిల్పి. అతఁడే కళయొక్క మూలమునంత సమగ్రము గా నెఱిఁగినవాఁడు. ప్రకృతియొక్క విచిత్రరహస్యముల గ్రహించుట కెట్టిపద్ధతుల నవలంబింపవలెనో యతనికే తెలియును.

ఒకకథయొక్క సంఘటన పరంపరనొకటి తరువాత నొకటి యెట్లు జరిగెనో యట్లు కాలక్రమముగ 'జాబితా' వలెఁ జెప్పుట కవిత్వముకాదు. ఇది చరిత్రపని. చరిత్ర ప్రత్యేకవిషయములగుఱించి చెప్పును. కవిత్వము విశ్వజనీనవిషయములఁ గూర్చి చెప్పును. చరిత్రయందుఁ గాలక్రమము నను సరించి చెప్పఁబడిన సంఘటనలు కార్యక్రమముగ నుండునట్లు, నొకసం ఘటనమునకు మఱియొకసంఘటనమునకుఁ గలసంబంధమును కార్యకా రణరూపమునఁ గలిపి యాసంఘటనలను విశ్వజనీనములైన సత్యములు గనుండునట్లు కవిత్వము మార్చును. భూతకార్యము నున్న దున్నట్లు చెప్పు ట కవికర్తవ్యము కాదు. తదవసరపరిస్థితులంబట్టి యెట్లుజరుగునో, మఱియు నెట్లుజరుగసాధ్యమో చెప్పుటయే కవిపని. సంఘటనలమార్చి చెప్పకపో యినచోఁ గవిత్వమునకు గౌరవములేదు; మార్చిచెప్పినచోఁ జరిత్రకు గౌ రవములేదు. చరిత్రకారుఁడును గవియు గద్యపద్యములందు వ్రాయుటచే భిన్నులుగారు. శ్రీయుత చి. వీరభద్రరావుగారియాంధ్రులచరిత్రను బద్య రూపముగ రచించినను నది చరిత్రయేయనిపించుకొనును. కానఁగవిత్వము చరిత్రకంటె నెక్కువయుత్తమమును దాత్వికమునైనవస్తువుగలది. చరిత్రల యందుఁ బురాణములయందు నక్కడక్కడఁ గొన్ని రసవంతములైన యు త్కృష్టసంఘటనలుండును. కవి వానినేరి యాదర్శప్రాయముగఁ జేయును.

అద్యతనకాలమున వెలువడుచున్న భావకవిత్వ మనుపేరుగల ఖండకావ్యము లుద్రేకపూరితములయ్యు సర్వజనాదరణపాత్రము కాకపోవుటకుఁ గారణ మందలి భావములు విశ్వజనీనములు కాకపోవుటయే. అందుఁగవులు దమసొంతగోడును జెప్పుకొనుచుఁ దమప్రత్యేకవ్యక్తిగత భావములనే వెలువరించిరిగాని, తమభావములకు నితరులభావములతోఁ గలసంబంధమును విచారించి వానిని విశ్వజనీనముగఁ జేయరైరి, కవిభావములు వేఱును పాఠకజనుల భావములు వేఱునైనవి. అందుచే జనులు వారిభావములతో సహృదయత్వము నెఱపి, వారికవిత్వ మర్థముచేసికొనఁ జాలరైరి. కవిత్వమున విశ్వజనీనత్వమునకుంగల స్థానమిది.

ఇట్టివిశ్వజనీనత్వమునకు సాధారణాగత్యధర్మముల ననుసరించి యే దిసాధ్యమో యది ముఖ్యలక్షణమై యుండవలయును. కళలయందు సాధ్యమైన యసాధారణవిషయముకంటె నసాధ్యమైన సాధారణవిషయమునే గ్రహింపవలెను. సాధారణమనఁగ సామాన్యమనికాదు. సామాన్యమనఁగఁ గొందఱియందుండునది, సాధారణమనఁగ లోకమునందంతట నుండఁదగినది. కావ్యమున నసాధ్యవిషయముకంటె నసాధారణవిషయ మెక్కువదోషమైనది. ఇక్కడనే కవిత్వమునకు శాస్త్రమునకు భేదము గలదు.

శాస్త్రకవిత్వములు రెండును బ్రకృతిని బరిశోధించి సత్యమును వెలువరించుటకే ప్రయత్నించును. కాని భిన్నలక్షణముగల సత్యమును భిన్నమార్గముల వ్యక్తీకరించును. శాస్త్రము సత్యసంఘటనమును, కవిత్వము సత్యభావమును దెలుపును. శాస్త్రము భౌతికప్రకృతియందలి యథార్థవస్తువులఁ గూర్చి యున్నదున్నట్లు చెప్పును. శాస్త్రము విభజన మూలమునను, గవిత్వమనుకరణ మూలమునను దమపనిని సాధించును. కవి ప్రకృతిని రసమయదృష్టితోను, శాస్త్రజ్ఞుఁడు పదార్థపరిజ్ఞానదృష్టితోను జూచును. శాస్త్రము విజ్ఞానమును, గవిత్వ మానందమును గలుగఁజేయును. శాస్త్రమున కాధారము బుద్ధి. కవిత్వమున కాధారము

స్వానుభూతి. శాస్త్రమున కుత్పత్తి స్థానము మెదడు. కవిత్వమున కుత్పత్తిస్థానము హృదయము. శాస్త్రముయొక్క రాజ్యము సత్యము. కవిత్వముయొక్క రాజ్యము సౌందర్యము. శాస్త్రము భౌతికసత్యమును గవిత్వము నిగూఢసత్యమును దెలుపును. శాస్త్రజ్ఞుఁడు వస్తువుల రూపములు, గుణములు, నిర్మాణవిధము, సంబంధము మొదలైనవానిఁగూర్చి పరీక్షించి, వానిని వివిధజాతులుగ విభాగించి, యవి యేపరిణామధర్మమునను సరించి యట్లుండుటకుఁ గారణమయ్యెనో పరిశోధించి, కొన్నిప్రయోగములమూలమునఁ దనపూర్వాభిప్రాయమును బునఃపరీక్షచేసి నిశ్చయించును. ఈవిధముగ శాస్త్రము ప్రకృతియొక్క భౌతికరూపమునందలి యొక్కొక్క వస్తువును బరిశోధించి, వివిధవస్తువుల నొక్క సాధారణధర్మము క్రిందికిఁదెచ్చి, చివరకుఁ బ్రపంచమునఁ జెదరిన నానావస్తువులం దంతర్భూతమైనది యొకటేయని విశ్వమున కైక్యమునాపాదించును. ఈవిధమున శాస్త్రము ప్రత్యేకత్వమునందు విశ్వజనీనత్వముఁ గనిపెట్టుటకుఁ బ్రయత్నించును. ప్రత్యేకత్వమూలమున విశ్వజనీనత్వమును వ్యక్తీకరించుట కవిత్వముయొక్కలక్ష్యము. కొలని యందలి పూవును జూపి యొకసామాన్యమానవు నడిగిన నది, 'పద్మ' మని చెప్పును. శాస్త్రజ్ఞుఁడది యే జాతి పుష్పమో తెలుపును.

కవి దానినే "సరోవరసుందరి" యని యనువదించును. ఇట్లనుటచే నాసుమముయొక్క సౌందర్య సౌకుమార్యము లవగతమగును. మఱియొక కవి దానినే తేజోకుసుమమని వ్యక్తీకరించును. శాస్త్రజ్ఞుఁ డా పుష్పమునే దళములు, కాడ, కర్ణిక మొదలైన యవయవవిభాగముసేసి, దాని యుత్పత్తివృద్ధిక్షయములఁ దెలుపును. ఈవిధమున శాస్త్రకవిత్వములు రెండును సత్యమునే వెలార్చును. కాని మన మాశించునది శాస్త్రజ్ఞుని చేతియందు విభజింపఁబడిన పుష్పముకాదు. కవి పద్మపుఱేకు లుత్తరింపఁ బడుటఁ జూచినచో విలపించును. అట్లు సేయుట కాతనిచేతు లాడవు. కవికే కాదు, మన హృదయముగూడ నట్టిచర్యలకు సమ్మతింపదు. కాన

కవిత్వసత్యమునకు మనకు నెక్కువసన్నిహితసంబంధము; శాస్త్రసత్యము దూరము. ఇట్లు శాస్త్రము వస్తువులయొక్క పుట్టుక, తత్వము, జాతి, చరిత్ర మొదలైనవానితోఁ గూడుకొనిన సక్రమహేతుపూర్వకవ్యాఖ్యానము సేయును. ఇంతే. శాస్త్రజ్ఞుని ప్రజ్ఞయు, దృష్టియు దీనికి వాటి పోలేవు. ఇట్టి విజ్ఞానముగలిగినతరువాత మనకుఁ బ్రకృతికిఁగల సంబంధమెట్టిదో శాస్త్ర మెంతమాత్రము దెలుపఁజాలదు. ప్రపంచములో సామాన్యముగా మానవులందఱకుఁ బ్రకృతియందలివస్తువుల శాస్త్రవిషయకవిజ్ఞానమం దభిరుచియు నాదరణమును బహుస్వల్పము. కాని ప్రకృతికి మానవునకుఁగల సంబంధము ననుభవపూర్వకముగ గ్రహింపనెంచెదరు. శాస్త్ర మీయర్థమునఁ బ్రయోజనకారి కాదు. అందుకొఱకుఁ గవిత్వము నుపాసింపవలసినదే.

కవిత్వము ప్రకృతికి మనకుఁగల సంబంధమును, ప్రకృతిని మనము చూచురీతిని మన యోజనోద్రేకములపరమున, మన భావానుభవములకుఁ దాఁకునట్లు మానవజీవితమును వ్యాఖ్యానప్రాయముగ ననువదించును. ఇట్టి రచనగల కవిత్వము మానవుల భావోద్రేకముల నుద్బోధించు శక్తిగలిగి యున్నది. ఈశక్తియే దీని విశిష్టలక్షణము. ప్రకృతియొక్క రసావిష్టభాగములందే యుద్భవమంది యాదిక్కునుండియే కవిత్వము వ్యాఖ్యానముసేయుచు మనల నుద్రిక్తులఁజేయును. కవిత్వము ప్రకృతియందలి సౌందర్యరహస్యముల వెలార్చును. ఇవి ప్రపంచమునందంతట వ్యాపించి నిత్యము ప్రదర్శింపఁబడియున్నవి. అందఱు చూడవచ్చును. మనముగూడ ప్రకృతిలో నొక భాగమగుటచే మనలోఁగూడ నాసౌందర్యరహస్యము లున్నవి. కనుక నాగుణములమూలముననే ప్రకృతియందలి సౌందర్యరహస్యముల గుర్తింపనవకాశము గలుగుచున్నది. ప్రతి మానవుని హృదయమునందొక రసమయకోశమున్నది. కాని యనేకులం దది నిత్యవ్యవహారమందలి యనేకేతరాభిరుచులవలన నణఁచివేయఁబడుచుండుటచే క్షీణించి క్రమముగా మాటుపడుచున్నది. అందుచే

బహుస్వల్పసంఖ్యాకులు తప్ప మిగిలినమానవులందఱు నాసౌందర్య రహస్యముల నల్పవిషయములుగ నెంచి నిరసనభావముతోఁ జూతురు. కాన నది యందఱకుఁ గనఁబడుటలేదు. చూచినదికూడ వెంటనేవారు మఱచిపోవుదురు. ఇందుచే మానవులనేకు లాసౌందర్యరహస్యముల నేత్రములుండియుఁ జూడలేరు. చెవులుండియు వినఁజాలరు. హృదయముండియు భావింపలేకుందురు. కానఁ గవికిఁ బ్రకృతియందిట్టి యుపేక్షాభావ ముండదు. అతఁడు ప్రకృతిభౌతికస్వరూపము నడుగునదాగియున్న పవిత్రమైన దేవరహస్యమును దనసూక్ష్మదృష్టితోఁ జూడఁ బ్రయత్నించును. ఇట్టిశక్తి యతనికిఁ బ్రత్యేకముగ దైవముచే నొసఁగఁబడును. కొన్నిరసావిష్ట సమయములందుఁ బ్రకృతి తనగుణముల విశేషశక్తితో బహుస్పష్టముగఁ గనఁబఱచును. అపుడు మనహృదయములుసూర్యోదయమునకుఁబద్మములు వికసించునట్లు వికసించి, మేఘోదయమున నృత్యమాడు నెమిలివలె దేహము పులకరింప మనము తన్మయత్వమును బ్రహ్మానందమును బొందుదుము. అంతవఱకే మన బులుపు. ఆ యానందమును మాటలతో వ్యక్తీకరింపలేక కాళ్లుసేతులు నటునిటు త్రిప్పుదుము. మాటపెనఁగి రాదు. బలవంతముగా మాట్లాడఁ బ్రయత్నించినచో నత్తివచ్చును. ఇది మనస్థితి. కవిస్థితివేఱు. కవి ప్రకృతియిచ్చిన యా యరుదైన యవకాశమును గౌరవాదరణలతో గ్రహించి, యానందాశ్చర్యములతోఁగూడిన యొక యావేశానుభవముచే తన్మయత్వమునుబొంది, చంద్రునిగాంచిన సముద్రమువలెఁబొంగును. ఇది వానిలోనున్న తమోగుణమువలన నుద్భవించును. ఇట్టియుద్వేగము పాలుపొంగినట్లు కవిహృదయమునఁ బొంగిననేగాని కవిత్వ మున్నతపదమునొందఁజాలదు. ఆ యుద్రిక్తభావము కంఠగతమై పొర్లఁజూచును. వెంటనే యాభావమును వ్యక్తీకరింపఁ జూచినచో నది సంస్కారశూన్యమైయుండును. కాన సత్కవి తన యుద్రేకమును గొంచెమాపుకొని దైవదత్తమగు సూక్ష్మదృష్టివలనఁ బ్రకృతిసౌందర్యరహస్యముల స్పష్టముగఁ బొడగాంచి యవగతముచేసికొనును. పరేం

గిత జ్ఞానముగల సూక్ష్మదృష్టి కవికి, ఋషికివలెఁ దనయందుఁగల సత్వగుణమువలనఁ గలుగును. అందుచేతనే 'నానృషిఃకవిః' "నానృషిఃకురుతేకావ్య'మ్మనిరి. పిమ్మట తనభావనాబలముచే నతఁడు దానిననుకరించుచు వ్యాఖ్యాన ప్రాయముగ వ్యక్తీకరించును. ఆభావముల వ్యక్తీకరించుటకై కవికి సృష్టించుశక్తి యుండవలయును. స్రష్టృశక్తిచేతనే యతఁడు కవిబ్రహ్మయనఁబడుచున్నాఁడు. కవి కిట్టి సృష్టిసమయమున బ్రహ్మకువలె రజోగుణముండును. సృష్టి రజోగుణమువలననేసాధ్యము. అట్టిరజోగుణమువలననే కవి బ్రహ్మయగుచున్నాఁడు. ఈవిధముగఁ గవిమనకుఁ బ్రకృతికి నడుమనిలిచి మనకనులుదెఱచి, మనచిత్తముల నుద్బోధించి, మనల నాప్రకృతిరహస్యముల కభిముఖులఁజేసి, మనముచూడలేనివస్తువుల మనభావనతోఁ జూచునట్లు, మనకునచ్చునట్లనువదించును. ప్రతిమానవునియందు నాప్రకృతిలక్షణములును, రసమయకోశమును గొంతగానైననుండును గాన మనము సన్నుతించి కవిపొందిన యావేశానందములనే పొందుదుము. ఈవిధముగ మనముగూడ ప్రకృతిసౌందర్యానుభవమునందుఁ బాల్గొనునట్లు కవులుసేయుచున్నారు. ఇది కవిత్వముయొక్క శక్తి. ఇట్టికవిత్వము లేనియెడల మనము ప్రకృతిరహస్య మెఱుఁగనియంధులమగుదుము. కవిత్వము పాఠకులమనస్సులకు సంస్కారము గలుగఁజేసి ప్రకృతి నభినందించు శక్తినొసఁగుచున్నది. ఇది విశ్వజనీనమైన సత్యమునకుఁ బ్రియమును బ్రత్యక్షమునైన స్వరూపమునిచ్చును. ఇందలి విశ్వజనీనసత్వము నిరాకారమైన భావముగాక సజీవప్రక్రియగల యాకారముగలది. కవిత్వమందుఁగల యిట్టియుద్రేకశక్తి శాస్త్రమందుఁగాని, చరిత్రయందుఁగాని లేదు.

వ్యాకరణశాస్త్రప్రశంస.

ఉభయభాషాప్రవీణ మల్లాది సత్యనారాయణశాస్త్రిగారు.

మఱియు భాషాభివృద్ధినిఁబట్టి వ్యాకరణశాస్త్ర గ్రంథ సంఖ్యాభివృద్ధియనియు నదికారణముగ వెనుకటి వ్యాకరణగ్రంథములనేకట్టుకొని వ్రేలాడక క్రొత్తవ్యాకరణ గ్రంథములను వ్రాసికొనవచ్చుననియు నీగ్రంథములవలన మహాకవి ప్రయోగముల ననేకములను సాధువులుగఁ జేయవచ్చుననియుఁ గొందఱు చెప్పుచున్నారు. అనఁగాఁ గొన్నిపదములు మాత్రమే యాకాలమున నుండినవనియు వానికి మాత్రమే యప్పటివారు శాసనములను వ్రాయఁగా నాతరువాతికాలమునఁ బెరిఁగిన పదములకుఁ దరువాతివారు నియమముల నేర్పఱచిరనియు నట్లుకానిచో శాకటాయన ప్రభృతుల శాసనముల సమగ్రముగఁ గూర్పఁబడనేలయనియు వైయాకరణులు పాణిని కాత్యాయన పతంజలులయం దుత్తరోత్తర ప్రామాణ్యముంచుటకుఁ గారణముకూడఁ బాణినికంటెఁ గాత్యాయనుఁడు నాయనకంటెఁ బతంజలియుఁ గ్రొత్తక్రొత్త శబ్దముల సాధుత్వము నంగీకరించు శాసనముల నిర్మించుటయే యనియు నాకారణమునఁ గ్రొత్తవ్యాకరణ గ్రంథములను వ్రాసికొనినచోఁ దప్పులేదనియు నందులకుమహాప్రయోజనము మహాకవిప్రయోగసాధుత్వసంపాదన మనియు భాషకు నెప్పుడు పెఱుఁగుచుండును స్వభావము గలిగినను నాస్వభావ ప్రవాహమును వ్యాకరణ మనుపర్వతప్రాయసేతురచనచే నరికట్టఁజూచుట యాప్రవాహముయొక్క జీవాంశమునకు భంగముకలిగింపఁజూచుటయే యనియు వారితాత్పర్యము.

ఆయంశములు చర్చింపఁదగినవి.

లక్షణకర్తలు మొదట లక్షణములను వ్రాయునపుడు కొన్నిపదముల విషయముననే తమచూపును బ్రసరింపఁజేయుట సత్యము. అది

కదా. కనుక వ్యాకరణము వ్రాసినపిమ్మటఁ గ్రొత్తగవచ్చిన శబ్దములకు సాధుత్వసంపాదనము మునిత్రయమువారు చేయఁబూనను లేదు. ఆకారణమున వారియందుఁ బ్రామాణ్యబుద్ధి గలుగను లేదని తేలుచున్నదికదా.

మఱియుఁ బాణినిమహర్షి పూర్వాచార్యుల శాసనములయందు లాఘవగౌరవాదులను బర్యాలోచనచేసి తాను వారికంటె నధికలక్ష్యదర్శిగావున నంతకన్న లాఘవసమగ్రతలు కలుఁగ వలెనని సూత్రరచనకుఁ గడంగుటయే కారణముగ నాయనయందు నాయన యెంతశక్తిగలవాఁడైన మఱపనునది జంతుసహజాతముగనుకఁ గొన్నిపదముల విషయము మఱువఁగా నాయనకంటె నధికతర లక్ష్యదర్శియగు కాత్యాయనుఁడు వార్తికములను గొన్నింటిని వ్రాయుట కారణముగ నాయనయందు నాయనయుఁ గొన్ని మఱచుటచే నంతకంటె నధికతమలక్ష్యదర్శియగు పతంజలి ముని యాసూత్రవార్తికముల యావశ్యకతా నావశ్యకతలను విమర్శించి యందలి లోటుపాటులను సవరించి కొన్నిటఁ గ్రొత్తభాష్యేష్టులను నిర్మించి లఘుత్వసమగ్రతలను గనఁబఱచినందున నాయనయందు నుత్తరాభివృద్ధిగ సర్వవైయాకరణులకుఁ బ్రామాణ్యబుద్ధి యేర్పడినదేగాని శాసననిర్మాతలైనంతమాత్రమునఁ గలుగలేదు. కనుకనే "లుపియుక్తవద్వ్యక్తివచనే" ఇత్యాదులను బాణినిమహర్షి కాదనుట సంగతము లేకపోలేదు. మఱియు సర్వపదజ్ఞానము సర్వేశ్వరునిదిగాని యెంతయోగులైన మనుష్యులుగాన వీరిదిగాదను కారణముచే వీరికిఁగూడ మఱపు మొదలైన ప్రాకృతజనసహజధర్మముల నాపాదించినందులకు మన్నింతురుగాక. కనుక శాకటాయనాదిప్రథమ వైయాకరణులు కొన్నిపదముల విషయము మఱచియుందురనిన నొకదోషముకాదు. ఆకారణమున భాషాభివృద్ధినిబట్టి వ్యాకరణగ్రంథాభివృద్ధియని నిర్ధారణయుండఁగూడదు. భాషాభివృద్ధి జనసంఘాభివృద్ధినిబట్టి యేర్పడవలసినదేకాని తీరికూర్చుండిన యొకరిద్దఱివలన నగునదిగాదని "లోకాచ్ఛతాకికా" యను భాష్యమును

కారణముగఁ బైయంశములను నిర్ణయించుట మాత్రము నిజముగ నాభాషకు నపభ్రంశత్వ లక్షణసంపూర్ణద్రోహమునందింపఁదలంచుటయే. పేలయన మునిత్రయమునందుఁ దరువాతి వైయాకరణులకు నుత్తరోత్తర ప్రామాణ్యబుద్ధిగలుగుటకుఁ గారణము వారు క్రొత్తక్రొత్త శబ్దముల సాధుత్వము సంపాదింపఁ బూనుటకాదు. అట్లయినచోఁ బతంజలి మహర్షి "గావి"ఇత్యాదిపదముల నపభ్రంశముల క్రింద ననఁగ గ్రామ్యముల క్రిందఁ జేర్ప నేల? వానికిఁగూడ నేదోయొక శాసనము వ్రాసినచోఁ గాదని యడ్డపెట్టువారెవరు? కొన్ని పదములు వర్ణాగమ, వర్ణవ్యత్యయ, వర్ణ వికృతి, వర్ణనాశముల, నంది రూపాంతరత్వమొందుటయు సద్దాని మూలమున భాషకొంచెము పెరుఁగుటయు విరుద్ధముకాదు. భాషాంతర సంపర్కము భాషాభివృద్ధికిఁ బ్రధానకారణము కాదని యామాట నెత్తనైతి. అట్టివర్ణాగమాదులనొందిన కొన్నిపదములను మాత్రము సాధువులనుజేసి గ్రహించుటయు నామార్పుగల కొన్నిపదములను విడుచుటయును బతంజలిమహర్షి యేమిహేతువుఁదలఁచి చేసెనో తెలియకున్నది. పాణినిమునియు "లోపశ్శాకల్యస్య" యను మొదలగు మున్యంతరమతాంగీకారము నేల చేయవలసివచ్చెనో? మతాంతరాంగీకారము చేయు నతఁడు ప్రామాణికుఁడైననే చేయునుగాని క్రొత్తవానికి సాధుత్వము చేయఁబూను నతఁడు మతాంతరము నంగీకరింపఁ డుగదా. కనుక నతనియుద్దేశ్యముకూడ నేమైయుండునో? నాయభిప్రాయము శిక్షితాశిక్షితవిద్యుల వ్యవహారస్థములగుటచేతనే యాపదములట్లు వైయాకరణాదృత్యనాదృతుల నందినవని (అనగా శిక్షితభాషుల పరస్పరవ్యవహారమున మెలఁగు పదముల నాదరించుటయు నశిక్షితభాషుల పరస్పరవ్యవహారమున మెలఁగు పదముల నాదరింపమియు వైయాకరణులపనియని తాత్పర్యము. శిక్షితభాషులనఁగ శుశ్రూషాపూర్వకవిద్యాగ్రహీతలు. అశిక్షితభాషులనఁగ శ్రవణమాత్రోపలబ్ధమాత్రాదివ్యవహారస్థపదవ్యావహారికులు.) అట్లు కానిచో నాపదములు చేసినపాపమేమి? అవియు వర్ణలోపాదుల నందినవియే

కదా. కనుక వ్యాకరణము వ్రాసినపిమ్మటం గ్రొత్తగవచ్చిన శబ్దము లకు సాధుత్వసంపాదనము మునిత్రయమువారు చేయంబూనను లేదు. ఆకారణమున వారియందుం బ్రామాణ్యబుద్ధి గలుగను లేదని తేలు చున్నదికదా.

మఱియుం బాణినిమహర్షి పూర్వాచార్యుల శాసనములయందు లాఘవగౌరవాదులను బర్యాలోచనచేసి తాను వారికంటె నధికలక్ష్య దర్శిగావున నంతకన్న లాఘవసమగ్రతలు కలుంగ వలెనని సూత్రరచనకుం గడంగుటయేకారణముగ నాయనయందు నాయన యెంతశక్తిగలవాఁడైన మఱపనునది జంతుసహజాతముగనుకఁగొన్ని పదముల విషయము మఱు వఁగా నాయనకంటె నధికతర లక్ష్యదర్శియగు కాత్యాయనుఁడు వార్తిక ములను గొన్నింటిని వ్రాయుట కారణముగ నాయనయందు నాయన యుం గొన్నిమఱచుటచే నంతకంటె నధికతమలక్ష్యదర్శియగు పతంజలి ముని యాసూత్రవార్తికముల యావశ్యకతా నావశ్యకతలను విమర్శించి యందలి లోటుపాటులను సవరించి కొన్నిటం గ్రొత్తభాష్యేష్టులను నిర్మించి లఘుత్వసమగ్రతలను గనఁబఱచినందున నాయనయందు నుత్త రాభివృద్ధిగ సర్వవైయాకరణులకుం బ్రామాణ్యబుద్ధి యేర్పడినదేగాని శాసననిర్మాతలైనంతమాత్రమునఁ గలుగలేదు. కనుకనే "లుపియుక్తవ ద్వ్యక్తివచనే" ఇత్యాదులను బాణినిమహర్షి కాదనుట సంగతము లేకపోలేదు. మఱియు సర్వపదజ్ఞానము సర్వేశ్వరునిదిగాని యెంతయో గులైన మనుష్యులుగాన వీరిదిగాదను కారణముచే వీరికిఁగూడ మఱపు మొదలైన ప్రాకృతజనసహజధర్మముల నాపాదించినందులకు మన్నింతురు గాక. కనుక శాకటాయనాదిప్రథమ వైయాకరణులు కొన్నిపదముల విషయము మఱచియుందురనిన నొకదోషముకాదు. ఆకారణమున భాషా భివృద్ధినిబట్టి వ్యాకరణగ్రంథాభివృద్ధియని నిర్ధారణయుండఁగూడదు. భా షాభివృద్ధి జనసంఘాభివృద్ధినిబట్టి యేర్పడవలసినదేకాని తీరికూర్చుండిన యొకరిద్దఱివలన నగునదిగాదని "లోకాచ్ఛాస్త్రలౌకికా"యను భాష్యమును

బట్టి తెలియుచున్నదిగదా. అట్లే భాష యెవరిచేతను విశారమునొందిం పను బడదని "సిద్ధా"యనుపదమువలనఁ దెలియుచున్నది. అనఁగా లక్షణ కర్తలు భాషను మాఱుప లేరని తాత్పర్యము. అట్టి జనసంఘము తనకు వ్యవహారములో నెంతయవసరమో యంతకంటె నొకపదమునైన నధిక ముగ భాషలోనికిఁ జొరనీదు. అట్లు చొరనిచ్చుట స్వభావవిరుద్ధము. అట్లయినచో నీప్రపంచములోనిభాషలలో వ్యవహారమునకు నవసర మగు పదములకంటెఁ జాల యధికముగఁ గలవుగదా? యవి యెట్లు వచ్చినవని ప్రశ్నరాకపోదు. అందులకు నొకజనసంఘమువ్యవహారము నకుఁ జాలినంతభాష పెఱిగినకాలమున నాభాషలోఁ గూర్పఁబడిన వా క్యాదుల భాషమార్పుచెందక యట్లేయుండును. వ్యవహరింపఁబడు భాష లోఁగాలముగడచినకొలఁదిఁ బ్రయోక్తల యభ్యాసపాటవాది లోపము ల ననుసరించి వర్ణలోపాదులు గలిగి పదములు మాఱుచుండును. ఇట్లు మాఱినభాషలోని పదములును బై వాక్యాదులలోని పదములును(గొన్ని మార్పు లధికమగువఱకు) నేక భాషలోనివిగఁ బరిగణింపఁబడును. ఆకా రణముచేఁ బ్రపంచభాషలలో నవసరమునకుమించిన పదజాలము కనఁ బడుచున్నదని లఘుసమాధానము. అప్పటి శిక్షితజనవ్యవహారస్థపద ముల వాక్యపద్యాదులలోఁగూర్చి వాని నానియమములతోఁ బాటు వల్లి వేసి భద్రపఱచువారు పండితులు. అందు ముఖ్యముగ వైయాకరణులు. ఆపనిసాధారణులకు సాధ్యముకాదు. కనుక వ్యాకరణమును వ్రాయుట చే భాషాప్రవాహ మఱికట్టఁ బడినదను మాట మిగులఁ బొరపాటని స్పష్టము కదా. గీర్వాణవాణీగంగాప్రవాహము ప్రథమదంపతి హిమ శైలములనుండి బయలువెడలిన కొలఁదిదూరముమాత్రమే యనప వాహిత స్వరూపము గలిగి పిదప గమనవేగస్థలవిశేషపతనప్రభృతు లచేఁ గ్రమకలుషత్వమునందుచుండ నాస్తికినిగాపాడుటకై మహర్షులు తమతమసమయానువర్తులై సంస్కారవస్త్రమున వడియఁబోయు సమ కట్టి సూత్రనిర్మాణమునకుఁ బూనుకొని రనిన సమంజసమని తోఁచెడిని.

ఆప్రవాహ మడ్డంకులేకుండ నడచుచుండుటచే నానావర్ణములు నానాగుణములుగలదగుచుండుటయు నసంభావ్యముగాదు. అంతియకాని యెవరు నాప్రవాహ మడ్డకట్టఁజూడలేదు. అనఁగా నాపనిసంఘమునకుఁ గాక యొక వ్యక్తిముగ్గురకు సాధ్యము గాదనియు, సంఘమట్టిపనికిఁ బూనుకొనదనియుఁ దాత్పర్యము. అట్టి గీర్వాణభాషాప్రవాహముయొక్క వికృతిరూపములే ప్రాకృతాదిభాషాప్రవాహములనినచో, లోపమేమి? ప్రాచీనతమములైన చరిత్రలను సూచించు వైదికలౌకికసంస్కృతభాషలు కతిపయదేశభాషాసాధారణములుగఁ బ్రత్యక్షముగఁ గనఁబడుచుండఁ గేవలమానుమానిక మాతృభాషాంతరకల్పన మెందులకుఁ జేయవలసివచ్చెనో? తెలియకున్నది. అది యీభాషాకుటుంబములోని భాషలకు, నీగీర్వాణభాషయే మూలమనినఁ దమభాషలకు న్యూనత వాటిల్లునని తలంచువారికల్పనమై యుండనోపును. లేనిచో నట్టి యభూతకల్పన మెందులకు? ప్రాచీనవాఙ్మయమే యాభాషాప్రాచీనతను వ్యక్తపఱచును గదా? చిరకాలముక్రిందటి వృత్తము నూహించుట యందమేకాని నిర్ధరించుట సాహసము కాకపోదు. మఱి యొకవిశేషమేమనఁగాఁ జిరకాలముక్రిందట వ్యవహారములోనుండి నట్టియుఁ దమకాలమున సాధారణజనవిస్మృతములగునట్టి యాభాషాపదములను బండితులు ప్రాచీనకాలగ్రథితతద్భాషావాక్యములయందు నామ్రేడించివాఙ్మయములయందుఁ గూర్చివారై యున్నందునఁ దమతరువాతి వాఙ్మయరచయితలకుఁ గావలసినన్ని పదములను సంగ్రహించియుంచిరని వారియందు మనము సంపూర్ణముగఁ గృతజ్ఞతగలిగి ప్రవర్తింపవలెను గాని వారుభాషాజీవములను దీసివేసిరనుట చాల యక్రమము. అట్టివాక్యములలోని నియమములను గనుగొని వెల్లడించువారు వైయాకరణులు. వారు భాషాప్రవాహ మడ్డకట్టఁజూచిరో సంరక్షింపఁజూచిరో చదువరు లీతూరి గ్రహింతురు గాక. వారు సౌలభ్య ప్రధానప్రక్రియాప్రదర్శకులగుటయే కారణముగ వారియందు మిగిలినభాషాదివేత్తలకందఱకు నట్టిగౌరవ మంకురించెను గాని క్రొత్త క్రొత్త

పదములకు సంస్కారము కల్పించుటచేతఁ గాదు. ఇందులకుఁ బ్రమాణము "శక్తిగ్రహంవ్యాకరణోపమానే" త్యాది గ్రంథమే కనుకఁ గ్రొత్తవ్యాకరణములను వ్రాయఁబూనుటయాభాషకు నసంస్కృతత్వము నందింపఁ బూనుటయేకదా. అట్టి యీవ్యాకరణశాస్త్రము ప్రకృతవిజ్ఞానశాస్త్రమువలె నాకాలమునఁ గనుగొనఁబడి వృద్ధిపొందింపఁబడినది. విజ్ఞానశాస్త్రముప్రళయమువఱకుస్థిరములైన పంచమహాభూతములగుణక్రియల నాశ్రయించి బయలువెడలినది. వ్యాకరణశాస్త్రమో నిమిత్తకారణజన్యమైన శబ్దము నాశ్రయించి యుత్పన్నమైనదని యాభేదముమాత్ర మొప్పవలెను. ఆనిమిత్తకారణములు క్షణికములును అనేకవిధములును గాన వానివలనఁ గలుగునొక్కొక్క శబ్దమును బహువిధత్వమును నచిరస్థాయిత్వమునొందినది. ఆశబ్దములలో నేకవిధానుపూర్వక ప్రతిశబ్దము కొంతకాలమైనను గొందఱిచేతనయిన నొక యభిప్రాయము బోధింపవలె నను నుద్దేశ్యముతోఁ బలుకఁబడును గాన నాకాలమం దాకొందఱిచేతఁ బలుకఁబడు నాశబ్దములలోనే యేవిశేషములను శిక్షితవిద్యులగువారు గ్రహింపఁగలిగిరో యాయావిశేషములనే యొకచోఁ జేర్చినచో నదియే వ్యాకరణమని చెప్పఁబడును. ఆవిశేషముల నన్నిటి నొకస్థలమునకుఁ బ్రోగుచేయుటకు సాధనసామగ్రి యధికముగ నవసరము. దానికి మఱపుమొదలగు ప్రతిబంధకములు దప్పనే తప్పవు. కనుకఁ బూర్వవైయాకరణులు లక్షణములను వ్రాయక విడిచినపదములు వ్యాకరణము వ్రాసినపిమ్మటఁ గ్రొత్తఁగ భాషలోనికిఁ జేరినవేయని యనరాదు గదా. అవి మఱచుటచే మిగిలినవియే. వ్యాకరణము వ్రాసినపిమ్మట భాషపెఱుఁగఁగా వచ్చినపదములే యని పట్టుదలతో వాదించువారి నడుగుచున్నాను. అట్లయినచో మొదటివాఁడు వ్రాసినగ్రంథమును రెండవవాఁడును వానిని మూఁడవవాఁడును జూచి యుండి గదా క్రొత్తవానిని వ్రాయబూనుకొనవలయును? అట్లయినచో వైదికప్రయోగముల మాట యటుండనిచ్చి లౌకికసంస్కృతశబ్దములలో నే శబ్దమువిషయమై యేరెండవవారు లక్షణమును వ్రాయనక్కఱలేదు కదా. క్రొత్తవాని విషయమైనచో నవసరము. అట్లు జరుగవలసియుండఁగ

వ్రాసినవానికే మఱలవ్రాయుట; యందుక్రొత్తవాని విషయమంతగ లేకుండుట మొదలగు సంశములమాటకు బను లేమని వచింతురు? ఆలక్షణకర్తలు భిన్నభిన్నదేశస్థులై యుండి యెవరికి వారుస్వతంత్రముగను సంపూర్ణముగ నానాటిభాష కుండిన కట్టుబాట్లనువ్రాయఁబూనుటవలన వచ్చిన పౌనరుక్త్యముగాని భాష పెఱుగుచుండఁ దమతమకాలములలోని ప్రయోగవిశేషములకొల్ల వ్రాయఁబూనుట కారణముగనైన పౌనరుక్త్యము కాదని నాయభిప్రాయము. ఒక్కమునిత్రయమువారును యాస్కాచార్యుఁడును దక్క తక్కిన ప్రాచీన వైయాకరణులు పరస్పరమతముల నుగ్గడించుటకాని ఖండించుటగాని చేసియున్నట్లుచెప్పికొనఁ గానైన వినియుంటిమా? అనఁగాఁ గ్రొత్తక్రొత్త శబ్దములసాధుత్వసంపాదనము వైయాకరణాభిమతమైనచో నెందైన. బూర్వవైయాకరణుల కృతుల యందొకరినొకరు తెలిసికొని యున్నట్లుగాని వైయాకరణాభిమతమగు నర్థమాత్రాలాఘవము నపేక్షించి క్రొత్తసూత్రముల నిర్మాణమునకుఁ బూనుకొనినట్లుగానిసూచన లేవియైనఁ గనఁబడుచున్నవా? యని యభిప్రాయము. ఆయభిప్రాయమే యున్నయెడల నొకచోనైన నట్టిది వ్యక్తముకాదా? కనుక భాష పెఱుగుచుండ నాయాకాలములందు నాయావైయాకరణులు వ్యాకరణకరణమునకుఁబూనుకొనిరనుట సయుక్తికమును న్యాయమును గాదు.

అందుచేఁ గ్రొత్తఁగా నిప్పుడు మహాకవిప్రయోగసాధుత్వమునకై వ్యాకరణమును వ్రాయఁబూనుట పైనఁజెప్పిన యసంస్కృతత్వాపాదనమునకే కాని ప్రయోజనమునకుఁ గాదు. జనులవ్యవహారమున కెంత భాష యవసరమో యంతయుఁ జెలిగినపిమ్మట నప్పటి యాభాషకుండిన కట్టుబాట్లు క్రమముగా సామాన్యజనులవ్యవహారములో సడలుచుండ ననఁగా నపభ్రంశత్వమునందుచుండ నప్పటి వ్యాకర్తలు తమతమ యనుభవములో నున్న యాభాషయొక్క యాకట్టుబాట్లను గ్రోడీకరించిరనియే నిర్ధారణచేయవలసియున్నది. అప్పటి భాషాపరిస్థితులను దెలుపుటకే యన్ని వ్యాకరణగ్రంథములు బయలుదేరినవి. పాణినికాత్యాయనపతంజలులు సంపూర్ణముగ నాపనిని నెరవేర్చినందునఁ దరువాతిమునీశ్వరులు

మఱల నాపనికిఁ బూనుకొనరైరి. బోపదేవాద్యర్వాచీన వైయాకరణు
లయొక్క క్రొత్తక్రొత్త శబ్దముల సాధుత్వసంపాదనశాసనములు ప్రామాణిక
ములైన యెడల వృత్తికారుని "యంగగాత్రకంఠేభ్యో వక్తవ్య"మ్మను
వార్తికముమాత్రము ప్రామాణికము కాకపోవునా? ప్రాచీనకాలము
నుండియు భాషలో మెలగుచుండి వైయాకరణులదృష్టిని బడని ప్రయో
గవిశేషములవిషయమై క్రొత్తశాసనము వ్రాసినను రమణీయముగాని సర్వ
జ్ఞుఁడైన ఋషియొక్క "అసంయోగోపధాత్" అను నిషేధవాక్యము ప్రత్య
క్షముగఁ గన్పడుచుండ వ్యాఖ్యాతలు సవరింపకయుండ నట్లుచెప్పుటవృత్తి
కారునిది సాహసము కాకపోదు. మఱియుఁ బాత్రవిశేషానుకరణేతరస్థల
ములఁ గవికిని లక్షణకర్తకును భేదమేమి? అనఁగాఁ బ్రవృత్తినిమిత్తము
వేఱు కాదని కాదు. భాషాస్వరూపనిర్ధారణలో భేదమేమని యభిప్రాయ
ము. లక్షణకర్త యాప్రయోగము నట్లనుశాసించుటకు లక్ష్యజ్ఞానములేని
వాఁడా? కవికిమాత్రము పూర్వకాలికప్రయోగపరిజ్ఞాన మవసరముకా
దా? పూర్వకాలికప్రయోగములును బరకాలికప్రయోగములు నేకొం
తకాలముననో కాక యెల్లప్పుడు వాడుకభాషలో నిమిడి యుండవుగదా.
పూర్వకాలికప్రయోగము లంతరించుచుండఁ బరకాలికప్రయోగములు
తలలెత్తుచుండును. కనుకనే ఋగ్వేదములోఁ గనంబడు ప్రయోగవిశేష
ములుతరువాతివేదములలోఁ గనంబడకున్నవి.అట్లే సర్వకాలములయందు
నాయుభయమునకు సామానాధికరణ్యము సంభవింపదు. అట్లగుటచే
వేనినో కొన్నింటిని వీడుట గ్రహించుట జనసంఘమునకు స్వాభావిక
మని తెలియుచున్నది. అట్టి సంఘసంబంధియగు భాషలో నొకానొకకా
లపు గృహీతవిద్యులభాషకు మాత్రమే వ్యాకరణము గనుఁగొనఁబడినది.
కాన నట్టిభాషలోనికి నగృహీతవిద్యుల యపప్రయోగములు చాలవఱకుఁ
జొరఁబడవు. కావ్యాదిగ్రంథములుగూడ గృహీతవిద్యులభాషలో వ్రాయఁ
బడుచున్నందున నాయుభయమునకు నవినాభావసంబంధ మేర్పడినది.
కనుకఁ గవియుఁ బూర్వప్రయోగపరిజ్ఞానము కలిగియే యుండవలయు
ను. లక్షణకర్తయుఁ దనలక్షణము సర్వత్రలక్ష్యపర్యాప్తియగునో కాదో

విమర్శించి యుండవలెను. బాగుగా నాలోచించినచో నిద్దఱును బ్రయోగపరిజ్ఞాతలే. ఇద్దఱకు స్వేచ్ఛ లేదు. ఇద్దఱీ ప్రయోగశాసనములు తరువాతివారిచే నామోదింపఁ దగినవియే. కవి భాషలోని కట్టుబాట్లు వీడిపోకుండ రమ్యమగు పదగుంభనములచే భాష నలంకరించుచుండును. లక్షణకర్త యాహార్ప్రు కవ్యభిప్రేతార్థ మెట్లు కలిగియున్నదో విమర్శించి యాభాషలో స్వతస్సిద్ధముగానున్న కట్టుబాట్లమూలమునఁ గలుఁగుచున్న దనివానిని నిరూపణము చేయుచుండును. లక్షణకర్తకుఁ బ్రయోగవిస్మృతి క్వాచిత్కముఁగ సంభవింపను సంభవించును. కవికి రసాదినిరూపణభారమున బ్రయోగప్రచ్యుతి యెచ్చోనైనఁ గలిఁగినను గలుఁగును. కనుకఁ బ్రయోగవిస్మృతి యుభయసాధారణమే కాని యనుకరణేతరస్థలములలోని శాసనవిరుద్ధప్రయోగములపట్లఁ గవిది మాత్రము కొంచెము పొరపాటు. అప్పు డతనికి నది సంభవింప వీలయినది. (అనఁగా రాకమానదు) కనుకనే పండితులు "నిరంకుశాః కవయః"యని మన్నించిరి. ప్రసిద్ధప్రయోగవిరుద్ధశాసనము లెప్పుడును లక్షణకర్త చేయఁడు. అతఁడు చేసినశాసనములొకప్పు డతివ్యాప్త్యవ్యాప్తిదోషగ్రస్తములు కానోపును గాని యసంభవదోషగ్రస్తము లెన్నటికిఁ గానోపవు. అతివ్యాప్తిగాని యవ్యాప్తిగాని సంభవించినయెడల వ్యాఖ్యాతలు సవరించుచునేయున్నారు. లక్షణకర్తదృష్టిని బడని యనుకృతేతరప్రయోగము కవి ప్రయోగించినచో నది యందఱకు శిరమున నుంచుకొనఁ దగినదియే. కనుకనే "శాస్త్రప్రయోగవచసో శ్శాస్త్రం బలవ దుచ్యతే, అనిష్పన్నే పదే తేన ప్రయోగాశ్రయణం హిత"మ్మను కారిక యుత్పన్నమైనది. సామర్థ్యము గలిఁగినదని యీకారికకు ననర్థకల్పనము చేయరాదు. లక్షణకర్త భాషానియమముల నెట్లు మాఱుపఁజాలఁడో యట్లే కవియు శక్తుఁడు గాఁడు. ఆసామర్థ్య మొక్క జనసంఘమునకే కలదు. కనుకఁ "బ్రయోగశరణా వైయాకరణాః" యను నార్యోక్తికి నొక్కొక్క కవిప్రయోగము ననుసరించి వైయాకరణుఁడు తనలక్షణమును సవరించుకొనవలసినదని తాత్పర్యముగాదు. అట్లే యయినచో నావ్యాకరణముతో నెవరికిని బని యుండదుగదా. భాష

యంతయు న్యాక కావ్యములలోనే నిమిడియుండలేదు. ధర్మవైద్యాది శాస్త్రములుగూడ భాషాస్థానములే. అందుచే భాషా సంరక్షణము కవికంటె లక్షణకర్తకు వేయి రెట్లధికముగ నున్నది. పైఁగాఁ గావ్యములలో భాషలోని పదములన్నిఁటిని సమయానుగుణముగ నైనఁ బ్రయోగింప వీలుగాదు. ఆయాపదముల కుండిన నియమము లన్నియుఁ గావ్యములలో నుపయోగింపను రాదు. చూడుఁడు "వా పుంసి పద్మం నళిన"మ్మనుకోశము పద్మశబ్దమునకుఁ బుంలింగతను గూడ ననుశాసించుచుండ నాలంకారికులు కావ్యములలో నాపదము నా లింగముగ వాడఁ గూడ దనుచున్నారు. ఇట్లే కొన్నిపదములనుగూడ నిషేధించుచున్నారు. కాబట్టి కావ్యములలోఁ గవికి నంతగ స్వేచ్ఛ లేదు. కవికిఁ గవిసమయమను నింకొక బలమైన నియమనమును గలదు. అట్టి కవి లక్షణకర్తకు విధేయుఁడయియే యుండవలయు నని స్పష్టపడుచున్నదిగదా. అయితే "ప్రయోగైకశరణా" వైయాకరణాయనునార్యోక్తికి నర్థమేమని మీరడుగవచ్చును. దానిక్రిందిది సమాధానము. వ్యాకరణశాస్త్రమొకప్పుడున్న భాషలోని కట్టుబాట్ల నాధారము చేసికొని యుత్పన్నమైనదిగాన నప్పటిప్రయోగవిశేషములే యావైయాకరణులకు దిక్కనఁగాఁ దరువాతి ప్రయోగముల సాధుత్వాసాధుత్వములు విమయ నిర్ణాయకసాధనములని, వానినే యొకచోఁ జేర్చినవారు వైయాకరణులని చెప్పఁబడుచున్నారు. కనుకఁ గవియనువానిచుట్టు, లక్షణకర్త తిరుగవలసినవాఁడు గాఁడుగదా ? మఱొక్క విషయమేమనఁగ నాంధ్రభాషకు సంస్కృతమునకువలెఁ బ్రాచీనకాలికప్రయోగసాధుతాపరవ్యాకరణశాస్త్రము పూర్వము కనుఁగొనఁబడి యుండనందున దానియిప్పటి యీ వ్యాకరణము, పూర్వకవి ప్రయోగప్రమాణకము కానోపును. అట్లు సంస్కృతమున కవసరముకాదు. ఆకారణముచే నాభాషలోఁ గవిప్రయోగములకై వైయాకరణుఁడు తన లక్షణమును సవరింపవలసిన యగత్యము గలవాఁడు గాఁడు. దాని కాస్థితి గతించి పోయినది. తెనుఁగునను బూర్వకవి ప్రయోగమును లక్షణకర్త మఱచి విడిచిన యెడల దానివిషయము

మాత్రము లక్షణములో సవరింప సవసరముగాని యన్నింటివిషయమునఁ గాదు. కారణము తాత్కాలిక ప్రయోగపర లక్షణమునే తాత్కాలికప్రయోగపరముఁ జేయుటన్యాయముకాకపోవుటయే. కనుకఁ బేరుమ్రోగిన మహాకవుల వచనరచనలను గాక యితరములను జూచి లక్షణమును దిద్దుకొమ్మనుట యసంగతముకదా. క్రొత్తపదములకు వ్యాకరణము వ్రాయనెంచినయెడలఁ బూర్వవ్యాకరణముతో సంబంధములేకుండ వ్రాసికొనినచో నంతతప్పులేదుకాని దానివలన నంతగ నుపయోగము కలుఁగదని యిదివఱలో నేమనవిచేసియున్నాను. దీక్షితులవారుకవులపై నెంత గౌరవముగలవారో యీక్రిందివిషయమునుబట్టి నిర్ణయింపనగును. ఆయనకవికులతిలకమగు కాళిదాసుని "విమానవా సుభ్రు కుతః పితుర్గృహే" యను వచనము ప్రత్యక్షముగఁ గనఁబడుచుండ నెక్కడనో యున్న భట్టికావ్యములోనిదగు "హాపితః క్వాసి హేసుభ్రు" యనువచనమును దీసి "ప్రమాద ఏవాయమితిబహవ" యని నిందించి యుండిరి. భట్టివ్రాసిన గ్రంథము కావ్యమైనను వ్యాకరణప్రధానకముగాన దానినే పట్టి యామాట యనగలిగిరేకాని రసప్రధానకములైన కావ్యములనుబట్టి యావంతమాటనైన నెచ్చోనైన ననియుండిరా? ఆయనచే సాధారణపాణినీయవైయాకరణులనఁ గుమరని యెన్ని కవిప్రయోగములు పాణినీయమునకు సరిపడునట్లు సమర్థింపఁబడలేదు? ఎట్టిత్రోవయు లేనిచో "నిరంకుశాః కవయః" యని వదలివేసిరే కాని శాస్త్రజ్ఞుని నిందించినట్లు కవిని నిందించి యుండిరా? అయితే పై భట్టిప్రయోగము ననుకరణముగా గ్రహించి యొకరు సమర్థించియే యుండిరి. సమర్థింపవలసివచ్చినచోఁ బ్రసిద్ధమైన యాప్త శాస్త్రముననే సమర్థింపవలెఁ గాని క్రొత్తక్రొత్త శాసనములవలన నాపని సాధ్యముకాకపోవునా? అట్లున్నచో నేప్రయోగము తప్పనవచ్చును? ఋషులయందు సర్వజ్ఞత్వాదిధర్మముల నాపాదించినవారు వారి యెంతకౌశలమును బరిశీలించియుండిరో గదా! భారతభూమి సజీవమై యున్నయెడల వారివిజ్ఞానమహదర్శనమువలననేకాని యిప్పటి మనవలనఁ గాదని యభిమానము వదలి చెప్పవలసియుండును. లేనిచో

నేదేశమందైన నేకాలమందైన నాప్రకారము కొన్నివేలేండ్లు సర్వకళలతో సర్వసమర్థతలతో సర్వసంపదలతో దయాసత్యశౌచాదిసర్వధర్మములతోఁ గూడినజను లనేకులున్నట్లు కని విని యుంటిమా? కనుక వారినిఁ గాదని యన్యుని నాసింహాసనముపై నెక్కించుట కృతఘ్నతలోనికిఁ జేరునేమో యని నాకు భయము. ఒక్కయితివృత్తముఁ బరికింపుఁడు యాజ్ఞవల్క్యమహాముని వైశంపాయనుఁడను గురువునాపతిని శబ్దమయములగు వేదముల నగ్నికణరూపమున వెడల నుమిసెననియు నావేదములు భూమిపైఁ బడి నశింపకుండ నావేదాధిదేవత లగ్నికణములను మ్రింగఁగల తిత్తిరిపక్షులై గ్రహించె ననియు నున్నదిగదా! ఇంనుశబ్దము తేజోరూపమును బొందెనను నది సాధారణులకు గోచరించు విషయమేనా? వినువారు నమ్మియుందురా? ఇప్పుడు రేడియోయంత్రములో జరుగుచున్నది ప్రత్యక్షమగుచున్నది యేమి? ఈయంత్రములోని యీయంశమును గన్నులారఁ గనుఁగొన్నవారు వెనుకటి యితివృత్తము నెఱిఁగియున్నచో నేమైపోదురో! పాశ్చాత్యవిద్యలలోఁ బరిపూర్ణులై మనవిద్యయందుఁ బ్రవేశముగల మనదేశీయులగు పెద్దపెద్దలు ఇప్పటిసర్వవిజ్ఞానము వెనుకటివిజ్ఞానలేశముతో సరిగాదని యుద్ఘోషించుచుండఁ బండితులే వారినట్లు క్రిందుఁజేయ యత్నించుట యన్యాయముగదా! కనుక బోపదేవాదులు మనకంటె సర్వజ్ఞులని చెప్పఁబడినను మహర్షులముందఱ చెప్పఁదగినవారు కారు. "పణినాపత్యాదులు" పాణినీయమునకుఁ గుదురనిచో "నిరంకుశాఃకవయ"యని మన్నించుటే యుచితము. ఇట్లెన్నివేలు లేవు? కవి పొరపడిచెప్పిన యంశముల నటుండనిచ్చి కావలెనని ప్రత్యేకముగఁ జెప్పిన యంశములమాట కేమి యనులు? చూతుఁడు. "పప పతామి హాహా భభ భూతలే" మొదలగు ప్రయోగములనుబట్టికూడ లక్షణమును సవరింప నవసరమేనా? అట్లయినచోఁ బాణినీయమునే వదలివేయుట మంచి దనుఁడు. పతంజలిమహర్షి "యస్మిన్ దశసహస్రాణి పుత్రే జాతే గవాందదౌ బ్రాహ్మణేభ్యః ప్రియాఖ్యేభ్యః సోఽయ ముఞ్ఛేన జీవతి" యను కవిప్రయోగ

ము నుదహరించుటలోను "ఛన్దోవశ్వవయఃకుర్వన్తి" యనిగౌరవముతో వదలివేయుటలోను తాత్పర్యము, కవిప్రయోగము, పాణినీయలక్షణమునకు దూరముగా నుండవలెననియా? కేవలమును వారప్రయోగము లనే యుదహరింపఁదలచినచోఁ జామరప్రయోగము లెన్నివేలు లేవు? వారియుద్దేశ్యము కవి పామరుఁడనిగాని ప్రామాణికుఁడనిగాని కాదు. కవి కట్టిస్వాతంత్ర్య మవసరము. కొన్నిటఁ బొరపాటులును సంభవించును. కనుకఁ గవిప్రయోగము ననుసరించి లక్షణమును సవరింపఁ జూచుట తమకుఁ బాండిత్యమునందలి యవిశ్వాసముగాని వేఱొండు గాదు. మఱియుఁ గవి, యొకలక్షణమునే కాకుకదా ప్రపంచపరిస్థితులనే దిగనాడుచున్నాఁడు, లేదా తాఱుమాఱుచేయుచున్నాఁడు. మహానదియందుఁ దామరలా! లతాభృంగములకు దాంపత్య సంబంధమా! మేఘపర్వతములకు స్నేహబాంధవ్యమా! యీము స్నగు నెన్నియంశములఁ జూపవలెను. కనుకనే కవిని బ్రహ్మ యని, కవిభారతిని భారతియని, యామెకావ్యనిర్మాణమును నియమరహితమై నవరసరుచిరమైన సృష్టియని, యాలంకారికశిరోమణి మమ్మటభట్టాచార్యుఁడు స్తుతించి యున్నాఁడు. కనుకఁ గవి కొన్ని నియమములచే బద్ధుఁడైనఁగొన్నిట సర్వాతీతప్రజ్ఞుఁడై యున్న కారణమున నాతనిప్రయోగము తప్పనుటకు నేరికిని శక్యముకాదు. అతని ప్రయోగమును బట్టి లక్షణమును దిద్దను నీతిగాదు. అతఁడు కావలసినచోట లక్షణకర్త. మఱియొకచోట నుసర్తుఁడు; వేఱొంకచోటఁ బ్రబుద్ధుఁడు. ఇట్లు పలుతావులఁ బలుపు రవుటచేత నాతని కొక నియమము లేదు; లేకపోను లేదు. కనుకఁ గవిప్రయోగముననుసరించి లక్షణమనునది యవిచారక్షమమని నాయూహ. సంస్కృతభాషలోఁ గావ్యములుగాకయనేకగ్రంథములుదాహరణమునకులభించును గాన లక్షణవేత్త ప్రయోగములకై తడుములాడఁబనిలేదు. తెనుఁగుభాషలో నట్టికావ్యేతరగ్రంథములు లేనందున నివియే వేమన్న చెప్పినదే వేదమన్నట్లు శిరసావహింపఁదగినవి. కాని వెనుకఁ జెప్పిన ట్లనుకరణమునందును లక్షణముతోఁ బనిఁబెట్టుకొనరాదు

శ్రీరామోత్తరేతివృత్తము.

సాహిత్యవిశారద కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

ఉన్నత సాహితీ సారకోవిదుఁడగు నీదిఙ్నాగ కవిశిఖామణికవిత యసదృశభావకలాలలితమై వెలయుచున్నది. నిజముగా సాహిత్యవిద్యకు వన్నెను గొనివచ్చునవి కవికాలాదులు కావు. మనోహరమగు ధ్వనిలాలిత్యములే. అందువలననే సరససాహితీసంపన్నులగు ప్రాజ్ఞులు ప్రాఁగ్రొత్తల గణింపక వ్యంగ్యభంగీతరంగితములగు ధ్వనిసంపదలనే కవితాకాంతకు జీవితసౌభాగ్యచిహ్నములనుగా నెన్నుచున్నారు. కుందమాలయందలి సీతాలక్ష్మణ సంభాషణముల వెలయుచున్న భావకలావైభవముల నిటఁ బ్రకటింతును.

లక్ష్మణుఁడు, శ్రీరాముఁడు సీతతోఁ దెలుపుమన్న పరిత్యాగకారణమును వివరించుట.

(1) "ఓపూతచరితా! సీతా! నీవు కులగౌరవాదులచే నాకుఁ దగిన సతివనియు, అత్యంతానువ్రతవనియు, పావనోదారగుణశోభితవనియు, సుఖదుఃఖముల నెడబాటు లేని ప్రేయసి వనియు, బాగుగా నెఱుంగుదును. కేవలజనాపవాదదోషనివారణమునకై నిన్నుఁ బరిత్యజింపవలసి వచ్చినది కాని, నీవు దుశ్శీల వని భావించి కాదు." ఇది యాపూజ్యపాదుని సందేశము.

(2) సీత:—ఏమీ! జనాపవాదమా! సౌమిత్రీ! నాయెడ నేవిధమైనఁ జెడు నుడులు వెలువడెనా?

(3) లక్ష్మణుడు:—లోకవంద్యవగు నీయెడ నపవాద మెన్నఁ దగునా? మహర్షుల ముంగట, లోకపాలుర సమ్ముఖమున, దాశరథి ముందు, నాకండ్ల యెదుట నగ్నిప్రవేశ మొనర్చి పూతచరితవుగాఁ బ్రత్యక్షమై యుంటివి. కాని లోకము నిరంకుశముకదా!

(4) సీత:—కట్టా ! ఇట్టి నిందావస్థలో నీజనకరాజపుత్త్రి గర్భవతిగాకున్న వెంటనే జీవితమును త్యజింపకుండునా ?

(5) లక్ష్మణ:—అమ్మా ! త్వరపడకుము. మాయన్న వేఱొక సంగతినిఁ గూడ నీకుఁ దెల్పుమన్నాఁడు.

(6) సీత:—దాని స్వరూప మెట్టిది ?

(7) లక్ష్మణ:—తల్లీ ! వినుము శాంతముగా "దేవి నీవు నామానస సరసిజమున నిలచియుండు గృహలక్ష్మివి. కలలోఁ గన్పట్టు ప్రాణేశ్వరివి. కాంతాంతరానురాగవిరహితుఁడ నగు నాకు జన్మముల నీబొమ్మయే సోమిదమ్మగా నుండఁగలదని నమ్ముము."

(8) సీత:—సౌమిత్రీ! ఆకౌసల్యానందనుని యనురాగ సుందరములగు సందేశవచనము లాలించుటచే నామానసము నలమియున్న పరిత్యాగఖేదతిమిర మంతయుఁ దొలఁగి పోయినది. సౌమిత్రీ ? స్వప్రాణేశుఁడు అన్యాసక్తచిత్తుఁడగుచో మానినులకుఁ గలుగు దుఃఖము మఱే యితరకారణములవలనను గలుగనేఱదు సుమీ !

(9) లక్ష్మణుఁడు:—మాతరో ! నాసోదరునకు నివేదింప నర్హమగు ప్రతిసందేశ మేదియైనఁ గలదా ?

(10) సీత:—మృదుభాషీ ! ఈయవస్థలో నాజనరంజకునకుఁ బంపఁజేయఁజాలు సందేశ మేమి యుండును ? అయినను వినుము. మొదట మాయత్త లందఱకును నాకుఁ బ్రతినిధిగా నిలిచి వందనముల సమర్పించి ఇట్లు మనవిచేయుము. "శ్వాపదసంఘసంకులమగు విపినాంతరమున నాథునిచే విడువఁబడి యెట్టి సహాయమును లేక యొంటరిగానున్న ఈపేదబాలగు కోడలిని వాత్సల్యముతో దీవింపు మనుము.

(11) లక్ష్మణ:—జననీ ! తప్పక నీవినయోక్తుల మాతల్లులకుఁ దెలుపుదును. కాని సతీమణీ ! మాయన్నకు విన్నవింపనగు పలుకులఁ దెలుపకుంటివదేల ?

(12) సీత:—ఆనిశాచరనిశితశాసకునకు నేనేమని సందేశ మంపుదాన! కాని యిట్లు విన్నవింపుము. మందభాగ్యయగు కామినిపైఁ దలపుచే శ్రేయస్కరములగు ప్రజామోదకార్యముల నిర్లక్ష్యము సేయ వలదనుము. పురుషార్థసాధనమగు శరీరసంరక్షణమున జాగరూకులై యుండుఁడనుము. రామానుజా! నా యీమాటలయందు రాజనింద గానవచ్చుచున్నదియా?

(13) లక్ష్మణ:—దేవీ! ఈమాత్రమనుటకును నీకధికారము లేదా?

(14) సీత:—మఱియు నాకోసలరాజుతో "తపోవనసహవాసిని యగు క్షమాజాత వినతయై యిట్లు నివేదించిన దనుము. నే గుణహీను రాలనైనను, చిరపరిచిత ననికాని, దిక్కుమాలినదాన ననికాని, తుదకు సీత నని కాని, భావించి స్మృతిమాత్రముననైన దయఁ జూపు మంటి ననుము."

(15) లక్ష్మణ:—విదేహరాజపుత్రీ! గాయముపైఁ గారపుపొడి పడినట్లు భావగర్భితములగు నీయీవినయోక్తులు ఆదయామయుని చెవినిఁ బడినతోడనే లోరవులుచున్న సంతాపాగ్ని భగ్గు మనక మానదు.

(16) సీత:—ధర్మజ్ఞా! మీయన్న నన్ను వినా యితరకామినుల గలలోఁ గూడ స్మరించువాఁడు కాకుండుటచే నీవ యావసుమతీశునకు వలయు నుపచారములఁ జేయుచుండవలయును. ఏమఱి యుండరాదు సుమా!

(17) లక్ష్మణ:—అమ్మా! ఇవి నీయుదారహృదయమునకు సాటియగు మాటలు.

(18) సీత. పుత్రికా! ప్రియంవదలగు నాచెలికత్తియ లందఱ నూరడింపుము. ఈమందభాగినిని సర్వదా స్మరించుచుండుము. (అని రోదనము చేయును.)

(19) లక్ష్మణః:—(దుస్సహావేదనతో) కటకటా ! పూత చరితయగు సీతామాతను జేతులార నీభాగీరథీతీరమున విడచుటకును, ఈసాధ్వీమణి యొనర్చు హృదయవిదారకములగు పరిదేవనములఁ జెవు లార వినుటకును, మున్నట రణరంగమున ననాయాసముగాఁ బ్రాణ ములఁ బాసిన నన్ను సమీరకుమారుఁడు సంజీవిఁ బోసి బ్రతికించెను. నే నానాఁడు హనుమానుఁడు నింుక నేస్తముతో నను జీవింపఁ జేసెనని తలంచితినే కాని పగఁ బూని యిల్లిడ్పించుటకుఁ గాను బ్రతికించెనని భావింపఁ జాలనైతిని. (నలుదిక్కులు పరికించి) కట్టా! ఈయడవిలేడి యలు మైథిలీవిలాపముల నాలించి గఱికమేతను మాని విలపించుచు న్నవి. ఈరాయంచలు పరితాపపరవశలై రోదనములఁ జేయుచున్నవి. ఈవనమయూరములు నృత్యమును జాలించి జాలిఁజెందియున్నవి. ఈప్రాణులు తిర్యగ్జాతిసంభవంబులైనను ప్రశంసనీయములే. కాని కోసల మానవులు మాత్ర మెంతమాత్రమును స్మరింపఁ దగినవారు కారు.

చం. హరిణములేడ్చుచున్ దొరఁగనశ్రులు పచ్చికమేఁతు మానుచున్,
గరుణముగాఁ గటావిలపనం బొనరించెడు రాజహంసముల్
మఱి విరమించు నృత్యమును మానిని గాంచి మయూరవారముల్
బెరిమను లాతి జంతువులె మేలొకయించుక గారు మానవుల్.

శ్రీవడ్డాది సుబ్బారాయకవిగారి యాంధ్రకుందమాల:—

నిజముగా భక్తాగ్రేసరుఁడగు సుమిత్రానందనుఁడు సీతాపరిత్యాగ సమయమునఁ జెందిన దుఃఖ మెంతే దుర్భరముగా నుండెనో కుందమాల యందు దిఙ్నాగకవి హృదయంగమముగఁ జిత్రించి యున్నాఁడు. ఈవి దేహనృపాలబాల కోసలరాజేంద్రుని మందిరమునఁ గాలువెట్టినది మొ దలు నేఁడీపరిత్యాగసమయము వఱకు నొక్కరీతిని హృదయపూర్వకము లగు భక్తిగౌరవములతోఁ దనయునివలెను, దాసునివలె, నాయిల్లాలి కడ మెలంగిన లక్ష్మణునకు, సతీలలామయగు నిలాతనయ నడవిపాల్సేయు టలో నాతని గుండె యెట్లు ఖిన్నమాయెనో యూహింపఁదరమా ?

సీత మఱది పరిదేవితముల నాలించి సూర్యాస్తమయమగుటను గుర్తించి యిట్లు ప్రబోధించెను.

(20) సీత:—లక్ష్మణా! అస్తమయసమయ మాసన్న మగుచున్నది. మనుష్యసంచారభూము లిటకుఁ జాల దవ్వుగానున్నయవి. పిట్టలునికిపట్టుల కెగిరిపోవుచున్నవి. క్రూరజంతుసంతతుల కంఠస్వనములు చెలరేఁగుచున్నవి. కావున వత్సా! ఇక నిట జాగుసేయక సత్వరమే యయోధ్యకు వేగముగా వెడలిపొమ్ము.

సోదరీసోదరులారా! కంటిరా! దిఙ్నాగకవీంద్రుఁ డెంత మనోహరముగ నీ సీతాపరిత్యాగరంగమును జిత్రించియున్నవాఁడో. ఇట్టి ఘనకావ్యరసపూరములు కావా భారతీయమానసరాజీవముల జీవకళావిలసితములనుగాఁ జేయఁజాలినవి? చదువవలెనన్న నిట్టి పావనోదారభావసుందరములగు కావ్యములఁ జదువవలయును గాని, నీరసవిషయనిలయములగు కవనములు కావు. మృద్వీకఫలముల కుండు మాధుర్యము మృత్తికాగుళికలకు సమకూరునా? పుత్తడి పుత్తడియే, యిత్తడి యిత్తడియే.

(21) లక్ష్మణ:—(చేతులు జోడించి) తల్లీ! శ్రీరామపత్నీ! ఇవి నా తుదివందనములు. వీనిని సావధానముగా గ్రహింపుము.

(22) సీత:—వత్సా! సిద్ధముగా నున్నాను.

(23) లక్ష్మణ:—మాతరో! దైవసముఁడగు మా యన్నయాజ్ఞకు మాఱు పలుకనేఱక నిను దోడ్కొనివచ్చి ఈ నిర్జనారణ్యభూమిని బరిత్యజించిన నా యీ ప్రథమాపరాధమును క్షమింపఁ బ్రార్థించుచున్నాను.

(24) సీత:—కుమారా! పూజ్యులగు మీ యన్నగారి యానలెట్టివైనను మాఱాడక నన్నుఁ గొనివచ్చి కానలో విడిచిన నీ యోగ్యతను గాంచి యానందింతునే కాని యెంతమాత్ర మలుకఁ జెంది నిను నిందించుదానను గాను.

ఆ పావనోక్తుల నాలించి లక్ష్మణుఁడు సీతకుఁ బ్రదక్షిణ మొనర్చి దశదిశలఁ బరికించి యిట్లు ప్రార్థింపఁ దొడఁగెను.

(25) లక్ష్మణ:—ఓ లోకపాలకులారా! ఈ గర్భగుర్వి స్వర్గమువఱకు స్వేచ్ఛగా రథసంచార మొనర్చు దశరథసార్వభౌముని యనుంగు కోడలు. రాక్షసానీకముల నరకమునకుఁ బారదోలిన శ్రీరామచంద్రుని ధర్మపత్ని. నాచే నీయడవి నేకాకినిగా విడువఁబడినది. కావున దయామయులగు మీరెల్లరును రక్షింపుఁడు.

ఉ. దీనతఁ గేలుమోడ్చి వనదేవతలార! నమస్కరించెదన్;
వీనుల నొగ్గి నాదయిన విన్నపముం గృప నాలకింపుఁడీ;
మానిని నిద్రనున్న విషమస్థితి నున్నఁ బ్రమాద మొందినన్
హాని ఘటిల్లకుండను దయామతి నేమఱ కోముఁడీ యనున్.

చ. సకియలు వాఁకలార!; బలుసాములు దిక్పతులార! మాతరో
యకలుషజాహ్నవీతటిని! యన్నలు కొండల తేఁడులార! చే
రిక మిము లక్ష్మణుం డిదె మదిన్ మదిఁ బ్రార్థనసేయు, రాజపు
త్త్రికఁ గనిపెట్టుఁడీ; కనికరింపుఁడి; కావుఁడి పోయివచ్చెదన్.

(వ: సు: కవి)

కుందమాలయందలి ఈ సీతాపరిత్యాగరంగము నెన్నిసారులు పఠించినను తనివి తీరకున్నది. అందుచే నీరంగము నింతవిరివిగాఁ బ్రకటించి యుంటిని.

ఇంతటితో నీ సంస్కృతానుకార కావ్య వర్ణిత భావ వివరణముల నిలిపి ఆంధ్రానువాదకావ్యములం దీసీతాపరిత్యాగఘట్ట మెట్టి ప్రతిభతోఁ జిత్రింపఁబడి యుండెనో ప్రకటింతును. ఉత్తరకాండకథ నాంధ్రములోని కనువాద మొనర్చిన కవులు ముఖ్యముగా ముప్వురు. 1. తిక్కన సోమయాజి, 2. కంకంటి పాపరాజు, 3, వావిలికొలను సుబ్బారావు గార్లు. ఈ ముప్వురును సీతాపరిత్యాగ ఘట్టమును దమకృతులలో మనోహరముగాఁ జిత్రించియున్నారు.

అంతఁ గంకంటివారిచే విరచింపఁబడిన యుత్తరరామాయణములోని కరుణరసభరితములగు సీతాలక్ష్మణసంవాదనాదతరంగములు చెవికిసోకినఁ గాఱుఱాబొమ్మల కన్నులనుండి కూడ దుఃఖవారిపూరము లవిరతముగ నొలుకఁ దొడఁగును. "అపిగ్రావారోదిత్యపిదళతివజ్రస్య హృదయ"మ్మను భవభూతిసూక్తి సత్యమని తోఁచును. పాపరాజ కవివరుఁ డుత్తరకాండదధిని మథించి సమకూర్చిన ఆంధ్రానువాద నవనీతము నాస్వాదింపఁ జేసెదను.

వేల్పుటేటి యావలిగట్టునఁ దన్ను డింపి శిరమువంచి కన్నీటిబొట్టులు బొటబొట గట్టుపై రాల వెలవెలఁబాఱి మాటాడనేఱక నిలిచియున్న మఱదిని జూచి బెగడంది యాజనకనందిని యన్న తొలిపలుకులు.

ఉ. విన్నతనంబు మించఁ బురి వెల్వడినప్పటినుండి నీ మొగం
బున్న తెఱంగుఁ గాంచి దిగులొందుచు నుండు నిదేమొ యంచు మీ
యన్నకుఁ దత్సహోదరుల కాపురులకున్ శుభమే కదన్న నీ
కన్నుల నేల నశ్రువులు గ్రమ్మెడిఁ దెల్పు గదన్న లక్ష్మణా!

ఉ. మానసికవ్యథల్ రుజలు మాన్పఁగ నోపిన పుణ్యరాశి గం
గానదిఁ జేరి యుండియు గస్తిపడన్ దగునయ్య వేడ్కతోడుత
నీ నది దాటి తాపసులయింతులఁ గన్గొని భూషణావళుల్
కానుకలిచ్చి దీవనలు గైకొని వత్తము రమ్ము చెచ్చెరన్.

అని యా యమాయకురాలగు నిలాతనయ పలుక సుమిత్రానందనుఁడు మూఁగవానివలె మాటాడక యా ప్రజావతిని గంగయావలియొడ్డునఁ జేర్చి యతిప్రయత్నముచే నశ్రుపాతము నరికట్టుచు పెదవులదుర నేల నవలోకించుచు నిలిచియున్న రామానుజుని ముఖవైవర్ణ్యము నాసారసాక్షి పరికించి భీతహృదయయై మఱదితో నాడిన యావలి జాలి మాటల నాలింపుఁడు.

చం. పరసతు లెల్లఁ దల్లులుగ భావనసేయుదు వెల్లవేళలం
బరధనమన్న హాలహాలభంగిగఁ జూతువు బొంక వెన్నఁడున్

బరుమములాడ వెవ్వరిని బ్రాహ్మణభక్తియు రామసేవయున్
దిరమగు నీకుఁ దండ్రి జననీందిరకృత్యము లెవ్వి యియ్యెడన్.

కం. మన్ననఁ దొలంగి నిను మీయన్న నిరాకరణచేసి యాడెనొ నీ కా
యన్నపయి భక్తి దొలఁగెనొ కన్నాయమ నేమిన్నైనఁ గాఱించితివో

కం. గురునింద యాచరించితొ పరదూషణ చేసితివొ కృపారహితుఁడవై
శరణన్న వారిఁ ద్రోచితొ యరులకు వెన్నిచ్చి వేగ యరుదెంచితివో.

శా. సౌమిత్రీ! భయమయ్యెడిన్ నుసువు మాత్మ్మా దేవిజామాత యా
శ్రీమత్పద్మదళాక్షుఁ డారవికులక్షీరాబ్ధిపూర్ణేందుఁ డా
హేమత్స్మాధరధీరుఁ డాయసురమత్తేభేంద్రహార్యక్షుఁ డా
శ్యామాంగప్రభుఁ డామహాప్రభుఁడు లెస్సైనయున్నవాఁడే పురిన్.

ఈ పద్యరత్నము వినిర్మలప్రణయముగ్ధయగు ముద్దియ నిజజీవితేశుఁ డా
పన్నుఁడై యున్నవాఁడేమో యను వేగిరపాటుతో నాథుని కుశలమును
దెలిసికొన నాపుఁ నేరీతిని ప్రశ్నింతునో యాసిటును జాటుచున్నది.
ఈ కుశలప్రశ్నము నాలించి లక్ష్మణుఁ డెట్టకేలకు మనసుఁ జిక్కఁబట్టి
మెల్లగా నిదినె కన్నయూన నెఱింగించుట.

ఉ, ఇంతకుఁ బూనివచ్చి వచియింపకపోదున విన్ము తల్లి! దు
శ్చింతులు దైత్యచేఁబడిన సీతను గ్రమ్మఱ నేలుచున్నవాఁ
డెంతవిమోహి రాముఁడని యొగ్గులు వల్కిన నాలకించి భూ
కాంతుఁడు నిందఁజెంది నినుఁగానలలోపల డించి రమ్మనెన్.

ఉ. అంచిత వామలూరు జననాంతర భూముల నిన్ను డించి ర
మ్మంచు రఘూద్వహుం డనిచె నక్కట యొక్కడ నిల్చి యెట్లు వే
గించెద వమ్మ! యెవ్వరు సఖీజను లయ్యెద రమ్మ! యేమి యూ
హించి దినంబు లింకఁ గ్రమియించెద వమ్మ! బతివ్రతామణీ!

ఉ. నీవిమలప్రభావమును నీవినయాదికసద్గుణంబులున్
దేవుఁ డెఱింగియుండియును నిందలకున్ బయిలోడి యోజగ

త్పావని ! నీవుగోరిన నెపంబున నిచ్చటి కంపినాఁడు గా
కీవిరహాబ్ధి నేకరణి నీదఁగలాఁ డతఁ డింకవిూఁదటన్.

సీత యీ యసహ్యమగు లోకాపవాదమును, దుస్సహమగు శ్రీరామపరిత్యాగమును విని యాపలుకుల నమ్మఁజాలక సౌమిత్రిని బ్రశ్నించుట.

చ. కళవళ మంది తెల్పితివొ కాక పరాకునఁ దప్పవింటివో
కలనయినన్ రఘూద్వహుఁడు కానలలో నను ద్రోయఁ బంచునే
తెలిసి గణింపు లక్ష్మణ ! మతిభ్రమ మైనదొ హా ! సహింపు మి
ప్పలుకు లెఱుంగకంటి వెతఁ బాటిల నీకొక భ్రాంతి యున్నదే.

చ. పతి మతి నెంచెనేమొ తనుఁ బాసి యశోకవనంబులోపలన్
బ్రతుకదె పెక్కునాళ్లనుచుఁ గ్రమ్మఱఁ దాఁ జనుదెంచి శత్రునిన్
హతునిగఁ జేయు నేలు నను నాసగదా బ్రదికించె నాఁటి కా
గతి నిఁక నేమి యాసఁగొని కాయము నిల్పుదుఁ దెల్పు లక్ష్మణా !

చ. ఎఱుఁగని మూఢు లాడుకొను నెగ్గులకున్ భయమంది యప్పుడే
కఱకు మనంబుతో విభుఁడు కాననసీమకుఁ బంచెఁ గాక య
త్తెఱఁగొకసారి నన్బిలిచి తెల్పి మనోవ్యథ తీర్చి నిన్ను నే
మఱి నని బంపఁడయ్యె నభిమానము గూర్చియు నెంచఁ బోయెనో.

అని యిట్లా సీతామతల్లి తల్లడిల్లి తిరుగ నాభూరమణప్రణయ సమీరణప్రసరణము నిజజీవితమును రవణింపఁ జేయ నిట్లు పలికెను.

శా. ఆకర్ణాయతనేత్రమై మణిమయోద్యత్కుండలద్వంద్వశో
భాకీర్ణాంచిత గల్లమై సురదనంబై సుందరభ్రూయుతం
బై కమ్రస్మితచంద్రికావిలసితంబై యొప్పు శ్రీరాముమో
విూకాయంబునఁ జూచు భాగ్య మిఁక లేదేమో సుమిత్రాత్మజా !

చ. వనముల కేలవచ్చితివి వల్లభుని న్విడఁబాసి యొంటిగా
నని మునిపత్ను లెల్ల గుమియై యడుగన్ ధృతిమాలి వారి కే

మని వివరింతు నింత విపదంబుధి నేకరణిం దరింతు నే
యనువున నీ ప్రతిక్షణమహాయుగముల్ క్రమియింతు లక్ష్మణా !

సీ. అన్నలక్ష్మణ ! యింక నాలస్యమేటికిఁ
జను మయోధ్యాపురంబునకు నీవు
మువ్వురత్తలకును మ్రొక్కితినని తెల్పు
మఱచితి బంధుల నెల్ల నడిగితి నను
మతికృపాళునకు రామావనీంద్రునకు నా
మ్రొక్కుగా నతిభక్తి మ్రొక్కు మీవు
తనయాజ్ఞఁ దలఁ దాల్చి జననింద తనుఁజెంద
నీక కానలఁ జరియింతు ననుము

తే. భూజనుల బాంధవుల లెన్న ప్రోవుమనుము
తలప నాకేమగడయును దాన యనుము
భావ మెప్పుడుఁ దనమూర్తిఁ బాయదనుము
నెన్నో యొకయింత నామీఁద నిల్పు మనుము.

తే. పోయిరమ్ము శుభంబులు బొందు నిన్ను
నన్ను మఱవక యుండుమా యన్న యనుచు
గన్నుగవ నశ్రుధారలు గ్రమ్ముకొనఁగ
నన్నెలంతుక దీనయై యడలుచున్న.

లక్ష్మణుఁడు హృదయవిదారకములగు నాయిల్లాలిజాలిపలుకుల నాలించి మనసు చెదర నెట్టకేలకు దిట్టయై పలికెను.

క. చనఁ గాళ్లు రాక చన కిక్కఁ
జనదని ధేనువునుఁ బాయఁజాలని వత్సం
బునుఁ బోలి జాలిఁగొని యో
జననీ ! జననాథుఁ గొలువఁ జనుదునె యనుచున్.

ఉ. అల్లన మ్రొక్కి కాళ్లు వడఁకాడఁ బ్రదక్షిణ మాచరించి మే
నెల్లఁ జలింప హాహారుమని యేడ్చుచుఁ బెద్దయెలుంగుతోడ మా

తల్లిని డించి పోయెదను దాపసకామినులార ! కూర్మి సం
ధిల్లఁగఁ బ్రోవరే యనుచు దీనత లక్ష్మణుఁ డేగె నయ్యెడన్.

అప్పు డాకోసలనృపాలకాంత తల్లడ మందుచు లక్ష్మణుఁడు మరలి తనకడకు వచ్చుచున్నాఁడేమో యనునాసతో నాతని రథమువైపు చూపులఁ బ్రసరింపఁ జేయుటను, పాపరాజకవీంద్రుఁ డతిమనోహరముఁగ వర్ణించియున్నాఁడు.

తే. రమణి మఱికొంతదాఁకను రథముఁ జూచుఁ
దరుణి మఱికొంతసేపు కేతనముఁ జూచు
గాంత మఱిమీఁద రథపరాగంబుఁ జూచుఁ
బడఁతి మఱియంతటను వట్టిబయలు చూచు.

రామానుజుఁ డేగినపిదప నా శ్రీరామకాంత యెదను భావించిన తలపులలాలిత్య మెంత మనోహరముగా వర్ణింపఁబడినదియో పరికింపుఁడు.

సీ. ఒడిమీఁద నిడికొని యురముపైఁ జేర్చుట
చేరిక కది కడసారి యేమొ
చెక్కుఁ జెమ్మట చేలచెరఁగునఁ దుడుచుట
చెలిమికి నది తుదిచీటి యేమొ
పుట్టితావి కప్పురపీడె మిచ్చుట
యనురాగమున కది యవధి యేమొ
కోరిన వని కియ్యకొనుటది కరుణా
నుబంధమునకు ఫలగ్రంథ మేమొ

తే. మోము మోమునఁ గదియించి ముద్దుగొనుట
యదియె మోహంపుఁ బనికిఁ దీరుదల యేమొ
యెల నగవుదేరఁ జూచి లోఁపలి కనుచుట
మేలు చిన్నెల కది పొలిమేర యేమొ.

ఘనాశయులారా! వైదేహీవదనారవిందమునుండి వెలువడిన యీ భాసురానురాగసౌరభసుందరములగు ప్రణయగేయములు వీనుల సోకినం గంటం దడిపెట్టని ప్రాణి యుండునా? వినిర్మలప్రణయపాశబద్ధలగు సతీమణులు నిజప్రాణవల్లభుల యెడంబాటున కెన్నిరీతులం దల్లడమందుదురో? యెన్నివిధములం బలవరింతురో యాబాధలన్నియు నిటం బాపరాజ కవిచంద్రునిచేం జక్కగా వ్యక్తీకరింపంబడినవి.

సోదరీసోదరులారా! కంటిరా? మనకంకంటివారి యకుంఠితకావ్యనిర్మాణనైపుణ్యమును? మనసుం గరంగించు భావలాలిత్యనిర్మితికే కవిత యనుపేరు. జీవితలతను జిగిరింపంజేయురసమునకే యమృతమనిపేరు. ఇంతటితోం గంకంటివారి కవితామృతస్రవంతిని నిలిపి, ఆంధ్రకవిత్వారంగమున సన్నుతికెక్కిన తిక్కనసోమయాజి నిర్వచనోత్తరరామాయణరత్నాకరమువైపు మనసు మరల్తము.

అట సీత లక్ష్మణుని ముఖవైఖరిని గాంచి ప్రశ్నించుట.

ఉ. కారణమేమి నన్ను దశకంఠకులాంతకుం డెగ్గ వల్కెనో
నేరమి గల్గెనో యకట నిక్కము నా కెఱింగింపు మెట్టి దు
ర్వారమహోవ్యథం బొరయువాఁడవు కావు వివేకవిస్ఫురతా
చారుఁడ వైన నీవని విశాలవిలోచన గారవించినన్.

రామానుజుని దీనపరిదేవనోక్తులు.

ఉ. ఇత్తెఱఁ గాచరించుటకు నే నిది యేటికి నియ్యకొంటి నీ
యుత్తమురాలి నోంబలుక నోపగవచ్చునె యంచు వెండియుం
జిత్తముం గూడందెచ్చికొని చెప్పక పోదని నిర్ణయించి డ
గ్గుత్తిక వెట్టి లక్ష్మణుఁడు కోమలిం జూచుచు నశ్రులొల్కఁగాన్.

ఈపద్యరాజము సాధుజనులకు దుస్సహదుర్వార్త నెఱింగింప వలసివచ్చినపుడు సజ్జనచిత్త మెట్లు వ్యాకులాయత్తమై యుఱ్ఱూతలూగునో వివరించుచున్నయది. లక్ష్మణుఁడు సీతకు శ్రీరామసందేశ మందిచ్చిన తోడనే యాసతీమణికిం గలిగిన యలజడుల నీరీతిని గవివరుఁడు వర్ణించి యున్నాఁడు.

క. పలుకుడిగి పెద్దప్రొద్దా
కులదృష్టి మఱందిఁ జూచుఁ గొండొక నవ్వున్
దలయూఁచు ముక్కుపై సం
గుళి మిడు వెఱగందు వగలకుం గొలు విచ్చున్.

సీత తన్నడవిని డించిరమ్మనిన శ్రీరాముని నిందింపక తనకర్మమును నిందించుకొనుట.

సీ. అఖిలధర్మస్థితి నవచారి యందునే
యౌవనంబునఁ దప మాచరించెఁ
గరుణాసముద్రుఁడు గాఁడందునే యట్టి
యపరాధికృతక వాయసముఁ గాచె
నా శ్రితరక్షకై నర్థిలేఁడందునే
పగతుతమ్ముని రాజ్యపదవి నిల్పెఁ
బాలించి నన్ను సంభావింపఁ డందునే
నాకుఁగా నెన్ని యత్నములో చేసెఁ
తే. బతి జనించినకోలెను బరహితైక
లోలమతి యొడల్ సిదిమినఁ బాలు వచ్చు
నాఁ డిది కార్యమని నిశ్చయంబుచేత
నా సుభాగ్యంబ యొండొక వేయునేల.

సీత తనవారికి సందేశమంపుట.

చ. అతులితపుణ్యమూర్తులగు నత్తలకెల్లను నేను భక్తి మ్రొ
క్కితి నెఱిఁగింపు సూర్యకులకేతువునా విలసిల్లు రాము సం
తతిధరియించి యున్నయది దానికి శోభనమందఁ గచ్ఛప
స్థితి నయిసం దలంపు దయ సేయుఁడు మీరని యప్పగింపుమీ.
క. జనపతికి నింక నేనే
మని చెప్పిన నేమియగును నది గడచనె నై

నను నూసువోక వెండియు
ననియెద నొకమాట రఘువరానుజ నీతోన్.

చ. తనమదినొక్క యుమ్మలిక దక్కిన మంచిది దానిఁ బాపఁగా
నని తలపోసి చేయుపని కక్కట యేనను లోనుగాన నా
కు నెఱుఁగఁజెప్పి పొమ్మనుటకుం దగ నే మొగమోటలేక మ
న్ననయెడనైన రాజులమనంబులు ద్రిప్పఁగఁ బల్కి గల్గునే.

ఉ. మేనికి సంతవంతఁ బడ మిక్కిలి కాకియఁబెట్టి నోంపఁగాఁ
బూనితి నోర్వకున్న నది నోపున యొల్ల జగంబువారలున్
మానము లేక యీ తులువమాటలు నాడెస నాడ దుస్సహం
బైనది దీని మానుపు నుపాయము చెప్పవె దేమి సేయుదున్.

*ఇంతటితో తిక్కనమఖి కవితావైఖరిని ముగించి వావిలకొలను సుబ్బారావుగారి యుత్తరకాండములోని సీతావివాసఘట్టము నుదహరింతును. లక్ష్మణుఁడు సీతకు శ్రీరామశాసనమును విశదీకరించుట.

ఉ. తల్లి వచింతు నేమనుచు దారుణవార్తలు పట్టణంబులం
బల్లెల నిన్నుఁగూర్చి జనవర్గము పల్కుట తాను గొల్వులో
నల్లరుఁ జెప్పగా విని మహీంద్రుఁడు దుఃఖముపేర్మి హృద్గతం
బెల్ల వచించి నాకుఁ దనయింటికి నేగెఁ బతివ్రతామణీ !.

ఈదుర్వార్తను విని సీత పరితపించుట.

ఉ. ఏటికిఁ బుణ్యశీలుఁడు నరేంద్రుఁడు రామవిభుండు నివ్వాసీ
వాటికిఁ బంచె నింక నటువంటి యసత్కృతి యేమి చేసితో
బోటి యటంచు నన్ను మునిపుంగవు లాడఁగ నేమి పల్కుదున్
బాటి దొలంగి నావిభునిపై నెటు చెప్పను నిర్దయత్వమున్.

అని పరితపించి సీత తనవారికి సందేశముల నందఁజేయును.

---

* తిక్కన యిక్కడ సీతనోటవాడించినమాటలనీటు సాటిలేని బాటను బడి పరిగిడినది !

క. నామాఱుఁగ భూపతికిని సౌమిత్రి మ్రొక్కి వ్రాలి చరణంబుల మీ
సేమంబు నడిగెననుమీ యామ్మాక్షిని జెప్ప వన్న యత్తల కెల్లన్.

ఉ. పౌరుల రిత్తనిందలకుఁ బాల్పడకుండెడునట్లు, ధారుణీ
భారము బూను మంచనుము; భార్యకుఁ బ్రాణవిభుండె దైవతం
బారగఁ జుట్టమున్ గురువునాటను బ్రాణము కంటె మిన్నగా
సారసనేత్ర భర్త కెలసంబులు దీర్చుటె యుక్త మెప్పుడున్.

క. అని నాసంగ్రహావాక్యం
బును జెప్పుము బతికి నింకఁ బుటికిం బోమ్మా
కనుమీ నను గర్భము చి
హ్నమును దాల్చినదాన నట్టి యలజడి గలిగెన్.

ఇంతటితో వావిలకొలనువారి కవితను ముగించి రామనారాయణకవులు విరచించిన కుశలవపట్టాభిషేకనాటకములో నీసీతాపరిత్యాగరంగమునందలి కొన్నిపద్యముల నుదహరింతును.

సీత శ్రీరామపరిత్యాగవార్తను విని లక్ష్మణునితో నన్నమాటలు.

చ. వనమున మున్ గురంగమును బట్టఁగ బోయెడు కాలమందు
జనకజఁ జూచుచుండవలె జాగ్రతతో నని యేగినట్టి య
మ్మనుకులవర్ధనుండె యనుమానము బూనక కాననాళిలో
నను విడనాడి రమ్మనియెనా నిజుఁ దెల్పు సుమిత్రపుత్రకా.

ఉ. ఇంతకు రామభూపతి యహీనగుణాఢ్యుఁడు లోకనిందకై
కాంతను నన్ను వీడి త్రిజగంబులయందునఁ బ్రాకుచున్న భా
స్వంతుకులప్రసిద్ధికిని భంగము జేకుఱకుండఁ జేసె నా
కంతియు చాలు నీవు వగపొందిన లాభము లేదు లక్ష్మణా.

ఇంతటితో నీకుశలవపట్టాభిషేకమును ముగించి పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే విరచింపఁబడిన లవకుశనాటకమున సీతాపరిత్యాగరంగ మెట్లు కరుణరసోచితముగాఁ జిత్రింపబడినదియో వివరింతును.

సీత శ్రీరాముఁడు తన్ను విడనాడె నన్న సంగతిని దెలిసికొని మనసార దాశరథినిఁ దలంచి యిట్లు పలికెను.

సీ. పిన్ననాఁటనుఁగోలె నిన్ను దైవముగాఁగ
  నెన్నియుండిన భక్తి నెన్నవలదె
అలరావణుని బాధ లన్ని నే నోర్చిసీ
  కొఱకునై మనుట యింతరయవలదె
బంధుల రాజ్యంబుఁ బాసి నే నీవెంట
  కానకు వచ్చుట కాంచ వలదె
అనదయే దీనయే యబల గర్భిణి యంచు
  ననుఁబ్రోవ సత్కృప కనఁగవలదె
గీ. మనసు రాయియె నీకు నో మనుజపాల
భువననుతనామ రవికులాంభోధిసోమ
దానవవిరామ సత్కృపాధారసీమ
రమ్యగుణధామ శ్రీరామ రామరామ.

సీత సౌమిత్రితోఁ దనవారి నందఱి నడిగితినని తెల్పుమనుట

సీ. అరయ కౌసల్యాదియత్తల నడిగినా
  వందనంబుల నీవు పలుకు మన్న
భరతశత్రుఘ్నుల కఱయ నాకడసారి
  దీవనలను నీవు తెలుపు మన్న
మారామచంద్రుతో మరణవేళను దన్ను
  నడిగితి నని నీవు నుడువు మన్న
ఇకనైన నపకీర్తి యేమియు లేక తా
  హాయిగ నిద్రింపు మనఁగదన్న
గీ. తన్ను దైవంబుగా నమ్మి యున్న కాంత
కకట ప్రతిఫలం బిదియె యంచనఁగదన్న

తనదు నుపకృతి మఱువసం చనఁగదన్న
మహిని నీజానకిని నింక మఱువ కన్న.

ఇంతటితో నీపండితభాషితముల ముగించి శ్రీ బులుసు వెంకట సుబ్బారావు బి. ఎ. బి. ఎల్ గారు రచించిన కోసలసామ్రాజ్యనాటకమున లక్ష్మణుఁడు భరతునితోఁ దాను సీతను విడనాడిన దుఃఖవార్తనుఁదెల్పు రంగము హృద్యముగాఁ జిత్రింపఁబడి యున్నది. దాని నిటఁబ్రకటింతును.

లక్ష్మణ:—సంతతబాష్పధార యాపరమపావని పట్టుపైఁటను బూర్తిగాఁ దడిపి వేసియుండెను.

భరతు:—ఈలోకము మేలుకొఱకు దుఃఖముల నెల్లఁ దానె యనుభవించుచున్నది గదా.

లక్ష్మణ:—నిశ్చయము... "నాకంటికొసలనుండి వేఁడికన్నీటి నీక నీపుడమిపైఁ బడనీయను. అది యార్యపుత్త్రున కమంగళావహము. పరిత్యజింపఁబడినను నీసీతకు శ్రీరామచంద్రుఁడే పతి, గతి, ప్రాణము దైవము అనిచెప్పుము. పూజ్యులగు నాయత్తలకు నమస్కారములను, మఱదులకు దీవనలను జెప్పుము. నాపై దయగలదేని యీ సీతను మఱచి పొండని యందఱ వేఁడుకొనుచుంటి ననిచెప్పుము. లక్ష్మణా! రథముపై రాజధానికి మఱలుము. మఱియు మీయన్నగారికిఁ దోడ్పడుము." అని చెప్పుచుండగా నాహృదయము ద్రవమైపోయినది. నాదేహము ముచ్చెమటలు పోయుచు నించుక వడఁక జొచ్చెను. కనులవెంట నూఱక కన్నీరు ధారగా రాఁజొచ్చెను. అది కేవలము విచారమనియుఁ దోపదాయె. నాశిరస్సు భక్తిచే నమ్రమాయె. చూపు లాపె పాదపద్మములపై నిలచినవి. చేతులు నమస్కరించుచుండెను.

భరతు:—ఆహా! ఏమి యాభావపారిశుద్ధ్యము! నిష్కలంకప్రేమ! నిర్మలభక్తి! సీతా! నీవు ధన్యవు. కాదు. నీజన్మచే నీలోకము ధన్యమైనది. సతీత్వమున కాదర్శము నీభూమియందు నిలుపుటకై, యవతరించితివి.

పాఠకమహాశయులారా! యీరీతిగాఁ బైనఁ బేర్కొనఁబడిన సంస్కృతాంధ్రకవివరులెల్లరును సీతాపరిత్యాగఘట్టమును మనోహరముగాఁ జిత్రించి యుండ భవభూతిమహాశయుఁ డారంగము సంగతిఁ దననాటకమున సంఘటింపకుండుటకుఁ గారణ మేమియో తెలియకున్నది. మఱియు నుత్తరరామచరితమునందలి యాతర్నాటకమునఁ గూడఁ బరిత్యాగసమయమున సీతాలక్ష్మణసంభాషణరంగముఁ జేర్పఁడయ్యె. ఆయంతర్నాటకము సీత ప్రసవవేదనచే గంగలోఁ బడుట మొదలుకొని చిత్రింపఁబడినది. "ఏకోరసఃకరుణఏవ" అనిగర్జించిన కవిసింహుఁడు కరుణరసపోషకమగు నీసీతాపరిత్యాగరంగమును విడచుటకుఁ గారణముఁ గానవచ్చుటలేదు.

ఇట భవభూతివిరచితమగు నుత్తరరామచరితము నందలి యితివృత్తవిన్యాసమును గూర్చి కొంతచర్చింపఁ దలంచితిని. కావున సోదరులాదరభావముతోఁ దిలకింపఁ గోరుచున్నాను.

మగఁడు మగువ మనుగడ చెడె నను నెపమున విమలచరితయగు సతి నడవికిఁ బో నడచినపుడు దురంతచింతాసాగరమునఁబడి యడలుచున్న యాతరుణీమణి కాతరుణమున కరుణరసభరితమగు నిజరమణప్రణయసందేశవాణి తరణియై తనరారు ననుటకు సందేహము లేదు. కావుననే దిఙ్నాగకవీంద్రుఁడు కుందమాలలో సీతాజీవితమును గాపాడఁగోరి శ్రీరామప్రణయసందేశమును లక్ష్మణునిచే నందఁజేసి యున్నాఁడు. ఇటఁ జిత్రింపఁబడిన లక్ష్మణసంభాషణములు ప్రకరణౌచిత్యమున కెంతయు సహకారముగాఁ దనరారుచున్నవి.

భవభూతి యట్టి యనుకూలానురాగవార్త నందిచ్చి సీత ప్రాణముల నిలువఁబెట్టఁ బ్రయత్నింపఁడాయె. నిక్కముగా శ్రీరాముఁనకు సీతపైఁ జెక్కుచెదరని మక్కువ యెదలోఁ బదిలముగా నున్న నాఁడు ప్రజాపవాద కలంకాపనోదననిపుణుఁడగు నాభూరమణుఁడు రహస్యముగా నిజప్రణయినికి నిష్కలంకానురాగసుందరములగు సందేశ

ముల నందఁజేయక, యశనిపాతములవలె హృదయదారకములగు కేవల పరుషపరిత్యాగోక్తులఁ దెలుప సాహసించునా?

దారుణమగు పరిత్యాగవార్త కర్ణపుటములఁ బడినతోడనే హృదయము విదీర్ణమై సీత యంతమొందునేమోయను సంశయసమయమునఁ బ్రాణేశుని ప్రణయసందేశము అమృతధారవలె కడసంటియున్న జీవితకళ నుద్దీపింపఁజేయు ననుటకు సందియము లేదు. భవభూతి వెంటనే యట్టి యమూల్యసందేశము నందియ్యక సీత సుతులఁ బ్రసవించిన పండ్రెండేండ్లకు సీతారామసమావేశరంగమును సృష్టించి యట్టి శ్రీరామునకు సీతపైగల ఘనానురాగసంపదను రామునినోటఁ బ్రకటింపఁ జేసియున్నాఁడు.

నిజముగా నీరంగ మిట సీతాజీవితసంరక్షణార్థము చిత్రింపఁబడి యుండలేదు. మఱేమన దుస్సహసీతావియోగముచేఁ గృశీభూతుఁడై యున్న శ్రీరాముఁడు పంచవటీదర్శనముచే ద్విగుణీకృతావేదనుఁడై మడయునేమోయను భయమున సీతాకరస్పర్శసంభాషణముల సమకూర్చి యాకోసలనృపాలునకుఁ బ్రాణభయము రాకుండఁ గాపాడుటకు రచింపఁబడినది. ఈసంగతి యుత్తరరామచరితతృతీయాంకమున నడచిన మురళాతమసాప్రసంగముచే సువిదితమగుచున్నది. పరికింపుఁడు.

మురళా:—సఖి! తమసే! జానాస్యేవ యథా వధూపరిత్యాగప్రభృతి

శ్లో. అనిర్భిన్నో గభీరత్వా దంతర్గూఢ ఘనవ్యథః
పుటపాకప్రతీకాశో రామస్య కరుణోరసః.

తేన రామభద్రేణ వధూసహవాసవిస్రంభసాక్షిణః ప్రదేశా దృష్టవ్యాః……అతః పదేపదే మహాంతి ప్రమాదస్థానాని శంకనీయాని.

తమసా:—ఉచితమేవ దాక్షిణ్యం స్నేహస్య……

(ఉత్తరరామచరితము)

ఈపైభాగమునకు శ్రీ జయంతివారియాంధ్రానువాదము.

మురళ—సఖీ తమసా! వధూపరిత్యాగము మొదలుకొని

గీ. అతిగభీరమగుట నగపడదు పైకిఁ
గాని లోనమిగులఁ గలుచుండు
గుతగుతమనుచు నుడుకు పుటపాకముగతి,
గురుతరమగు రాముకరుణరసము.

రామభద్రుఁ డిపుడు మరల నిటకు వచ్చి పూర్వపరిచితములైన పంచవటీవనప్రదేశములఁ జూడనైయున్నవాఁడు అందువలన మాటి మాటికి మహాప్రమాదములు గలుగవచ్చును......

తమస:—స్నేహమునకు దాక్షిణ్య ముచితమే......

ఈప్రసంగముచే రాముని ప్రాణములఁ గాపాడ సీతను రాముని కడకుఁ దోడ్కొని వచ్చినట్లు విదితమగుచున్నది.

ఉత్తరరామచరితమునఁ దృతీయాంకమునందలి శుద్ధవిష్కంభము వింతమార్గమున నడచినది. కారణమేమన ధీరోదాత్తుఁడగు పురుషసింహుఁడు కాంతావియోగముచే సంత మొందుస్థితికి రాఁగలఁడని తలఁచి యీ యాపద నివారింప నెంచిన కవిశేఖరుఁడు బేలయగు యబల, పైగా నెలలునిండిన చూలాలు, కేవలపతివియోగచింతసే కాక దుస్సహజనాపవాదఖేదమునఁ గూడ మడయుట తప్పదని తలంచి యీవిపత్తునుండి యీయార్తను గాపాడఁ దగు రంగమును సంఘటింపవలదా? అట్లొనర్పక మేరుధరాధరధీరుఁడగు రాముని జీవితమును గాపాడఁ దలంచుట వింత కాదా?

మఱియొక వింత. సీత శ్రీరామునితోఁ దనకు గంగాతీరమునందలి మునిపల్లెల దర్శింపఁ గుతూహలము కలదని నివేదింప నాదాశరథి వైదేహిమనోరథము నీడేర్చు నెపమున నాపెను గంగాతీరమునందలి వాల్మీకాశ్రమముచెంత విడచిరమ్మని తమ్మునితోఁ దెలిపెను. సౌమిత్రియు నన్న యాజ్ఞానుసారము సుకుమారియగు జనకకుమారినిఁ దోడ్కొనిపోయి ప్రాచేతసాశ్రమమునకు సమీపముగా గంగయొడ్డున దిగవిడిచి తిరిగి వచ్చి యీవార్తను శ్రీరామునకు నివేదించి యుండెను.

ఇటుల నిజప్రేయసి తపసిపల్లెపొంత గంగదరిని విడువఁబడెనని యెఱింగి యుండుటచే శ్రీరాముఁ డింతగాఁ జింతఁజెందవలసిన యగత్యము కానరాదు. కావున రఘువీరుఁ డింతటి వంతలపాలగుటకుఁ గారణమేమి? గర్భగుర్విణియగు నుర్వీసుత విడువఁబడిన యడవి క్రూరమృగభయంకరారణ్యసీమ కాదే! అదియొక యహింసాసుందరమగు శాంతపావనతపోవనభూమియే! అందుచే భవభూతికవివరుఁడు వర్ణించినంతటి శ్రీరామ దుఃఖావిర్భావమునకుఁ దగినకారణము కానరాకున్నయది.

పరిశీలింపఁ గోసలసార్వభౌముఁ డగు శ్రీరాముఁడు, భవభూతికవివరుఁడు చిత్రించినంతటి దురంతచింతలకు లోనగు బేల కాఁడు. మేరునగధీరుఁడగు పురుషసింహుఁడు. ఈసంగతి నీక్రిందిఘట్టములు ధ్రువముచేయుచున్నయవి. బాలరామాయణమున నారదుఁడు శ్రీరాముని గుణముల నిట్లు వర్ణించియున్నాఁడు "సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ" అనగా రాముఁడు గాంభీర్యమున సముద్రమునకును ధైర్యమున ధరాధరనాథునకును నెన యని భావము. "ధైర్యంబునను హిమధరణీధరము సాటి వీర్యసమున్నతి విష్ణునిభుఁడు. (భాస్కరరామాయణము)

పట్టాభిషేకసమయమున దశరథరాజేంద్రుఁడు ప్రజలకు శ్రీరామ గుణముల నిట్లు వర్ణించియున్నాఁడు

శా. ధీరోదారుఁడు నిర్వికారుఁడు జగద్వీరుండు సౌజన్యవి
స్తారుం డుత్తమశీలుఁ డర్థులవిస్తారుండు శూరుండు గం
భీరుం డిద్ధవిచారసారుఁ డగుటన్ బెంపార విశ్వంభరా
భారం బెల్ల భరింప రాఘవు మహాభాగున్ నియోగించెదన్.

(భాస్కరుఁడు)

కౌసల్య శ్రీరాము నెడఁబాసి యుండఁజాలక ప్రాధేయపూర్వకముగా నిట్లు బ్రతిమాలికొనెను.

శ్లో. కథంహి ధేను స్స్వంవత్సం గచ్ఛంతం నానుగచ్ఛతి
అహం త్వా నుగమిష్యామి యత్ర పుత్త్ర గమిష్యసి.

శ్లో. యది త్వం యాస్యసి వనం త్యక్త్వా మాం శోకలాలసాం
అహం ప్రాయ మిహాసిష్యే నహి శక్ష్యామి జీవితుం (వాల్మీకి)

చ. పొలుపున నిండు జందురుని బోలిన నీదుముఖారవిందమున్
సులలిత రీతినొక్కనిముసంబును జూడక యుండనేల నే
తలపున జీవముల్ నిలుపదాళుదురా? పదునాల్గువర్షముల్
చెలువరి నిన్నుఁ జూడకయె చిన్ని కుమారక! దీనురాలనై.

క. నే నింట నేడ్చుచుండఁగఁ
గానలకున్ నీవుపోవఁ గాంక్షించెద వే
నేనొల్లను జీవింపగ
బూనుదుఁ బ్రాయోపవేశమున్ నాతనయా. (వావిలికొలనువారు)

చ. అనఘవిచార యేను గురు నట్లనె ధర్మసుహృ ద్విశేషతం
దనరిన పూజకుం దగిన దానను మద్వచనంబు నెమ్మనం
బున నిరసించి దుఃఖరసపూరితభూరిగభీరవార్ధిలో
ననుఁ బడఁ ద్రోసి నీకుఁదగునా? యిటు కానసీమ కేగగన్.

(గోపీనాథ)

ఇట్లు తల్లడిల్లుచున్న ముదసలితల్లి జాలిపలుకులు చెవినిఁ బడిన తోడనే గుండె నీరై యింట నిలిచిపోవలసిన సమయమున రాముఁడు ధీరుఁడగుటనే తల్లిమాటను బాటింపక యడవికి వెడలెను. అట్టి ధీరావతంసుఁడు కావుననే యీసమయమున కౌసల్యామందిరమున కేగు రాముని వాల్మీకి యిట్లు ప్రశంసించియున్నాఁడు. "మాతు స్సమీపం ధీరాత్మా ప్రవివేశ మహాయశాః" ధీరస్వాంతుఁడగు రాముఁడు తల్లికడ కేగెనని భావము.

మఱియు దనవియోగముసహిఁ దాళఁజాలక ఖిన్నలైయున్న కౌసల్యాలక్ష్మణులకు ధైర్యము నుగ్గడించిన ధర్మవీరుఁడు. కనుఁడు "స మాతరంచైవ విసంజ్ఞకల్పాం ఆర్తం చ సౌమిత్రి మభిప్రతప్తం, ధర్మే స్థితో ధర్మ్యమువాచ వాక్యం యథా సపవార్హతి తత్ర వక్తుం" (వాల్మీకి)

క. నిర్మలమతి దల్లికి నిటు శర్మంబుగఁ బలికి రామచంద్రుండు శశ్వ
ద్ధర్మవిదగ్రేసరుఁడును ధర్మభృదగ్రేసరుండు దమ్మునకనియెన్.
(వావిలికొలనువారు)

ధైర్యంబున జంతాదివికృతులు వదనంబునన్ దోపనీక మనంబున నడంచుచు నిట్లనియె" (గోపీనాథ) ఇటుల కౌసల్యాలక్ష్మణుల కరుణ భాషితములకు వశుఁడు కానంతటి దిట్ట.

శ్రీరాముఁడు, తనజనకుఁడు తన్ను వీడియుండనేఱక వాపోవు చున్నపుడు ఇట్లు ధైర్యమును హెచ్చరించి యున్నాఁడు.

"అపగచ్ఛతు తే దుఃఖం మాభూ ర్బాష్పపరిప్లుతః
న హి క్షుభ్యతి దుర్ధర్షః సముద్రః సరితాంపతిః." (వాల్మీకి)

క. మనమున శోకము విడువుము,
కనులన్ బాష్పములు నింపఁగా వలవదు మే
దినిలోఁ దటినీవల్లభుఁ
డినకులవర యెన్నఁడైన నింకునె జెపుమా. (గోపీనాథ)

ఇట్టి ధీరాగ్రేసరుఁడు ఇంత దూరము పోనేల. ఉత్తరరామచరిత ములో శ్రీరాముఁడే యిట్లు తన్ను గూర్చి ప్రకటించుకొని యున్నవాఁడు.

శ్లో. స్నేహం దయాం చ సౌఖ్యం చ యది వా జానకీ మపి
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా. (భవభూతి)

కం. లోకారాధనమునకై శోకంబనుమాటలేక సుఖమును దయ న
స్తోకస్నేహమునైనను, త్మాకాంతాతనయునైనఁ జయ్యన విడుతున్.
(జయంతివారు)

అని యిట్లు శ్రీరాముని నోట దీమసపుమాటలఁ బలికించిన భవభూతి యాధీరుని కంటినుండియే యవిరతాశ్రుధారల నొలికించుట పాడియా?

మఱి యొక సంగతి. శ్రీరాముఁడు తనకాంత వాల్మీకి తపోవనము చెంతఁ జేరి నిర్భయముగా నుండునని గట్టి నమ్మిక కలవాఁడగుటచేతనే

లక్ష్మణుఁడు సీతను గంగదరిని విడచి వచ్చిన పిదప నిజసతిగతి యేమా యెనో యని వ్యాకుల మంది ఆమె యెక్కడ నెట్లున్నదియో తెలిసికొ నుటకు దూతను బంపఁడాయె. అట్టి దృఢవిశ్వాసమే లేకున్న మున్నర ణ్యావాస సమయమున సీతకై కుంజపుంజములును, గుట్టమెట్టలును, కందరమందిరములును, కోనలోయలును, లోనుగాఁగల తావులెల్లఁ దమ్మునితోఁ గలయఁ దిరిగిన రాముఁ డిట్లుపేక్షించి యుండఁగలఁడా?

శ్రీరాముఁడు సీతక్షేమమును దెలిసికొనుటకై దూతను బంపిన సంగతి ప్రజలకుఁ దెలిసి "ఈకోసలనృపాలుఁడు మాటమాత్రమునకు సీతను విడచెనే కాని విరాగుఁడై యామెను బరిత్యజింపలేదు" అని తలం తురను జంకుచేఁ దటస్థముగా నుండె నందమా! అట్లనుట సరిపడను. ఏమందురా! ఆత్మసములును సర్వదా తన్నుఁ గనిపెట్టుకొనియుండు వారును ధీశాలురనగు లక్ష్మణాదిసోదరులకుఁ గూడఁ దెలియరాకుండ రహస్యముగా లోకవార్తలఁ గొనివచ్చు దుర్ముఖాదిగూఢచారులు తనకడ నుండిరే. వారిలో నొక్కనిపుణునిఁ బంపి సీతస్థితిగతులఁ దెలిసికొన నగునే.

ఎట్టి కట్టుదిట్టమగు రహస్యమును గూడఁ బ్రజలు కనిపెట్టఁగల ధీమంతు లందురా! అట్లగుచో నిపు డాతఁ డడవినిఁ బడి యొడ లెఱుం గక యాపుడమితనయకై తల్లడిల్లిన సంగతిని మాత్రము కనిపెట్టఁ జాల రందురా? కావున శ్రీరాముఁడు ధీరుఁడగుటను, సీతస్థితిగతుల నూహిం పఁజాలిన ధీశాలియగుటను, నిజకాంత క్షేమమును దెలిసికొన వేగిరపడఁ డాయె నని యూహించుటయే సమంజసము.

మున్ను బంచవటిని సీత యపహృతయైనప్పుడన్ననో, హింస్రా రణ్యజంతుసంతతులతోడను క్రూరాతిక్రూరములగు క్రవ్యాదసందోహ ములతోడను నిండి యడుగడుగునకు నాపదల కాలవాలమైన భీకరార ణ్యమున శిరీషకుసుమపేశలగాత్రియగు జనకక్ష్మాపాలపుత్త్రిక యెట్టి యిక్క ట్టునకు లోనాయెనో యని తల్లడమంది "అపి గ్రావా రోదిత్యపి దళతి వజ్రస్య హృదయం" మ్మని భవభూతి తెలిపినరీతిని రాలుకరఁగునట్లును, రవలు పగులునట్లును శ్రీరాముఁడు విలపించెననుట సమంజసము.

కాని యటువలె నిట విలపింపఁ దగిన యాపద సీతకు సంప్రాప్తమై యుండునని తలంప వలను పడదు. "పురా కిల వాల్మీకితపోవనోపకంఠే సంత్యజ్య ప్రతినివృత్తే లక్ష్మణే" అను నుత్తరరామచరిత తృతీయాంకమునందలి తమసావచనముచే సీత వాల్మీకిమునీంద్రుని తపోవనోపకంఠమున నున్న సంగతి విదితమగుచున్నది కదా? అందుచే నెందులకు మునుపటికంటె నింత మిన్నగాఁ గన్నీటిధారలు కాలువలై ప్రవహింపవలసివచ్చె.

అరణ్యకాండమున దండకాటవిని జానకిని గోల్పోయి ఖిన్నుఁడై యున్న సీతాకాంతుని యవస్థకును, ఉత్తరకాండమున వైదేహినిఁబరిత్యజించి విచారించుచున్న కోసల జనపతి యవస్థకును హస్తిమశకాంతరమున్నయది. అచటిస్థితి జానకీరమణునకు సీత దుర్జ్ఞేయమగుటచేఁ ప్రబల విలాపకారణమాయెను. ఇచటి దాశరథికి భూసుతయునికి యవగతమగుటచే సహ్యావేదనాహేతుకమై యున్నది.

మఱి యొక విషయము. భవభూతి, సీత దుస్సహమగు ప్రసవవేదనకుఁ దాళఁ జాలక గంగాజలముల నుఱికె ననియు, అసీటిపాటువలన నిరువురు కొడుకులు పుట్టినట్లును, గంగాపృథ్వీలాశిసువ్రలతో సీతను పాతాళమునకుఁ గొంపోయినట్లును, పిమ్మట నాకూసలు స్తన్యముల విడచినతోడనే గంగాదేవి వాల్మీకాశ్రమమునకుఁ దోడ్కొని వచ్చి యాశిశువులఁ బ్రాచేతసుని వశమొనర్చినట్లును, కథను చిత్రించియున్నాఁడు. పరికింప నీరంగ మస్వాభావికముగఁ జూపట్టుచున్నది.

ఉత్తరకాండాది గ్రంథములయం దంతటను సీత వాల్మీకాశ్రమములోఁ బ్రసవించినట్లును తపసిముత్తైదువు లాపెకుఁ బురుడు బోసినట్లును వర్ణింపఁబడి యున్నది. భవభూతి సహజమగు నిట్టి ప్రసవవృత్తాంతమును ద్రోసిపుచ్చి, చిత్రించిన ప్రసవప్రశంస యంత సొంపుగాఁ గాన

వచ్చుట లేదనవచ్చును. మఱియు నీవిరుద్ధప్రసవరంగము లేకున్న నాట కేతివృత్తమున కట్టికొంతయు గానేఱదు.

ఇదియునుం గాక సీత తాను ప్రసవించువఱకు మేనం బ్రాణముల నిలిపియుంతును గాని మఱెట్టి సాహసకార్యము నొనరింపనని పలికియు న్నది. కనుఁడు "న ఖల్వద్యైవ సౌమిత్రే జీవితం జాహ్నవీజలే, త్యజేయం రాజవంశస్తు భర్తుర్మే పరిహాస్యతే." (ఉత్తరకాండము.) సౌమిత్రీ! రాజ వంశము నిర్లక్ష్యము సేయఁ దగినదైనచో గంగానీరమున జీవితమును విడు వకుందునా?

"స్యాద్రక్షణీయం యదిమే న తేజస్త్వదీయ మంతర్గత మంతరాయః"

(రఘువంశము) అంతర్గుప్తమైయున్న తేజము రక్షణీయము. అట్టి యంతరాయమే లేకున్న.

"కిన్ను ఖలు తస్యైవ నిరనుక్రోశస్య సమాన ఏవ ప్రసవః ప్రేక్షితవ్య ఇతి వచనీయకంటకోపనీతం జీవితం పరిరక్షామి" (కుందమాల)

ఏమి చేతును! నిర్దయాత్ముఁడగు నారాజునకు సమానమగు ప్రసవ ము పాలింపఁదగినదగుటచే లోకాపవాదదూషితమగు జీవితమును రక్షిం చుచున్నాను.

ఇట్లు పైగ్రంథములన్నియు సీత తనయందు సంరక్షణీయమగు సూర్యవంశసంతానతేజము లేకున్న నీయసహ్యదుఃఖసమయమునఁ బ్రా ణములఁ బరిత్యజింపకుందునా? అని లక్ష్మణునితోఁ బలికినట్లును, ఆరీ తినే ప్రాణముల దేహమున నిలిపి వాల్మీకి తపోవనమున శిశువులఁ బ్రస వించినట్లును బోధించుచున్నవి.

వేఱొక సంగతి. భవభూతి యుత్తరరామచరితమున సీతగంగలోఁ గవలలఁ గనినట్లును గంగావసుంధరలు శిశువులతో సీతను రసాతలము నకుఁ దోడ్కొనిపోయి సీతనొక్కతెను నట విడచి, శిశువులు పాలువిడచి నతోడనే వాల్మీకియొద్దకుఁ గొనివచ్చి యాతనివశ మొనర్చినట్లును కథను జిత్రించియున్నాఁడు. పరికింప నీకథానకవిన్యాసము ప్రకృతివిరుద్ధముగాఁ

జూపట్టుచున్నయది. ఎక్కడనైనఁ బుత్త్రప్రేమవశంవదయగు మాత నందనులతోఁ గలసియుండఁ గోరునుగాని గోడ్రాలివలె నిర్దయాత్మయై విడియుండ సాహసించునా? పదిరెండేండ్ల దనుక మందహాససుందరములగు నిజనందనవదనారవిందముల నవలోకింపక యుండఁగలదా? ఇట్లు జననీనందనుల విడదీయుటచేఁ జేకూరువస్తురమ్యత యేదియో కానరాదు. కావున నితరకవివరులు వర్ణించినరీతిని సీత మునిపల్లెనుఁ బుత్త్రులఁ బ్రసవించి యాబాలుర ముగ్ధభాషితములను వీనులార వినుచు వారి మురిపెంపుచేతలఁ గనులారఁ గాంచుచుఁ దనకు వాటిల్లిన పతిపరిత్యాగదుఃఖమును గొంత మఱపొంది యున్న దనుటయే సంగతము.

భవభూతికవివరుఁడు, ధీరోదారుఁడగు రాముఁడు సీతాపరిత్యాగస్థానకోవిదుఁడగుటచే సహ్యావిచారుఁడుగాఁ జిత్రింపఁదగియుండ దుస్తరదుఃఖసాగరమగ్నునిగాఁ జిత్రించుటయు, ధీరాతిధీరుఁడగు నావీరుఁడు సీతావియోగఖేదాతిశయముచేఁ బ్రాణములఁ బాయునేమో యని సీత నాతని కడకుఁ గొనివచ్చుటయు, మునిపల్లెను దాపసకాంతలచెంత సుతులఁ బ్రసవించిన జానకి, జాహ్నవీజలములఁ గవలలఁ గనెనని వ్రాయుటయు, స్వతనయముఖారవిందములఁ బరికింపక సీత పాతాళమునఁ బదిరెండేం డ్లొంటరిగా నిలచియుండెనని చిత్రించుటయు, సుప్రసిద్ధ కవివర ప్రబంధములయందలి యితివృత్తమునకు భిన్నముగా నుండుటయకాక ప్రకరణానుకూలమగు సహజసౌందర్యమును గూడఁబోషింపఁజాలకున్నవని నాభావము.

ఈనావిమర్శనమునందలి చర్చలన్నియు వివిదిషతో వ్రాయఁబడినవి కాని విజిగీషతోఁ జిత్రింపఁబడి యుండలేదు. కావున సహృదయులగు సాహిత్యకోవిదులు సోదరభావముతో నాసంశయముల నపనయింపఁ బ్రార్థితులు. ఊరక కాలముఁగడుపుటకంటె సారస్వతచర్చలతో సమయమును జరపుట శ్రేయస్కరమని పెద్దలు బోధించియున్నారు.

ఓంతత్సత్.

వాల్మీకివిరచితమగు నుత్తరకాండమునందలి సీతాపరిత్యాగ రంగమున వర్ణింపఁబడిన మూలశ్లోకములు. (సర్గ ४౭)

(1) మామికేయం తనుర్నూనం సృష్టా దుఃఖాయ లక్ష్మణ !
ధాత్రా యస్యా స్తథా మేద్య దుఃఖమూర్తిః ప్రదృశ్యతే ౩

(2) కింను పాపం కృతం పూర్వం కో వా దారై ర్వియోజితః
యాహం శుద్ధసమాచారా త్యక్తా నృపతినా సతీ. ౪

(3) కిం ను వక్ష్యామి మునిషు కర్మ వా ఽసత్కృతం చ కిం
కస్మిన్వా కారణే త్యక్తా రాఘవేణ మహాత్మనా. ౭

(4) న ఖల్వద్యైవ సౌమిత్రే జీవితం జాహ్నవీజలే
త్యజేయం రాజవంశస్తు భర్తు ర్మే పరిహాస్యతే. ౯

(5) శ్వశ్రూణా మవిశేషేణ ప్రాంజలిః ప్రగ్రహేణచ
శిరసా వంద్య చరణౌ కుశలం బ్రూహి పార్థివం. ౧౦

(6) అహం తు నానుశోచామి స్వశరీరం నరర్షభ
యథాపవాదం పౌరాణాం తథైవ రఘునందన. ౧౩

(7) పతి ర్హి దైవతం నార్యాః పతి ర్బంధుః పతి ర్గురుః
ప్రాణై రపి ప్రియం తస్మాత్ భర్తుః కార్యం విశేషతః. ౧౭

కాళిదాసవిరచితమగు రఘువంశములోని సీతాపరిత్యాగఘట్టమునందలి మూలశ్లోకములు. (సర్గ-౧४)

(1) నిఘ్నస్య మే భర్తృనిదేశరౌక్ష్యం
దేవి క్షమ స్వేతి బభూవ నమ్రః॥ ౫౯

(2) సీతా త ముత్థాప్య జగాద వాక్యం
ప్రీతాస్మి తే వత్స చిరాయ జీవ
బిడౌజసా విష్ణు రివాగ్రజేన
భ్రాత్రా యదిత్థం పరవానసి త్వం. ౬౦

(3) శ్వశ్రూజనం సర్వ మనుక్రమేణ
విజ్ఞాపయేః ప్రాపితమత్ప్రణామః

ప్రజానిషేకం మయి వర్తమానం
సూనో రనుధ్యాయత చేతసేతి. ౬౦

(4) వాచ్య స్త్వయా మద్వచనా త్సరాజా
వహ్నౌ విశుద్ధామపి యత్సమక్షం
మాం లోకవాదశ్రవణా దహాసీః
శ్రుతస్య కిం తత్సదృశం కులస్య. ౬౧

(5) కిం వా త వాత్యంతవియోగమోఘే
కుర్యా ముపేక్షాం హతజీవితే స్మి
న్స్యాద్రక్షణీయం యది మే న తేజ
స్త్వదీయ మంతర్గత మంతరాయః. ౬౨

(6) నృపస్య వర్ణాశ్రమపాలనం యత్
స ఏవ ధర్మో మనునా ప్రణీతః
నిర్వాసితా ప్యేవ మత స్త్వయాహం
తపస్విసామాన్య మవేక్షణీయా. ౬౩

(7) ఉపస్థితాం పూర్వ మపాస్య లక్ష్మీం
వనం మయా సార్థ మసి ప్రపన్నః
తదా స్పదం ప్రాప్య త యాతిరోషాత్
సోఢాస్మి న త్వద్భవనే వసంతీ. ౬౪

(8) కల్యాణబుద్ధే రథ వా తవాయంన
కామచారో మయి శంకనీయః
మమైవ జన్మాంతరపాతకానాం
విపాకవిస్ఫూర్జథు రప్రసహ్యః. ౬౫

(9) నిశాచరోపప్లుతభర్తృకాణాం
తపస్వినీనాం భవతః ప్రసాదాత్
భూత్వా శరణ్యా శరణార్థ మన్యం
కథం ప్రపత్స్యే త్వయి దీప్యమానే. ౬౬

(10) సాహంతపస్సూర్యనివిష్టదృష్టి ౬౬
రూర్ధ్వం ప్రసూతె శ్చరితుం యతిష్యే

(11) శ్లో. నృత్యం మయూరాః కుసుమాని వృక్షాః
దర్భా నుపాత్తాన్ విజహు ర్హరిణ్యః
తస్యాః ప్రపన్నే సమదుఃఖభావం
అత్యంత మాసీ ద్రుదితం వనేపి. ౬౭

దిఙ్నాగవిరచితమగు కుందమాలనాటకములోని మూలభాగము

1. శ్లో. తుల్యాన్వయే త్యనుగుణేతి గుణోన్నతేతి
దుఃఖే సుఖేచ సుచిరం సహవాసినీతి
జానామి కేవల మహం జనవాదభీత్యా
సీతే త్యజామి భవతీం నతు భావదోషాత్।

అయ మార్యస్యసందేశః॥

2. సీతా—కథం జనాపవాదభయేనేతి! కిమపి వచనీయం మేఽస్తి?

3. లక్ష్మణ—కీదృశ మార్యాయా వచనీయం.
శ్లో. ఋషీణాం లోకపాలానా మార్యస్య మమ చాగ్రతః
అగ్నౌ శుద్ధిం గతా దేవికిం తు లోకో నిరంకుశః.

4. సీతా—కిం ను ఖలు తస్యైవ నిరనుక్రోశస్య సమాన ఏషప్రసవః ప్రేక్షితవ్య ఇతి వచనీయకంటకోపహితం జీవితం పరిరక్షామి.

5. లక్ష్మణ—అనుగృహీతోఽస్మి. ఇద మార్యేణ సందిష్టం.

6. సీతా—కిం ను ఖలు భవిష్యతి?

7. లక్ష్మణ. శ్లో. త్వం దేవి చిత్తనిహితా గృహదేవతా మే
స్వప్నాగతా శయనమధ్యసఖీ త్వ మేవ
దారాంతరాహరణనిస్పృహమానసస్య
యాగే తవ ప్రతికృతి ర్మమ ధర్మపత్నీ.

8. సీతా—ఏవం సందిశ తార్యపుత్రేణ పరిత్యాగదుఃఖం మయి నిరవశేష మపనీతం, న హి తథాన్యాసక్త్యాః పత్యు, స్త్రీజనస్య దుఃఖముత్పాదయతి యథా న్యాసక్తః

(9) లక్ష్మణః:—కః ప్రతిసందేశః ?

(10) సీతా:—ఏవం గతేపి ప్రతిసందేశః! శ్వశ్రూణాం పున ర్మమ వచనాత్ పాదవందనం కృత్వా విజ్ఞాపయ, ఏవ మహం నిరత్రా శ్వాపదసమాకీర్ణే వనే ప్రతివసంతీ సర్వథా హృదయే నార్యాభి రను గృహీతవ్యేతి.

(11) లక్ష్మణః:—ప్రతిగృహీ తేయ మాజ్ఞా. ఆర్యస్య న కించి త్సందిష్టం.

(12) సీతా—తథా నిష్ఠురో నామ సందిశ్యతే. తథా మమ వచనాత్తం జనం విజ్ఞాపయ:—మందభాగినీ మనుశోచన్ వర్ణాశ్రమప రిపాలన మభిఘ్న న్నాత్మానం న బాధయ, సద్గర్భే స్వశరీరే సావధానో భవేతి వక్తవ్య. లక్ష్మణ ! కిముపాలభే మహారాజం ?

(13) లక్ష్మణః:—కిమేతావత్యపిన ప్రభవతి దేవీ ?

(14) సీతా:—ఏవమపిమద్వచనాత్ సవిజ్ఞాపయితవ్యః 'సాతపో వనవాసినీ సర్వథా సీమంతనిహితేనాంజలినా నివేదయతి యద్యహం నిర్గుణా చిరపరిచితేతివా, అనాథేతివా, సీతేతివా, స్మరణమాత్రకేనా ప్యనుగృహీతవ్యేతి.

(15) లక్ష్మణః:—ఇమంసందేశమాకర్ణ్య తు తే త్వార మివాహితం దశా మసహ్యం శోకస్య వ్యక్త మార్యో గమిష్యతి.

(16) సీతా:—అతిమహి తేపి స్వమండలే కథం తేసంతి స్త్రియో దుఃఖసహాయాః ? సాంప్రతం మయా వినా త్వ మైకే నైష చింత యితవ్యః. త్వం భ్రాతుః శరీరే సావధానో భవ.

(17) లక్ష్మణః:—అనురూప మేతన్మహానుభావతాయాః.

(18) సీతా:—సమాశ్వాసయితవ్యా ప్రియంవదా మమ ప్రియ సఖ్యాః; స్మర్తవ్యా సర్వకాల మియం మందభాగినీ. (ఇతి రోదితి)

(19) లక్ష్మణః:—(సోద్వేగం)

శ్లో. ఆర్యాం స్వహస్తేన వనే విమోక్తుం శ్రోతుంచతస్యాఃపరిదేవితాని।
సుఖేన లంకాసమరే హతం మామ జీవయ న్నారుతి రాత్తవైరః

(దిశో విలోక్య) శ్లో. ఏతే రుదంతి హరిణా హరితం విముచ్య
హంసాశ్చ శోకవిధురాః కరుణం రుదంతి
నృత్తం త్యజంతి శిఖినోపి విలోక్య దేవీం
తిర్యగ్గతా వర మమీ న పరం మనుష్యాః.

(20) సీతా:—వత్స లక్ష్మణ ! ఆసన్నాస్తమయః సూర్యః దూరేచేతో మనుష్యసంపాతః. ఉడ్డీనాః పక్షిణః. సంచరంతి శ్వాపదాః. గచ్ఛ న యుక్తం పరిలంబితుం.

(21) లక్ష్మణ:—(అంజలిం బద్ధ్వా) సర్వపశ్చిమోయం లక్ష్మణస్య ప్రణామాంజలిః తత్సావధానం పరిగృహ్యతాం.

(22) సీతా:—నిత్యావహితా ఖల్వహం

(23) లక్ష్మణ:—శ్లో. జ్యేష్ఠస్య భ్రాతురాదేశాదాసీయ విజనేవనే
పరిత్యక్తాసి దేవిత్వం దోషమేకం క్షమస్వమే.

(24) సీతా:—జ్యేష్ఠస్యవచనానువర్తీ త్వ మితి సంతోషకాలే కోదోష ఆశంక్యతే.

(25) లక్ష్మణ:—(దిశో ఽవలోక్య) భో భో లోకపాలాః శ్రుణ్వంతు భవంతః

శ్లో. ఏషా వధూ ర్దశరథస్య మహారథస్య
రామాహ్వయస్య గృహిణీ మధుసూదనస్య
నిర్వాసితా పతిగృహా ద్విజనే వనే స్మి
న్నేకాకినీ వసతి రక్షత రక్ష తైనామ్.

శ్లో. ఏషోంజలి ర్విరచితో వనదేవతానాం
విజ్ఞాపనాం క్షణ మిమా మవధారయంతు
సుప్తా ప్రమాదవశగా విషమస్థితా వా
యత్నా దియం భగవతీభి రవేక్షణీయా.

శ్లో. సఖ్యో ఽద్యః స్వామినో లోకపాలాః మాతర్గంగే భ్రాతరః శైలరాజాః
భూయోభూయో యాచతే లక్ష్మణో ఽయం యత్నాద్రక్ష్యా రాజపుత్రీ గతో ఽహం.

(అంక-౧ పు6-13)

ప్రేమచంద్.

కొమాండూరి శఠకోపాచార్యులుగారు, ఎం. ఏ. బి. యల్.
కాకినాడ.

సాధారణముగ రాజులు సేనానులు మతకర్తలు మున్నగువారలే మహాపురుషులుగఁ బరిగణింపఁబడుట సంప్రదాయము; కాని యేవృత్తిలోనివారైనను మహాపురుషులు కావచ్చును. సేనానులు శాంతినెలకొల్పుదురు. రాజులు ప్రజలఁ బాలించి రక్షింతురు. మహాశిల్పులు దేశీయభౌతికసంపదను వృద్ధిచేయుదురు. మతప్రవర్తకులు నాధ్యాత్మికక్షేమము గల్గింతురు. ఇట్లే మహాకవులును లోకకళ్యాణకారులగు వీరులే! జనుల జ్ఞానమును నీతిని వృద్ధిఁజేసి, గ్రంథరూపమున దానిని మహానిధిగఁ దరతరములవారి కందఁజేయువారు మహాపురుషులే! కనుకనే వేదద్రష్టలగు వసిష్ఠ విశ్వామిత్రాదులను, ఇతిహాసరచయితలగు వ్యాసవాల్మీకులను, ప్రబంధకావ్యనిర్మాతలగు కాళిదాసాదులను గూడ, గౌరవించుట సంప్రదాయమైయున్నది.

సంస్కృతివృద్ధికి వాఙ్మయాభివృద్ధి ముఖ్య చిహ్నము. పూర్వగౌరవముతోఁ దృప్తినొందక, మానవలోకమం దుచిత స్థానమును బొందఁదలంతుమేని, మనము నున్నతవాఙ్మయమును సృజింపవలెను. పూర్వకవు లప్పటివాడుకభాషలగు సంస్కృతప్రాకృతములందు, ఆయాసంఘావశ్యకతకుఁ దగిన గ్రంథముల రచించిరి. మన సంస్కృతి సనాతనమని ప్రసిద్ధి; అనఁగా నది ప్రవాహనిత్యతవంటిదని భావింపవలెను. మనదేశభాషలందిప్పు డేర్పడు వాఙ్మయము పరిణామవశమగు నీనాటి సంఘావశ్యకతలకుఁ దగినదిగనే యుండవలెను.

ఇప్పటి మనదేశభాషలన్నిటిలోను హిందీ హిందుస్థాని ప్రధానమైనది. నేటి హిందీ, మరాటీ, బంగాలీ మొదలగుభాషలు పూర్వపుసంస్కృతప్రాకృత భాషల సంతతిలోనివే. వీనిలో హిందీ కేంద్రస్థానమందున్నది.

తక్కిన యార్యభాషల కది సన్నిహితము. అది మనదేశీయులలో నధిక సంఖ్యాకులకు మాతృభాష. ఆంధ్రముతోను హిందీకిఁ జాల సంబంధమున్నది. కనుక హిందీకిఁ బ్రాముఖ్యము హెచ్చుట సహజము. అట్టి హిందీలోని యాధునిక లేఖకులలో ముఖ్యుఁడగు 'ప్రేమచందు' జీవితము నుండి మనము జ్ఞానానందములఁ బొందవచ్చును.

ప్రాచ్యలోకమున హిందూ బౌద్ధ ముస్లిముధర్మముల వారి కందఱికిని దీర్థస్థలమగు కాశీనగరికి సమీపమందున్న 'మఠవా' అను కుగ్రామములో 'ప్రేమచంద్' 1880 వ సం॥న జనించెను. అతని మొదటి పేరు ధనపతిరాయ్. వీరికుటుంబస్థితి సామాన్యమైనది.

అక్కడఁ బూర్వార్జితమగు జిరాయితీభూమి వీరి కుండెను. కాని యది కేవలము స్వల్పము. అతని శైశవమునందే, తండ్రి ప్రభుత్వపు తపాలుశాఖలో నొక చిన్నయుద్యోగమును సంపాదించుకొని స్వగ్రామము వీడి, జీవితార్థము 'గోరఖ్ పురము' చేరెను. ఇది హిమాలయపాదములయొద్దనున్నది. బాలుఁడగు ధనపతి యచ్చటి యద్భుతప్రకృతి సౌందర్యమును గ్రోలుచుండెను. హిమాలయము భౌతికముగ నత్యున్నతము, అతిగంభీరము. కాళిదాసాది పూర్వకవుల గ్రంథములలోను మన ప్రాచీన సంస్కృతిలోను గూడ నీగిరిరాజుస్థాన మట్టిదే. ఋషులకువలె మన ధనపతికి నా దృశ్యము పవిత్రభావములఁ గల్గించెను.

అతనికి బాల్యమందే కష్టములు గలిగెను. అతని యెనిమిదవ యేఁటనే తల్లి కాలధర్మమునొందెను. సవతితల్లి యేర్పడెను. ఇంక నాఱేండ్లలోఁ దండ్రియు మరణించెను. అప్పటి కాతఁడు కాశీలో 'హైస్కూలు'లో నాంగ్లవిద్య నేర్చుచుండెను. ఆబాలునికీస్థితిలోఁ గుటుంబభారము పైఁబడెను. కష్టముల నెదుర్కొనుటవలననే కదా నరుని ఘనత తేటఁబడుట: "హేమ్నః సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధి శ్శ్యామికాపి వా". ధనపతి నిర్ధనుఁడైనను సౌమ్యుఁడు,ధీరుఁడు,మానధనుఁడు. సవతితల్లిని, సవతితమ్ముని బోషించు భారము గూడఁ దనపైఁ బెట్టుకొని, శ్రీమంతులయిండ్లకుఁ

ప్రతిదినమును బోయి, వారిబాలురకుఁ జదువుచెప్పుచును, ఇతరవిధముల నెట్లో వారాణసిలోఁ దనకుటుంబపోషణకును, ఆంగ్లపాఠశాలలోఁ దన విద్యాభ్యాసమునకును వలయు ధన మాతఁ డార్జించుచుండెను. అతఁడు సహజముగ దృఢదేహి కాఁడు; కాని యెట్లో శ్రమకోర్చి ప్రతిదినము పాఠములఁ జెప్పి ద్రవ్యమార్జించుటకై మైళ్ళకొలఁది నడచు చుండెడి వాఁడు. తనసహజాభినివేశముచే నాతఁ డెట్లో కొంతవఱకు విద్యాభ్యాసముఁ బూర్తిచేసికొనెను. ఆతనిప్రజ్ఞను గమనించి, ప్రభుత్వము వారాతనికి విద్యాశాఖలోనుద్యోగమిచ్చిరి. పాఠశాలల"సూపర్వైజరు"గ నతఁడు గొన్నియేండ్లు పనిఁజేసెను; అట్టుద్యోగ మందుండియే, స్వయం కృషితో నున్నతవిద్య నభ్యసించి, 'ఇంటరు' లోను, పట్టపరీక్షలోను గృతార్థుఁ డాయెను. అంతట సర్కారువారి యుద్యోగమున నున్నత స్థానము లభించెను. గోరఖ్‌పురమున సర్కారువారి యున్నతపాఠశాల కధ్యక్షుఁడై, అతఁడు తరువాత 'ఇన్స్పెక్ట' రాయెను. ఈలోపల సాహిత్యరచనలవలన నాతనికి విద్వాంసులలోఁ బ్రఖ్యాతివచ్చెను.

ఈస్థితిలో జర్మనుయుద్ధానంతరమున లోకమంతటితోఁ బాటుమనదేశమందు నశాంతి గల్గెను. రాజకీయరంగము కలుషితమై 1919 లోఁ బ్రభుత్వమునకును బ్రజానాయకులకును సంఘర్షమారంభమాయెను. చాలమంది ధీమంతు లప్పు డుద్రిక్తులైరి. దేశక్షేమపరాయణు లందఱు ప్రభుత్వోద్యోగములను, న్యాయవాదిత్వమును, పాఠశాలలనువదలి ప్రజల హక్కులకై త్యాగముచూపవలెనని గాంధిమహాత్ముఁడు ప్రచారముచేసెను. ఈ 'అసహకార' సిద్ధాంతపు ఝంఝామారుత మందప్పు డెందఱో ప్రాజ్ఞులు మగ్నులైరి. ధనపతియు నట్లాకృష్టుఁడై, ప్రభుత్వోద్యోగమును వీడి, త్యాగియై, రాజకీయ రంగమున కుఱికెను. 1921 లో మఱికొందఱితోఁ బాటాతఁడును కారాగార యాత్రఁ జేసివచ్చెను. అప్పటినుండియు నతఁడు తనజీవిత మంతయును ద్రవ్యార్జనకుఁ గాక ప్రజాసేవకే వినియోగింప నిశ్చయించుకొనెను.

దీనులబాధల గమనించి యాతఁడు ప్రేమమయుఁ డాయెను. ఆసమయమునందే యాతనిపేరు మాఱి పోవుట చిత్రము. అప్పుడతఁడు తఱచు హిందీపత్రికలలోఁ గథలను వ్యాసములను బ్రచురించుచుండెను; కాని సౌమ్యుఁడు వినమ్రుఁడు నగు ధనపతి యాపత్రికలలోఁ దనపేరు నుదాహరింపనీయలేదు. అవి 'ప్రేమచందు' అనునతఁడు వ్రాసినట్లే యాపత్రికలలోఁ గనఁబడుచుండెను. ఈప్రేమచం దెవ్వరో చాలయేండ్లవఱకుఁ బాఠకులకుఁ దెలియదు. ఆరచనల కద్భుతమగు ప్రసిద్ధిమాత్రము గల్గెను. అవి ప్రేమచందురచనలనియే వాడుక దేశమంతటను వ్యాపించెను. ధనపతిరాయలే ప్రేమచందను గ్రంథకర్త యని తరువాత వెల్లడియైనది. కాని, ఈలోఁగా నా మాఱుపేరునకే హెచ్చు ప్రసిద్ధి గల్గినందున, వ్యక్తియెవరో తెలిసిన మీఁదటను, ఆయన నందఱును 'ప్రేమచందు' అనియే వ్యవహరింపసాగిరి; మొదటిపేరు జనులదృష్టినుండి పోయినది. ఈరీతిగా 'ధనపతి' స్వభావములోను, ఆచరణలోను, లోకుల వ్యవహారములోను గూడ, 'ప్రేమచందు'ఁడై పోవుట సంభవించినది.

కారాగారమునుండి వచ్చినతోడనే ప్రేమచందు క్రొత్తగాఁ దనవృత్తిని నిర్ణయించుకొనవలసివచ్చెను. అసహాయోద్యమము తీవ్రముగా నుండినప్పు డాయాప్రాంతములందలి పాఠశాలలఁ జాలమంది విద్యార్థులు వీడి బయటకు వచ్చిరి. అందుఁ గొందఱు మఱల ప్రభుత్వపాఠశాలలలోఁ జేరలేదు; కాని వారికి విద్యాకాంక్ష యుండెను. అట్టివారి విద్యాభివృద్ధికై యా యాప్రాంతములం దప్పుడు కొన్ని జాతీయపాఠశాలలు స్థాపింపఁబడినవి. ప్రేమచం దట్టివానిలో నుపాధ్యాయుఁడుగఁ బనిచేయ నిశ్చయించెను. సంయుక్త ప్రాంతపుఁ గాన్పురములో మార్వాడీ మహావిద్యాలయమను జాతీయ పాఠశాలలోఁ గొంత కాలము ప్రేమచందు ప్రధానోపాధ్యాయుఁడై యుండెను. ఇంతలో వారాణసిలో కాశీవిద్యాపీఠమను పేర నొక జాతీయకళాశాల స్థాపింపఁబడినది. తరువాతఁ బ్రేమచం దీసంస్థలోఁ జాలకాలము బోధకుఁడై బాలురకు జాతీయవిద్యను బాగుగ నేర్పెను.

కాని యాయన తనకాలమునంతను సాధ్యమైనంతవఱకు సాహిత్యరచనకే వినియోగించుచుండెను. తరువాత ప్రేమచంద్ లక్నోనగరిలో స్థాపితమైన 'మాధురి' అను హిందీమాసపత్రికకు సంపాదకుండై యయిదాఱేండ్లాపత్రికను నడపెను. ఆయన యాజమాన్యమందాపత్రిక హిందీ మాసపత్రిక లన్నిటిలో నగ్రగణ్యమని పేరుగాంచెను. తత్కాలపు సమస్యలఁగూర్చి యాయన చేయుచుండిన విమర్శలును టిప్పణులు నాయాసాంఘికార్థికాది సమస్యలఁగూర్చి, రాజకీయసిద్ధాంతముల గూర్చియు నాతని పరిజ్ఞానమును స్ఫుటముఁజేయుచుండెను. ప్రచురణార్థమై వచ్చు వ్యాసములందును, కథలందును, ఏవి గణ్యములో యేకథకులు ప్రజ్ఞావంతులో, ఆయన చక్కఁగఁగనిపెట్టి, వారికిఁ దగు సూచనలఁ జేయుచు, ప్రతిభావంతులగు యువకలేఖకులకు ప్రోత్సాహ మిచ్చుచుండెను. ఉన్నతభావములతోను సవిమర్శమగు చర్చలతోను సరళమగు నవ్యవాఙ్మయమును నవ్యమార్గమున సృజించున ట్లాయన యువకులకు మార్గదర్శకుఁడాయెను.

తరువాత, ప్రేమచంద్ కాశీనగరముకుమరలివచ్చి, యాపురమందు స్వతంత్రముగఁ దానే పత్రికలను స్థాపించెను. ఈవాఙ్మయమును సకాలమునఁ బ్రచురించుచుండుటకై యాయన కాశిలో 'సరస్వతీప్రెస్' అనుపేరనొకపెద్దముద్రణాలయమును దానేస్థాపించి దానిలో, జైనేంద్రకుమార్ వంటి ధీమంతులగు యువకుల గ్రంథములను బ్రచురించుచు, వారికిఁ దోడ్పడెను; తాను 'జాగరణ్' అను వారపత్రికను నడపుచుండు వాఙ్మయసమస్యలనే గాక సామయికవిషయములన్నిటిని గూర్చియుఁ జర్చించుచుండెను. లోకానుభవముఁ దెల్పుసూచనలును శాస్త్రపరిజ్ఞానముఁ దెల్పువ్యాసములును విమర్శలును నాతని లేఖినినుండి వెలువడుచుండెను. సంఘక్షేమకరమగు విషయములన్నిటినిఁ గూర్చియు నానాయార్థిక రాజకీయాదిసమస్యలఁగూర్చియు నాయన యుదారాభిప్రాయములు జనులకు నవ్యాభిరుచిఁగల్గించి, వారియాదరములకుఁ బాత్రమై

యుండెను. ఆయన 'హంస' అనుమాసపత్త్రికనుగూడ నడపెను. ఇది కేవలము వాఙ్మయమును సంస్కృతిని బ్రోత్సహించుటకుద్దేశింపఁబడినది. ఈపత్త్రికను ద్వారలోనే గొప్ప ప్రసిద్ధి గల్గినది. ఈపత్త్రికల ముద్రణ సౌకర్యమునకై పెట్టిన 'సరస్వతీప్రెస్' అను నచ్చుకూటమునకు సంచాలకుఁడై, ప్రేమచందు దాని యార్థిక నిర్వాహపు భారమునుగూడ వహించెను.

ప్రేమచందు స్వతంత్రముగఁ జాలకథలను నవలలను బత్త్రికాముఖమునఁ బ్రచురించెను. అవి జనాదర మొందిన తరువాత గ్రంథరూపముగను బ్రచురింపఁ బడినవి. అయినను, వానివలన విశేషముగ ద్రవ్యాదాయము లేకుండెను. సాహిత్యమే తనకు వృత్తి యైనను, ద్రవ్యాకర్షణకై రచనలఁ జేయుట యాయన కెంతమాత్రమును సమ్మతము కాదు. మనదేశభాషలందు విశిష్టగ్రంథముల రచించిన సుప్రసిద్ధులకును గూడ వాఙ్మయసేవ జీవికాధారమగుటలేదు. సాధారణముగా, మనసాహిత్యవర్ధకులందఱును బీదవారు. ఈస్థితి మిక్కిలి శోచనీయము. ఇది మనదేశభాష లన్నిటికిని వర్తించును. లక్ష్మీసరస్వతులమధ్య సాహచర్యమును, సహవాసమునుండదు. కనుక నీయిద్దఱి యనుగ్రహము నేకకాలమందు లభింపకుండుట సహజమేయని, మనవారు సమాధానపడుచుందురు. కాని యీ నైరాశ్యస్థితి సహజము కాదనియు నిరుత్సాహకరమనియు గ్రహించుట యవసరము. పూర్వము మనరాజులు పండితులను గవులను మిక్కిలి యాదరించుచు, వారు కుటుంబపోషణకై బాధపడనక్కఱలేకుండఁ జేయుచుండిరి. కనుకఁ గవులును సాహిత్యాభిలాషులును స్వేచ్ఛారముగఁ దమబుద్ధిని గాలమును దదేకదీక్షతో జ్ఞానాభివృద్ధికే వినియోగింపఁగల్గిరి. కాని, యిప్పటిస్థితిలోఁ బ్రజలే వాఙ్మయము నాదరింపవలెను. ఇంగ్లండువంటి పాశ్చాత్యదేశములలో 'బెర్నర్డుషా', 'వెల్సు' మొదలగు విద్వాంసులెందఱో సాహిత్యసేవను బత్త్రికాసంపాదనను మాత్రమే జీవనాధారముగఁ జేసికొని, ప్రజాదరణవలననే లక్షాధికారులును గోటీశ్వరు

లునైనారు. రాజకీయపరిస్థితినిబట్టి యాంగ్లవాఙ్మయమున కున్నంత వ్యాప్తియు నాదరణమును మనదేశభాషల వాఙ్మయమున కుండుట యసంభవము. మనదేశము ప్రస్తుతమున దారిద్ర్యయుతము. అయినను, మన దేశీయులలో నాంగ్ల విద్యాధికులకు స్వభాషలోని యాధునిక వాఙ్మయముపై శ్రద్ధలేదు; తక్కిన వారు చాలవఱ కజ్ఞానులు; వారికి గ్రంథములఁ జదువు నలవాటేతక్కువ. గ్రంథప్రకాశకులును ప్రేమచందునకు న్యాయమగు ద్రవ్యసహాయముఁ జేయక, చాలవఱకు స్వలాభమే చూచుకొని, తామే శ్రీమంతులైరి. కుటుంబపోషణయుఁ బత్రికానిర్వహణమును గష్టమైనవి. తుదకతఁడు బొంబాయిఁ జేరి యక్కడఁ నొక సినిమాసంఘమువారికిఁ గథలవ్రాసి సరిఁజేయు నుద్యోగమును స్వీకరించెను. అది యాయనకు నార్థికముగ లాభకారిగ నుండెను. కాని, యావృత్తి తన ప్రకృతికిని సాహిత్యప్రేమకును ననుగుణముగాలేదు. కనుక నాయన త్వరలోనే తనపత్రికానిర్వహణకార్యమునకు వచ్చెను. మనభారతీయభాషలలో నాయావాఙ్మయములమధ్య నాయాప్రాంతీయ సంస్కృతులమధ్యను గొన్నివిభేదములేర్పడినవి. అందువలనఁ బ్రాంతీయ భావములకుఁ బ్రాముఖ్యముగల్గి, చిరకాలాగతమగు జాతీయసంస్కృతికిని, ఐక్యభావమునకును భంగముకలుగ వచ్చెను. కనుకఁ బరస్పర సమీకరణమును సానుభూతియును గల్గించుట యవసరమని భావించి, 1934 సం॥లో గాంధిమహాత్ముఁడును మరికొందఱు నందుకొఱకై భారతీయసాహిత్యపరిషత్తును స్థాపించిరి.

ఈకార్యములోఁ బ్రేమచందు శ్రద్ధవహించి, యుత్సాహముతో నాకార్యక్రమమును సాగించుటకుఁ దోడ్పడెను. ఆపరిషత్తునకుఁ బ్రారంభమునుండి కార్యదర్శిగ నుండుచు, ప్రేమచందు తన 'హంస' పత్రికను బొంబాయికి మార్చి, దానిని భారతీయసాహిత్యపరిషత్తునకు ముఖపత్రముగఁ జేసెను. అప్పటినుండి యాయన మనసంస్కృతిసమన్వయమునకు సంబంధించినవి, పరస్పరసహాయము గల్గించునవియు నగు ననేకవ్యాస

ముల నాపత్త్రికలోఁ బ్రచురించెను; మఱియు బంగాళీ, గుజరాతీ, ఆంధ్రము, అఱవము, మొదలగు నాయాదేశభాషలందలి మాదిరి రచనల నా యాప్రాంతీయ విశేషములను బ్రత్యేకాచారములను దెల్పు వ్యాసములను హిందీలో హంసపత్త్రికాముఖమునఁ బ్రచురించెను. 1935 సం॥ డిసెంబరులో భారతీయసాహిత్యపరిషత్తు వార్షికోత్సవమును హిందీపట్టప్రదానోత్సవమును మద్రాసునగరమందు జరిగినవి. అప్పుడాయన హిందీసభ కధ్యక్షుఁడై, మద్రాసులో నారెండు సభల కార్యక్రమములోను బాల్గొని, వానిని జయప్రదముగ జరిగించెను.

హిందీలో వాఙ్మయమునకు నవ్యతను బ్రగతిని గల్గించుట కాతఁడే ముదంజ వేసి యితరులకు దారిఁజూపెను. ఇట్లన్నివిధములను బ్రేమచందు వాఙ్మయసేవ జేయుచుండఁగా, 1936 సం॥లో నాయన వ్యాధిగ్రస్తుఁడై, అక్టోబరులోఁ గాలముఁ జేసెను. ఆయన మరణముచే హిందీవాఙ్మయమునకే గాక, భారతీయసంస్కృతివర్ధనమునకును గొప్ప లోటు గల్గినది. ప్రేమచందున కిద్దఱు చిన్నకొమాళ్ళు, ఒక కొమార్తెయు, మిగిలిరి. ఆయనభార్యయగు శివరాణీదేవి గొప్పవిదుషి; ఆమెచక్కని కథలను, ఆఖ్యాయికలను రచించుచున్నది. ఆమెయే యిప్పుడు హిందీలోఁదనభర్త స్థాపించిన 'హంస'పత్త్రికను కాశీనుండి నడుపుచున్నది.

ప్రేమచందు సాహిత్యరచనలఁ గొన్నివిశేషముల గమనింతము. బాల్యమునుండి సాహిత్యప్రియుఁడై, అతఁడు తనకు దొరకిన యాఖ్యాయికలను గథలను విద్యార్థిదశలో నుత్సాహముతోఁ జదువుచుండెను. ఆయనప్రభుత్వోద్యోగములో నున్నప్పుడే కాన్పురమునుండి యుర్దూలో వెలువడు 'జమానా' అను మాసపత్త్రికకుఁ గథలను వ్యాసములను వ్రాసి, 'నబాబ్‌రాయి' యను మాఱుపేరుతో బ్రచురించుచుండెను. వెంటనే యాయన కుర్దూలేఖకులలో గొప్ప పేరు వచ్చెను. ఆయన చిన్నికథ లాహ్లాదకరములై పాఠకు లందఱిదృష్టి నాకర్షించెను. అంతే నతఁడు యుర్దూలోనే కొన్నినవల (=ఆఖ్యాయిక)లనుగూడ వ్రాసి ప్రచురించెను.

ఆయనప్రజ్ఞ వెంటనే వెల్లడియైనది. ఆర్యావర్తపు హిందువులు ముస్లిములుగూడ నుర్దూలో నట్టిస్వతంత్రమగు చక్కని వాఙ్మయము రచించుచున్నందుల కాయన నభినందించిరి; హిందీరచనల వ్రాయు తరువాతకాలములో నాయన తనగ్రంథముల నుర్దూలోనికి తర్జుమాచేయుచుండెను; అప్పుడప్పు డుర్దూలో వివిధవిషయములఁ గూర్చి ప్రతిభాయుతమగుఁ జర్చతో వ్యాసములు వ్రాసెను. ఆయన మహాపురుషుల జీవితచరిత్ర నొకదానిని గూడ వ్రాసి ప్రచురించెను. ఉర్దూవచనవాఙ్మయమున కాయన చేసిన యమూల్యసేవవలన మనదేశపు ముస్లిముల కాయనపై మహాగౌరవము గల్గినది. అట్టిమధురములై నీతిబోధకములగు రచనలను ముస్లిములలో నెవ్వరును వ్రాయలేదని కొందఱు ప్రామాణికుల యభిప్రాయము.

ఈస్థితిలో మనదేశపు వాతావరణము మాఱినది. దేశమంతటను జాతీయభావమును దేశమంతటికిని హిందీ సామాన్యభాషగా నుండఁదగునను భావమును, వ్యాపించినవి. అందువలన నప్పటినుండి ప్రేమచందు మనస్సు హిందీవైపునకుఁ దిరిగినది.

ఈ సందర్భమున సూక్ష్మముగ హిందీయుర్దూల సంబంధమును గమనింతము. ఈరెండును భిన్నభాషలని కొందఱు వ్యవహరింతురు. కాని భాషాశాస్త్రప్రకార మిట్టిభావము తప్పు. సర్వనామములు, క్రియలు, దైనికజీవితములో వాడఁబడు పదములును జాలవఱకు వ్యాకరణమును నీరెంటిలో నొకేరీతిగ నున్నవి. భాష కివియే స్తంభముల వంటివి. కనుక 'హిందీ' 'ఉర్దు' రెండు నొకే భాషయని యెంచక దప్పదు. కాని యుర్దూకుఁ బారసీలిపినే వాడుటయు హిందీకి దేవనాగరిలిపినే వాడుటయు సంప్రదాయమైనది. ఇందుకుఁదోడు, ఉత్తరహిందూ దేశమందు హిందూముస్లిముల యూాయూ సాంఘిక ప్రముఖుల మధ్యఁ దఱచుగఁ గలఁత లుండుచున్నవి. కనుక ముస్లింప్రముఖు లుర్దూలిపినే యభిమానించుచు, వాఙ్మయములోఁ బారసీ యరబ్బీపదములను హెచ్చుగ వాడుచున్నారు. ఇట్లే హిందువులలో హెచ్చుమంది యిప్పుడు విశేషముగ సం

స్కృతపదములను నాగరిలిపిని వాడుదురు. ఈరీతిగా వాఙ్మయరంగమందు హిందీ యుర్దూల మధ్య నానాటికి విభేద మేర్పడు చున్నది. ఇది యచ్చ తెలుఁగు పొత్తములకును సంస్కృతపదభరితమగు ప్రబంధములకును మధ్యనుండు విభేదమువంటిది. ముస్లిమురాజుల పరిపాలనలో హిందువు లుర్దూను రాజభాషగ నెంచి, దానిలో వాఙ్మయమును రచించుచుండిరి. ఆర్యావర్తములోఁ బశ్చిమప్రాంతములోను నైజాం సంస్థానములోను నేటికి నట్లే జరుగుచున్నది. బ్రిటిషుప్రభుత్వమును మనదేశమందు హిందీకన్న నుర్దూకే యెక్కువ ప్రోత్సాహ మిచ్చుచున్నారు. కౌమార దశలోఁ బ్రేమచందు 'నబాబ్ రాయి' అనుపేర నుర్దూకవిశేఖరుఁడని పేరొందెను. ఆయనకుఁ బారసీలోను బ్రావీణ్యము కలదు. ఆయన నందఱును 'మున్షీప్రేమచంద'నియే పిల్చుచుండిరి.

ఈస్థితిలో హిందీయే హెచ్చుమంది కాదరపాత్రమను కారణమున నాయన హిందీలోరచనల నారంభించెను. హిందీలోని ధార్మిక వాఙ్మయము ప్రాచీనము, ప్రశస్తము. మన యాంధ్రములోవలె 19 వ శతాబ్దివఱకుఁ బద్యప్రబంధములకే హిందీలోను బ్రాముఖ్య ముండెను. వచనరచనలున్నను, అవిక్లిష్టశైలిలో నుండెను.

ఈ శతాబ్దారంభమందుఁ దెలుఁగులో శ్రీవీరేశలింగం, లక్ష్మీనరసింహంగార్లవలె హిందీలోను మహావీరప్రసాద్ ద్వివేదియును బ్రేమచందును సులభవచనశైలికి నవ్యరచనకు మార్గదర్శకులైరి. సాహిత్యమును ముఖస్థముఁ జేయు పూర్వకాలమందుఁ బద్యరచన లుండుట సహజము. కాని యచ్చుకూటములును సామాన్యులలో విద్యాసక్తియు, విజ్ఞానవికాసమును, వృద్ధియైన యీకాలమందు సులభమగు గద్యగ్రంథములే యధికోపయోగులు; కనుక గద్యమందే ప్రేమచందు తన ముఖ్యరచనల వ్రాసెను. చిన్నికథలను నవలలను వ్రాయుటలో నతఁడు సిద్ధహస్తుఁడు. ఇది వాఙ్మయములోఁ గ్రొత్తపద్ధతి. ఇయ్యది పాశ్చాత్యులనుండి యనుకరణ మని చాలమంది భావము.

ఈకాలమం దాఖ్యానరచనల కన్నిదేశముల వాఙ్మయమందును గొప్ప ప్రాముఖ్యమున్నది. ప్రేమచందు కథలకును నవలలకును కొందఱి పాశ్చాత్యకథకులరచనలతో—ముఖ్యముగా గోర్కీ, తుర్గనోవు మున్నగు రష్యను లేఖకుల కథలతోఁ—జాల పోలికయున్నది. కాని, పూర్వకాలమందుఁ బ్రాచ్యవాఙ్మయమందును కథలు లేకపోలేదు. మహాభారతాదులందలి యుపాఖ్యానములు పంచతంత్రము, బృహత్కథ, కథాసరిత్సాగరము, దశకుమారచరిత్రము, భేతాళపంచవింశతి మొదలగు వానిలో నెన్నియో చిన్నికథలు చేరియున్నవి. కాని, యవి విడిగా నుండక హారములో ముత్యములవలె నొక ప్రధానగాథ యను సూత్రమున గ్రుచ్చఁబడి యున్నవి. ఇట్లే కాదంబరి, కర్పూరమంజరి మొదలగు నాఖ్యాయికలును బ్రాచీనవాఙ్మయమందుండినవి. కాని, యాధునికభావముల కనుగుణముగను పాశ్చాత్య వాఙ్మయసంపర్కమునను మన సాహిత్యమందును బరిణామము గల్గినది. ప్రేమచందు హిందీలో రమారమి నాలుగు వందల చిన్నకథలును యిరువదినవలలను వ్రాసెను; అవి చాలవఱకుఁ బ్రచురితములైనవి. కథాగుచ్ఛములు కొన్ని గ్రంథములుగ వెలువడినవి. వీనిలో ముఖ్యమైనవి నవనిధి, సప్తసరోజ్, ప్రేమద్వాదశి, ప్రేమపచ్చీసి, మానసరోవర్ (రెండు భాగములు.)

ఈ రచనలలోఁ బ్రేమచందు కళాశక్తి యద్భుతమని గోచరమగును. ఈకథలు మిక్కిలి మనోరంజకములు, ఉత్సాహాకరములు, హృదయవికాసకరములు; ప్రేమచందుకథలను నవలలను జదువనారంభించువారు వానిని బూర్తిగఁ జదువక నిలుపలేరు. వానిలో నన్నిరకముల విషయములు నుండును. ఈకథలచే నతని లోకజ్ఞానమును జీవితానుభవములును తెలియవచ్చును. అందుఁ గొన్ని 'సౌతేలీ మా' (=సవతితల్లి), 'బడేఘర్ కీ బేటీ' (=పెద్దయింటిపిల్ల) మొదలైనవి కుటుంబసంబంధములు; కొన్ని 'పంచపరమేశ్వర్, బాంక్ కా దివాలా' వంటివి సాంఘికములు, ఆర్థికములు. ఇందు కొన్ని యాత్మానుభవమునకు సంబం

ధించినవి, కొన్ని చారిత్రకములు, కొన్ని రాజకీయములు నున్నవి. నవలలలోను, ప్రతిజ్ఞా, సేవాసదన్, వంటివి సాంఘికములు; ప్రేమాశ్రమ్ఁ కర్మభూమి, కొంతవఱకు నార్థికములు; 'రంగభూమి' వంటివి ముఖ్యముగా రాజకీయములు. ఆయన 'షేక్ చిలీకీ కహానియా, ఆజాద్ కథా' అను ననువాదగ్రంథముల గూడ వ్రాసెను. ఇవి మృదువగు హాస్యరసముతో నిండినవి. కాని స్వతంత్ర గ్రంథములవలననే యాయనకు మహా ప్రసిద్ధిగల్గినది.

'సేవాసదన్' లో నతఁడు మన హిందూసంఘమందలి వివిధలోపములను యుక్తితోఁ జిత్రించి, వాటి నివృత్తికై సంఘసేవాతత్పరతను ప్రోత్సహించెను. తరువాత 1910 లో రచించిన 'ప్రేమాశ్రమ్'లో సహజముగ రాజకీయభావములకు ప్రాముఖ్యము గల్గినది. కొంద ఱుద్యోగుల వలన సామాన్యజనులకుఁ గల్గుబాధలు, కర్షకజనుల పరాధీనస్థితి, యు నిందుఁ జక్కగాఁ జిత్రింపఁబడినవి. ఇది 600 పుటల నవల. దీనితరువాతవ్రాసిన 'రంగభూమి' యింతకన్నను పెద్దది. దీనిలోఁదాత్త్వికచర్చకు, ఆర్థికపరిణామమునకు, సామ్యవాద సిద్ధాంతములకును ప్రాముఖ్యమీయఁబడినది. దీనితరువాత వచ్చిన 'కర్మభూమి'లో సత్యాగ్రహదృశ్యములఁ జిత్రించి, యాయన నిర్మాణకార్యక్రమపు టాధిక్యమునుగూడ సూచించినాఁడు. పంచములను గ్రామ్యలోకము నుద్ధరించుట యవసరమనియుఁ జాల చోటులఁ గనపరుచఁబడినది. ఆయన తుదనువ్రాసిన 'గోదాన' నవల గ్రామ్యజీవితపుఁ బ్రస్తుతస్థితిని, అందలిలోపములను, సాంఘికవిభేదములను పునర్నిర్మాణపు టావశ్యకతను దానివిధములనుఁ జక్కగా సూచించుచున్నది.

'కళ కళనిమిత్తమే' **Art for Art's Sake** అను సిద్ధాంతమాయన కిష్టముకాదు. కళను జీవితముకును సంఘక్షేమమునకునే వినియోగించవలెను (**Art for Life's Sake;Art for Society's sake**) అనియే యాయన యుద్దేశము. ప్రేమచందు రచనలలోను

శృంగారరసము లేకపోలేదు. కాని యది మృదువై నీతియుతమై హృద్యమైయుండును. వర్ణనలలో నాయన భౌతికసౌందర్యముకన్న నాంతరిక సౌందర్యమునకే ప్రాధాన్యమిచ్చెను. మంగళప్రదమైనదే సుందరమని యాయనభావము. ప్రకృతిసౌందర్యమును, ముఖ్యముగ గ్రామములందలి నిసర్గదృశ్యములను, ఆయన మనోహరముగ వర్ణించెను. సంఘమందలి గుణదోషములన్నిటిని యథాస్థితిగఁ జిత్రించుటయే పాశ్చాత్యుల ముఖ్య పద్ధతి. షేక్స్పియరువంటి కవీశ్వరులును యథాస్థితిని జిత్రించుటలోనే ప్రజ్ఞావంతులై ఘనతగడించిరి. కాని ప్రాచ్యాదర్శ మట్టిది కాదు. మానవ లోకమునకు నీతియే ముఖ్యాధారము. జీవితమున కాదర్శముండవలెను. వ్యక్తియభివృద్ధి స్వత్వసంపాదనము నేగాక, లోకక్షేమమును, ఆత్మానుభవములునే మానవుని జీవితోద్దేశములుగ నుండవలెనని (మనఋషులవలె) ప్రేమచందును భావించెను. ప్రేమచందుపాత్రలలో చాల వివిధత గలదు. లోకమందలి యన్నివర్గముల యన్నిరకముల వ్యక్తులును, అతని గ్రంథములలో నేదోయొక దానిలోఁ గాన్పింతురు. ఆయాపాత్రలలో నాయా సన్నివేశములందుఁ గలుగుమానసికపరిణామమును జిత్రించుటలో నాయన రవీంద్ర మహాకవితో సమానముగఁ బ్రజ్ఞను బ్రదర్శించినాఁడు. ఆయన మనోవిశ్లేషణచాతుర్య మద్భుతము.

పాశ్చాత్యానుకరణమువలన మనదేశభాషలలో నిప్పుడువెలువడు కథలలోను సంఘపుబ్రస్తుతస్థితిని జిత్రించుటే లేఖకులకృత్యముగ భావింపఁబడుచున్నది. అందును, శృంగారప్రధానములు, ఉద్రేకకరములు, వక్రవికార రూపములు, అపసవ్యసంఘటనమయములునగు దృశ్యములకే యిప్పటి రచనలలోఁ బ్రాముఖ్య మీయఁబడుచున్నది. పాఠకలోక మిట్టి రచనలకే ప్రోత్సాహ మిచ్చుచున్నదందురు. ఇదినిజమైనచో, మనసంఘపు టభిరుచి వికృతమై శోచనీయస్థితిలో నున్నదని యెంచవలసివచ్చును.

ఈలోప మాంధ్రమందే గాక యభివృద్ధమని యెంచఁబడు వంగవాఙ్మయములోను గలదు. హిందీసాహిత్యమునకు నిట్టి యపఖ్యాతి

యున్నది. అట్టిరచనలే జనతాదరమును బొందుచున్నవని సదుద్దేశయుతులగు లేఖకులును నెంచి, తాము నట్టిసాహిత్యమునే సృజించుచున్నారు. ఈయార్థిక దుర్దశలోఁగవులు-ముఖ్యముగ నార్థికబాధచేఁ బీడితులగువారట్లు చేయుట కొంతవఱకు సహజము. పాఠకులును దొరకిన వాఙ్మయమును జదువుచుందురు. ఇందుఁగొంతయన్యోన్యాశ్రయదోషమున్నది. కాని, సంఘస్థితిని జిత్రించి పాఠకుల కానందమిచ్చుటేగాక, సవ్యమగు సాహిత్యాభిరుచి గల్గించి, ఆర్థికముగను సాంఘికముగను, రాజకీయముగను గూడ సంఘము నున్నతస్థితికిఁ దెచ్చుబాధ్యత లేఖకులకుఁ గలదని ప్రేమచందు గుర్తించెను. ఆయనరచనలలోఁ గేవలము వినోదమేగాక నున్నతాదర్శములు, సంఘలోపముల సంస్కరణావశ్యకతయుఁ గూడ, ద్యోతితమగుచుండును. ఆయనవందలకొలదికథలువ్రాసినను,ప్రతికథలోనుయేదో మహోద్దేశమును నైతికదృష్టియు సూచితములగును. కాని యాయన నవలలలోఁగూడ నివి ప్రత్యక్షముగ నుండవు; కేవలము గాంభీర్యముతో నైతికవర్తనముభావ్యమని స్ఫురింపఁజేయునుగాని యాహ్లాదమున కాటంకము గల్గదు. ఇదియే ప్రేమచందు కళాశక్తిలోని ముఖ్యవిశేషము.

ప్రేమచందు విశాలహృదయుఁడు; ఆయనప్రవర్తన యాదర్శరూపము. ఆయన సవతితల్లిని దనజననిగనే జూచుకొని, ఆమెను దనయింటనే పెట్టుకొని పోషించెను; కనుక నామెయు జననివలె సంచరించెను. తన ప్రథమభార్య తన్నుద్యజించినను, ఎట్టి తగువును లేకుండ (తా నార్థికముగఁ గష్టపడుచుండినను), ఆయన యామె యావజ్జీవమును బ్రత్యేకపోషణ జరిగించెను. సాంఘిక సమస్యలలో నాయన యుదారభావుఁడు, ఒకబాలవితంతువును ద్వితీయభార్యగఁ జేసికొనెను. ఆమె యాయన ప్రోత్సాహమున విద్యావతియై, వాఙ్మయకృషిలో నాయనకు సహాయకురాలైనది. ప్రేమచందు ముఖ్యనవలలన్నిటిలోనుగూడ నుదారమగు జాతీయభావము సూచితమగును. ఆయన గొప్పజాతీయకవి. ఆయనజీవితప్రవృత్తిని బట్టి యది సహజమే. ఇటీవలమనదేశమందు'ప్రొగ్రెసివ్రైటర్స

అసోసియేషన్' (=ప్రగతిశీల లేఖక సంఘము) యను పేర సాహిత్యకుల సంఘమొకటి యేర్పడినది. ప్రేమచందందలి ప్రముఖసభ్యుఁడు. 1936 లో లక్నోలో నీసంఘపువార్షికసభ ప్రేమచందుని యధ్యక్షతనే జరిగినది. దేశమునకుఁ బురోభివృద్ధిఁ గల్గించి పునర్నిర్మాణమునకు దోడ్పడు సాహిత్యమునే నిర్మించుట యీసంఘాశయము.

ప్రేమచందు కేవలము దీనదయాళువని కొందఱికిఁ దెలియదు. భారతదేశమునకుఁ బల్లెటూళ్ళే ప్రాణము. గ్రామములందలి బీదజనుల కష్టములను బాధలను వారియాశలను, వారియార్థికస్థితిని, యథాతథముగఁ బ్రేమచందు చక్కఁగ వర్ణించెను. ముఖ్యముగ, 'ప్రేమాశ్రమ' లోను 'గోదాన'లోను బీదల బాధలును, సాంఘికలోపములును గన్నులఁ గట్టినట్లు చిత్రింపఁబడినవి. ఈవిషయమున, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' యను నవలతోఁ గొంత పోలియున్నది. ప్రేమచందు సామ్యవాది. కనుక, కర్షకులను గార్మికుల నెట్లైన నుద్ధరింపవలె నను తీవ్రోద్దేశము పాఠకులకు జనించునట్లు యాయన కథావిషయముల నేర్పరుచుకొని, తనవస్తునిర్మాణశక్తిని దదనుకూలముగనే వినియోగించెను. ఆయన నవలల ముఖ్యపాత్రలును దఱచు కర్షకులో లేక త్యాగులగు సంఘసేవకులో యగుట సహజము. కాని, కొందఱు పుంజీపతులును జమీందారులును త్యాగవీరులై, తమసంపత్తును రయితుల యుద్ధరణకును బ్రజాక్షేమమునకును వినియోగించినట్లాయన చిత్రించుట విశేషము. ప్రేమచందు సిద్ధాంతరీత్యా సామ్యవాదియైనను, ఆచరణలో సమన్వయవాది; గాంధిశిష్యుఁడుగనుక కథలలో హింసాతత్త్వమును, స్పర్ధను, సాంఘికవైరమును నిరసించును; అహింసను, సాంఘికమైత్రిని, దేశభక్తిని, విశ్వప్రేమను ప్రోత్సహించి, తనలేఖిని నందుకే వినియోగించెను. ఆయన వందలకొలఁది కథలను చాల నవలలను వ్రాసెను, ప్రతికథలోను వచ్చు పాత్రలలోఁ బ్రత్యేకత కలదు. ప్రతికథలోను నేదో యొక యాశయము నైతికోద్దేశము కాంతాసమ్మితముగ నిమిడియుండును. ఈవిశాలవిశ్వము

డుఁ గల వైవిధ్య మాయనరచనలలోఁ బ్రతిబింబితము. కొన్నికథలనుబట్టి యాయన యథాస్థితివాది (realist) యని తోఁచినను, మొత్తముమీఁద నాయన యాదర్శవాది (idealist) యని యెంచవలెను. ఈరెండు పద్ధతుల సమన్వయ మాయన గ్రంథముల ప్రత్యేక విశేషము. ప్రేమచందు శైలి యాకర్షకము; సంభాషణలో నాయన పాత్రోచితభాషనే వాడెను. భాషమిక్కిలిసరళము, కాని యోజోవంతము,రంజకము;ద్రాక్షాపాకము. ఆయన రచనలలో లోకోక్తులను జాతీయములను హెచ్చుగా వాడును. అవి చదువుట కానందకరమై, భావగాంభీర్యము గల్గియుండును. ఆయన నవలలలోఁ గొన్ని చాలపెద్దవి. 'రంగభూమి' వేయిపుటలుగలది. కాని, అట్టి గ్రంథములలోను వాగాడంబర మొక్కడనులేదు; ఆయనరచనలలో వ్యర్థపదములు లేవు. మొత్తముమీఁద నాకర్షకమై యుజ్జ్వల మయ్యు సులభమై సుబోధమగు నవ్యశైలి నాతఁడు సృజించినాఁడు. అతఁడు కథారచనలో మనదేశీయు లందఱిలో నగ్రగణ్యుఁడు. ప్రేమచందు కథలలోఁ గొన్ని యాంధ్రములోనికిని దక్షిణ మనదేశభాషలలోనికి ననువదింపఁబడినవి; కొన్నిజపానీ, ఆంగ్లము, జర్మను,లలోను ప్రచురితములైనవి. ఆయన సిద్ధాంతములను శైలి ననుసరించి, యిటీవల కొందఱు లేఖకులు హిందీలో నుద్బోధకము వైజ్ఞానికము ప్రజాక్షేమకరము రంజకమునగు చక్కనివచనవాఙ్మయమును సృజించుచున్నారు.

శ్రీరస్తు.

లౌకికన్యాయవివరణము.

విజయనగరము మహారాజావారి సంస్కృతకళాశాలాపండితులు

శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారిచే

రచింపఁబడినది.



పరిషత్పత్రికనుండి పునర్ముద్రితము.

కాకినాడ

ఆంధ్రసాహిత్యపరిషత్తువారిచేఁ బ్రకటింపఁబడినది.

కాకినాడముద్రాక్షరశాల

1929.

వెల 8 అణాలు.

పీ ఠి క.

లౌకికన్యాయము లనఁగా లోకధర్మములు లోకవ్యవహారములు సూచించెడి సంగ్రహవాక్యములు. ఇట్టి వాక్యము లనేకములు సంస్కృతవాఙ్మయమునం దచ్చటచ్చట సందర్భోచితముగా నిక్షిప్తములై యున్నవి. వానిలోఁ గొన్నింటిని దీసి జేకబ్ (Col G. A. Jacob) అను నాంగ్లేయపండితుఁ డాంగ్లభాషావివరణముతోఁ గూడ "లౌకికన్యాయాంజలి" యనుపేరఁ బ్రకటించెను. ఈవిషయములు గలదే "భువనేశదత్త లౌకికసాహస్రి" యను వేఱొక గ్రంథముకూడఁ గలదు. ఈరెండుగ్రంథములను జక్కఁగాఁ బరిశీలించి యందలి న్యాయములఁ గొన్నింటి గ్రహించి యాంధ్రుల కుపయుక్తమగున ట్లాంధ్రభాషావివరణము సహితముగా శ్రీమాన్ మేదేపల్లి వేంకటరమణాచార్యులుగారు ప్రకటించినారు. ఈన్యాయములు సంభాషణ యందేమి, గ్రంథరచన యందేమి, సందర్భోచితముగాఁ బ్రయోగించినచో మిగుల రమ్యముగ నుండును. ఈగ్రంథమును బ్రకటించి యాచార్యులవా రాంధ్రలోకమున కుపకృతి చేసినవారైరి. వీరు సంస్కృతాంధ్రములయందుఁ బండితులు. మొన్న మొన్నటి వఱకును, శ్రీవిజయనగరమహారాజా కళాశాలలో సంస్కృత పండితులుగా నుండి పనిచేసిరి. తెలుఁగులో భీష్మచరిత్ర మొదలగు కొన్ని పద్యగ్రంథములు రచించిరి. వీరి కాంగ్లేయభాషా ప్రావీణ్యము కూడఁ గలదు. విద్యావ్యాసంగమునందు వీరికి నాస్థ మెండు.

ముక్తీశ్వరము,
10-11-38.

జ. రామయ్య.

లౌకిక న్యాయవివరణము.

అకారాదిసూచిక.

వ. అవి యెట్లనఁగా.

సీ. ఐదంకములచేత నలరి మారీచవం
చనమను నాటకం బొనరి యుండు
నాఱంకములచేత నల వేణీసంహార
మనియెడు నాటకం బతిశయిల్లు
నేడంకములచేత నెసఁగి శాకుంతల
మనియెడు నాటకం బమరె భువిని
నెన్మిదంకములచే నెన్నఁగఁ బొల్పొందె
నలవిజయంబను నాటకంబు
వెలయఁ దొమ్మిదంకములఁ దేవీపరిణ † య
మనెడు నాటకం బెంతయు నంద మొందె
మఱియు బదియంకములచేత మారుతసుత
నడచె బాలరామాయణ నాటకంబు

గీ. అరయ నారంభ బీజముల్ యత్న బిందు
లొనరఁ బ్రాప్త్యాశయుఁ బతాకయు నియతాప్తి
నల ప్రకరి ఫలాగమ కార్యములువరుసను
సంధి సంధికి రెండేసి జరిగివచ్చు.

వ. ఇంక గుణాదివృత్తలక్షణం బెట్టి దనిన.

గీ. జగతి శ్లేష ప్రసాదముల్ సమత మధుర
త సుకుమార తార్థవ్యక్త్యుదారతలును
మఱియు నోజసు కాంతి సమాధు లివియుఁ
బది గుణంబులు కవితకుఁ బ్రాణములును.

రీతులు:—

గీ. తనరు దశగుణములను వైదర్భి, గౌడి
యగును గాంతి నోజసునను, దిగియు మధుర

† మూలమున 'దేవి పరి కాయ' అని కలదు. 'ఇది దేవీపరిణయ' అని యుండఁదగును. 'దేవీపరిణయము'-(తొమ్మిదియంకములు) అను రూపక మొకటి శారదాతనయుని 'భావప్రకాశము'న నుదాహరింపఁబడినది. [చూ. 223, 237 పు.]

త సుకుమారతఁ బాంచాలి యొసఁగి యుండు
లాటి యీమూఁటి సామగ్రి సూటి మెఱయు.

వృత్తులు:—

గీ. భారతియు సాత్వతియు నారభటియు గైశి
కియు ననంగను వృత్తు లీక్రియవి నాల్గు
కలవు వైదర్భి పాంచాలి గౌడి లాటి
యనఁగ రీతిచతుష్కంబు దనరుఁ గృతుల.

క. ఆవృత్తులు నొకటొకటను
భావింపఁగ నాలుగేసి ప్రభేదంబై పదా
త్తైవర్తిలు సంగంబుల
తో వివరింపంగ సత్కృతులలో నిసఁగాన్.

సీ. భారతి ప్రహసనభాణప్రరోచనా
ముఖవిధు లనుఁ గంగములను దలిర్చు
సాత్వతి సల్లాప సాంఘాత్య పరివర్త
కోత్థాపకంబుల నొనరి యుండు
నారభటి యవపాతాఖ్య వస్తూత్థాన
సంక్షిప్త సంఫేట సంజ్ఞఁ బరఁగు
గైశికి దగు నర్మగర్భ నర్మస్ఫోట
నర్మ నర్మస్ఫింజ నవ్యగతుల
సంస్కృతము ప్రాకృతంబును శౌరసేని
పరఁగుఁ బైశాచియును నపభ్రంశికంబు
మాగధియు చూళికోక్తియు మఱియు దేశ్య
మనఁగ నివి యష్టభాషల కాహ్వయములు.

సీ. ఘన ముఖ ప్రతిముఖ గర్భ విమర్శ ని
ర్వహణాఖ్య సంధులు వరుస నైదు
లగు బీజ బిందు పతాకా ప్రకరులు కా
ర్యమన నైదయ్యె నర్థప్రకృతులు

ఆరంభ యత్నముల్ ప్రాప్త్యాశ నియతాప్తి
వర ఫలాగమ మీ యవస్థ లైదు
లీల విష్కంభ చూళికలు సంకాస్య మం
కావతార ప్రవేశాఖ్య లైదు
సూచనార్థాన్వితములు వస్తు వను పేరి
యందుఁ బ్రఖ్యాత ముత్పాద్య మనఁగ మిశ్ర
మనఁగ నివి మూఁటి సంఖ్యను నలరి యుండు
నాటకంబులయందు వానరకులేంద్ర.

వ. ఇది నాటకసంజ్ఞాప్రకరణం బయ్యె నింక దశవిధనాటకసంధిపం
చక చతుష్షష్ట్యంగాభిధాన లక్షణంబు లెట్టి వనిన.

సీ. నాటకము ప్రకరణము భాణము ప్రహస
నము డిమ వ్యాయోగ సమవకార
ములు వీథియును నంకమును మఱి యీహామృ
గముఁ గూడి దశరూపకంబు లిన్ని
నాటకంబను పేరఁ బాటిల్లు నిందుకు
సంధులు గల వైదు సరవిఁ దొడ
ముఖసంధియును బ్రతిముఖసంధియును గర్భ
సంధియును విమర్శసంధి మఱియు
వెలయు నుపసంహృతంబన వినఁగ దనరు
నఱువదియు నాల్గు నంగంబు లగుచు నుండు
భానుసంఖ్యను బదమూఁటఁ బంకజాప్త
సంఖ్య పదమూఁట మనుసంఖ్య జరగు వరుస.

వ. అంగంబులకు నామంబు లెట్టివనిన.

సీ. వరుస నుపక్షేప పరికరములు పరి
న్యాసంబును విలోభనమును యుక్తి
దగుఁ బ్రాప్తియును సమాధానంబు సంవిధా
న పరిభావనలు ననంగ నవల

బెరయు నుద్భేదన భేదకరణములు
హరిసంఖ్య ముఖసంధి కంగములగు
సవిలాసము పరిసర్ప విధూత శమన న
ర్మములు నర్మద్యుతి ప్రగమనములు
నన విరోధన పర్యుపాసనలు వజ్ర
మనఁగఁ బుష్పం బనఁగ నుపన్యాస మనఁగ
వర్ణసంహారమన నివి వహ్ని చంద్ర
సంఖ్య సంగముల్ ప్రతిముఖ సంధి కయ్యె.
సీ. ప్రబలు నభూతాహరణ మార్గ రూప క్రి
యము నుదాహరణంబు క్రమము సంగ్ర
హానుమానంబులు నల తోటకము నధి
బలము నుద్వేగ సంభ్రమములు ఫల
సాక్షేప మనునివియంగముల్ పండ్రెండు
గర్భసంధికి నాటకములయందు
నరవిత్తో నపవాద సంఫేట విద్రవ
ద్రవ శక్తులు ద్యుతియు నవ్వాల ప్ర
సంగమును ఛలన వ్యవసాయములు వి
రోధనంబును మీఁదఁ బ్రరోచన విచ
లనము లాదాన మివి యెన్నఁగను ప్రమోద
శము విమర్శసంధికి నంగసమితి యయ్యె.
సీ. తెనరు సంధియు విరోధ గ్రథనములు ని
ర్ణయమును బరిభాషణము ప్రసాద
మానంద సమయనంబు లట కృతి యనఁగను
నాభాషయు ననంగ నౌల మఱియు
నుపగూహ పూర్వభా వోపసంహార ప్ర
శస్తు లిన్నియు మను సంఖ్య నిర్వ

హణ సంధి కంగంబు లగు నైదు సంధులం
దలి చతుష్షష్ట్యంగము లిటు లెసఁగె
నింపు కవయవవ్యుత్పత్తి కెరఁగ వలయు
లలిత నాటక లక్షణ లక్ష్యములను
సమర భాష సంఖ్యావంతులైన కవులు
గళితదివసేంద్ర హరి కుల జలధి చంద్ర.

వ. ఇంక దశరూపనాటకభేదంబు లెట్లనిన మొదలి నాటకంబునందుఁ బ్రఖ్యాతమితివృత్తంబును, ధీరోదాత్తనాయకుండును, శృంగారవీర రసంబులు రసంబులు నగు, రెండవ ప్రకరణంబను నాటకమునం దుత్పాద్యమితివృత్తంబును ధీరశాంతనాయకుండును శృంగారరస ప్రాధాన్యంబునునగు, మూఁడవ భాణంబను నాటకంబునం దుత్పాద్యమితివృత్తంబును, ధూర్త విటనాయకుండును, శృంగారవీరరస సూచనమాత్రంబు నగు, నాల్గవ ప్రహసనం బను నాటకంబునందుఁ గల్ప్య మితివృత్తంబును, చాముండప్రభృతులు నాయకులును, హాస్యరస ప్రాధాన్యంబు నగు, నేనవ డిమంబను నాటకంబునందుఁ బ్రఖ్యాత మితివృత్తంబును, దేవగంధర్వ రాక్షస పిశాచాదులు ధీరోద్ధత నాయకులు పదియాఱ్గురునుత్తై యుండు రౌద్రరసప్రాధాన్యంబును నగు, నాఱవ యది యగు వ్యాయోగంబను నాటకంబునందుఁ బ్రఖ్యాత మితివృత్తంబును, ధీరోద్ధత నాయకుండును, వీర రసప్రాధాన్యంబును నై యుండు, నేడవయది యగు సమవకారం బను నాటకంబునందుఁ గల్పిత మితివృత్తంబును, దేవాసురాదులు పన్నిద్దఱు నాయకులును, వీరరసప్రాధాన్యంబునునై యుండు, నెని మిదవ వీథియను నాటకంబునందుఁ గల్పిత మితివృత్తంబును, ధీరోద్ధతనాయకుండును, శృంగారరససూచనామాత్రంబునై యుండుఁ దొమ్మిదవ యంకమను నాటకంబునందుఁ బ్రఖ్యాతమితివృత్తంబును ప్రాకృతజననాయకుండును, గరుణరసప్రాధాన్యంబునునై

యుండుఁ, బదియవది యైన యీహామృగంబను నాటకంబందు మిశ్రమితి వృత్తంబును, ధీరోదాత్తనాయకుండును, శృంగారరసప్రాధాన్యంబునునై యుండు, నిన్నియు దశరూపనాటకభేదంబులై ప్రవర్తిల్లు, నిది సప్రపంచములు సాంగంబుగఁ దెలియవలయు.

దశవిధరూపనాటకలక్షణము:—

సీ. వెలయంగ శృంగార వీర రసంబుల
రెంటిలో నొక రసం బంటి యుండ
నొనర నాయకుఁడు ధీరోదాత్తుఁడుగ నితి
వృత్తముల్ ప్రఖ్యాత విధము మీఱఁగఁ
బంచసంధులతోడఁ బ్రబలు సంగములుగా
భారతీవృత్తిసంపదయుఁ గలుగ
విద్వజ్జనోక్తుల విశదమై కనుపట్టు
మేటియా మొదలిటి నాటకంబు
స్థిరత కైశికీవృత్తోత్పాద్య ధీరశాంత
నాయకం బయ్యె శేషంబు నాటకమున
కెల్ల యట్లన రచియింప నెసఁగు ప్రకర
ణాఖ్య రెండవనాటకం బనిలతనయ.

సీ. శౌర్య సౌభాగ్య సంస్తవముల భారతీ
వృత్తియు శృంగారవీరరసము
లితివృత్త ముత్పాద్య మింపొంద నిపుణోక్తి
గల విట నేతృ సంకలిత ఘటన
ముఖమును నిర్వాహమును నను సంధులు
రెండును ధూర్తచారిత్రవర్ణ
నమును నేకాంకమై నలువొందు భాణము
మూఁడవ నాటకంబుగఁ దలిర్చు
నాల్గవది యైన ప్రహసన నాటకంబు
వరుస సంధ్యంగ లాస్యాంగ వర్ణనముల

నెట్ల భాణంబున నడచు నట్ల నడచు
హాస్యరసము ప్రధానమై యాంజనేయ.

వ. మఱియు.

సీ. పాషండ విప్రాది పటు చేట చేటి వి
టాకుల వేష భా షాలిహాస్య
సూక్తుల షండ కంచుకి తాపసాఘు కా
ముక వచో వేష ప్రముఖ గతులను
మహిత వీథ్యంక సమాకీర్ణ ధూర్త సం
కులములచేతను వెలయు శుద్ధ
వైకృత సంకీర్ణ వరసంజ్ఞలఁ ద్రివిధ
మై తత్ప్రహసనంబు రీతి వెలయు.
నతులదశరూపకోక్తిచేఁ గృతుల యందు
విశద నాటక కావ్యార్థవిదులు మెచ్చఁ
బవనతనుజాత లక్ష్మణప్రాణదాత
యనిశసంశ్రితజనగేయ యాంజనేయ.

సీ. సంధుల నవమర్శ సంధి యొక్కటి మాని
వృత్తులఁ గైశికీ వృత్తి విడిచి
శృంగార హాస్య రాహిత్య రౌద్రాదుల
నాలు గంకముల గంధర్వ దేవ
భూత యక్షాసుర ప్రేత పిశాచ ప
న్నగులు పదార్గురు నాయకులుగ
నింద్రజాల రణార్త చంద్రగ్రహణములు
మొదలైన చర్య లింపొదవఁ బన్ని
కడమ సామగ్రి నాటక గతి నమర్చి
యమరు వస్తు ప్రసిద్ధాప్తి నది డిమ మన

నైదవది యమ్యో దశరూప కాదులందు
భవ్యతరమహానాటక కావ్యకర్త.

సీ. ఖ్యాతేతివృత్తంబు గర్భావమర్శరా
హిత్యంబు డిమవద్రసేడితంబు
యుద్ధసంఘటనంబు నుద్ధతనాయకం
బును నది వ్యాయోగ మనఁగ బఱఁగె
నవమర్శవర్జితంబైన సంధులు నాట
కాఖ్యంబు నట్లన యాముఖంబు
సమరాసురాదినాయకులు పృథక్ఫలుల్
రవిసంఖ్య వీరాదిరసములును త్ర
యాంక వస్తు స్వభావ దైవాది కృతము
లమరకథరిత్రియామము లొక్కయామ
మర్ధయామము వరుస సంక్రితయాప్తి
సమవకారంబు దగు సప్తసంఖ్య హనుమ.

సీ. శృంగారరసము కైశికీవృత్తి భాణవ
దంగంబు లుద్ఘాత్యకాదులయిన
యంగముల్ పదుమూఁట నగును సువీథియు
న్నాటకం బెన్నఁగ నాగసంఖ్య
రసము కరుణముగఁ బ్రఖ్యాత మితివృత్త
మును శ్రీవిలాసంబు మొనసి యుండు
వాగ్వృద్ధమును భాణవత్సంధివృత్త్యాదు
లును నాయకులు ప్రాకృతనరులుగను
జాలఁ దగును నుత్సృష్టాంక సంజ్ఞ మెఱసి
యంక మనియెడి నాటకం బలరుఁ గృతులఁ
బ్రోది గనుపట్టు మఱి తొమ్మిదోది యగుచుఁ
రామ హిత కార్య శౌర్య సంగ్రామ ధుర్య.

ఆంధ్రసాహిత్యపరిషత్తు—ప్రతిష్ఠాపకులు.

శ్రీమహారాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు, పిఠాపురము మహారాజావారు; పరిషచ్ఛాశ్వతాధ్యక్షులు.

కీ. శే. శ్రీ వేంకటగిరి మహారాజావారు.

కీ. శే. శ్రీ బొబ్బిలిమహారాజావారు.

ఉద్ధారకులు.

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావుబహద్దరువారు-ఉయ్యూరు జమీందారువారు.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యనిర్వాహకసభావర్గము.

కార్యనిర్వాహకసభాధ్యక్షులు.

జయంతి రామయ్యపంతులుగారు, బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

కిడాంబి రాఘవాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

వింజమూరి వెంకన్నపంతులుగారు, ఎం. ఏ.

కార్యనిర్వాహకసభాసభ్యులు.

దివాన్ బహద్దర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయుడుగారు, (కోశాధ్యక్షులు).

పెద్దాడ రామస్వామిగారు, యం. ఏ., ,,

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

శ్రీమాన్ గొడవర్తి జగన్నాథస్వామిగారు, యం. ఏ., యల్. టి.

దర్భా వేంకటశివరామరాసుగారు, బి ఏ., బి. యల్.

అళక్కి వేంకట్రామయ్యగారు.

కేశవరపు రామరాజుగారు.

కోకా వేంకటసుబ్బారావునాయుడుగారు.

ఓలేటి వేంకటరామశాస్త్రిగారు, శతావధాని.

పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు.

పిల్లారిసెట్టి రంగబ్రహ్మారావునాయుడుగారు.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు.

—ప్రథమభాగము—

ఇది బహువిధముల నాంధ్ర నిఘంటువు లన్నింటికంటె మి
శ్రేష్ఠ మైనది. సంస్కృతపదములకుఁ, దెనుఁగుపదములకుఁ వానిప్ర
గములకుఁ దడవికొననక్కఱ లేదు. విద్యార్థులకుఁ గవులకు నీనిఘ
ననేకవిధముల సమస్తసహాయమును జేయును.

సాదాప్రతి రు 5 లు. అట్టుపేపరు ప్రతి రు 7

రఘునాథరామాయణము.

ప్ర థ మ భా గ ము.

తంజావూరు రఘునాథభూపాలుఁడు రచించినదానిలోని తొ
భాగము! ఈభూపాలునికే చేమకూర వేంకటరాజకవి విజయవిలాస
సంకితము చేసినది. ఈరాజకవి కవిత్వము మృదుమధురమైనది. కల్పన
మనోహరములు, పాఠకలోక మీతని ద్విపదనలచరిత్రమును, వా
చరిత్రమును జదివియేయుందురు, కావున, మేము వేఱుఁగఁ జెప్పనక్క
యుండదు.

వెల రు. 0-8

ఆంధ్రసాహిత్య పరిషత్కార్యదర్శులు, కాకినాడ.

Printed by N. Achutaramiah at the Cocanada Printing Works, Cocan